తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
నిజామాబాద్ : fb.com/vaartha Digital
Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
7-5-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 96 పేజీలు: 10+4 వెల: 6.50





బుధవారం లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాను మర్యాద పూర్వకంగా కలిసిన భద్రతా సలహాదారు శివధర్ రెడ్డి

# భద్రతా సలహాదారుగా బాధ్యతలు చేబట్టిన శివధర్ రెడ్డి

## గవర్నర్‌తో మర్యాద పూర్వకంగా భేటీ

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ భద్రతా సలహాదారుగా నియమితులైన శివధర్ రెడ్డి బుధవారం నాడు కమాండ్ కంట్రోల్ లోని బి బ్లాక్‌లో ఎనిమిదవ అంతస్తులో గల తన ఛాంబర్‌లో బాధ్యతలు చేబట్టారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆయనకు ఆశీర్వచనం ఇచ్చారు. గత నెల 30వ తేదీన శివధర్ రెడ్డి డిజిపిగా పదవీ విరమణ చేయడం తెలిసిందే. అదే రోజున ఆయనను భద్రతా సలహాదారుగా స ర్కారు నియమించడం విదితమే. కాగా భద్రతా సలహాదారుగా పదవీ స్వీకరించిన తరువాత శివధర్ రెడ్డి గవర్నర్ శివప్రతాప్ శుక్లాను లోక్ భ వన్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. కొత్త పదవిలో నియమితులైన తరువాత శివధర్ రెడ్డి గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో భేటీ అవడం ఇదే తొ లిసారి. కాగా శివధర్ రెడ్డిని భద్రతా సలహాదారుగా నియమించడాన్ని ధన్‌పాల్ రావు అనే వ్యక్తి హైకోర్టులో సవాల్ చేయగా ఈ పిటిషన్‌ను వి చారణకు స్వీకరించిన ధర్మాసనం దీనిపై విచారణ వాయిదా వేసింది.

# నేటి నుంచి జూన్ 5 దాకా హైకోర్టుకు వేసవి సెలవులు

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:** రాష్ట్ర హైకోర్టుకు గురువారం నుంచి వచ్చే జూన్ నెల ఐదవ తేదీ వరకు వేసవి సెలవులను ప్రకటించారు. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దీంతో పాటు ఈ నెల 16, 23, 30వ తేదీలలో మూడు శనివారాలు కూడా హైకోర్టుకు సెలవులు ప్రకటించినట్లు రిజిస్ట్రార్ జనరల్ తెలిపారు. కాగా సెలవుల సందర్భంగా ఈ నెల 12, 19, 26, జూన్ రెండవ తేదీలలో సింగిల్ బెంచ్, డివిజన్ బెంచ్‌లు ప్రత్యేకంగా పనిచేస్తాయని ఆయన తెలిపారు.

# ఫేజ్-2ను ఆమోదించండి

>> ప్రభుత్వం ఫేజ్-2లో ఏడు కారిడార్లతో మొత్తం 122.9 కి.మీ మేర విస్తరణకు, రూ.38,595 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన సమగ్ర డీపీఆర్‌ను ఇప్పటికే సమర్పించామని సీఎం తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 ప్రాజెక్ట్‌ను భారత ప్రభుత్వం - తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా చేపట్టేందుకు త్వరగా ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగర భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఆర్జీఐ ఎయిర్‌పోర్ట్ - భారత్ ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను మెట్రో ఫేజ్-3గా చేపట్టాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మెట్రో ఫేజ్-3కిసంబంధించిన డీపీఆర్‌ను ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. సమావేశంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి కె.శ్రీనివాస్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, హెచ్ఎంఆర్ఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పట్టణ రవాణా) ఎన్.వి.ఎస్.రెడ్డి, ఢిల్లీ తెలంగాణ భవన్ ప్రత్యేకాధికారి సంజయ్ కుమార్, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయ కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# 'సుప్రీం'కు మమత!

>> చెప్పారు. ఇదే విషయాన్ని అభిషేక్ బెనర్జీ కూడా చెప్పాడు. ఎన్నికల ప్రక్రియకు నిరసనగా తాము పదవిలో కొనసాగాలను కుంటున్నట్లు చెప్పింది. కేంద్రం చర్యలు తీసుకోవాలంటే రాష్ట్రపతి పాలన విధించవచ్చని, అయితే, ఈ విషయం అధికారిక రికార్డుల్లో నమోదు కావాలని మమతా పేర్కొన్నారు. బెంగాల్ రాజకీయాల్లో ట్విస్టులు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీ 294 స్థానాలకు గానూ 207 స్థానాలు గెలుచుకుని బంపర్ విక్టరీ సాధించింది. మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) 80 స్థానాలకు మాత్రమే పరిమితమై ఘోర పరాజయాన్ని మూట కట్టుకుంది. ఇదిలా ఉంటే, ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, తాను సీఎం పదవికి రాజీనామా చేసేది లేదని మమతా స్పష్టం చేశారు. 100 స్థానాల్లో విజయాన్ని దొంగిలించారంటూ బీజేపీపై మండిపడింది. కేంద్ర ఎన్నికల సంఘం, బీజేపీ కలిసి ఎన్నికల్ని అక్రమంగా నిర్వహించాయని ఆరోపించారు. బెంగాల్‌చరిత్రలో ఇదొక బ్లాక్‌డే అని నన్ను డిస్మిస్‌చేయమనండి నేను మాత్రం రాజీనామా చేయనని ఆమె స్పష్టంచేసారు. గతనెల 29వ తేదీనుంచి బెంగాల్‌లో ఎన్నికలనంతరం జరిగిన ఎన్నికల హింసపై తాను న్యాయస్థానానికి వెళతానని ఆమె హెచ్చరించారు.

## మౌనం వీడిన మహువా మొయిత్రా

**కోల్‌కత్తా, మే 6:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చారిత్రాత్మక విజయం సాధించిన నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ మహువా మొయిత్రా తన మౌనాన్ని వీడారు. ప్రజల తీర్పును గౌరవిస్తున్నామని, అయితే అసమాన ప్రతికూలతల మధ్య తమ పార్టీ గొప్ప పోరాటం చేసిందని ఆమె అన్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఆమె ఒక పోస్ట్ చేశారు. ప్రజల తీర్పే శిరోధార్యం. బెంగాల్ బీజేపీని కోరుకుంటే, వారికి బీజేపీ లభించింది. మేము దానిని గౌరవిస్తాం. ఊహించని ప్రతికూలతల మధ్య మేము మంచి పోరాటం చేశాం. అందుకు నా నాయకురాలు, నా పార్టీ పట్ల గర్వపడుతున్నానని ఆమె పేర్కొన్నారు. బలప్రయోగంతో కూడిన మెజారిటీవాదం కాకుండా, రాజ్యాంగమే తుది నిర్ణయంగా ఉండే లౌకిక దేశం కోసం తాము పోరాడుతూనే ఉంటామని ఆమె స్పష్టం చేశారు. నిజానికి, ఓట్ల లెక్కింపు రోజు ఉదయం మహువా మొయిత్రా చాలా చురుగ్గా ఉన్నారు. ఈవీఎంల ట్యాంపరింగ్ జరుగుతోందని, స్ట్రాంగ్‌రూమ్‌లలో విద్యుత్ కోతలు విధిస్తున్నారని ఆరోపించారు. అయితే, ఫలితాలు బీజేపీకి అనుకూలంగా రావడం మొదలయ్యాక ఆమె పూర్తిగా నిశ్శబ్దంగా ఉండిపోయారు. ఫలితాల్లో బీజేపీ 206 స్థానాలు గెలుచుకుని మూడింట రెండొంతుల మెజారిటీ సాధించింది. దీంతో 15 ఏళ్ల టీఎంసీ పాలనకు తెరపడింది. మహువా మొయిత్రా ప్రాతినిధ్యం వహిస్తున్న కృష్ణానగర్ లోక్‌సభ నియోజకవర్గంలోని పలు అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ బీజేపీ గెలిచింది.

# రేషన్ ద్వారా జొన్నలు

>> అందించడం వల్లన పేద ప్రజలకు ప్రయోజనం జరగడమే కాకండా వారి ఆకలి తీర్చడంలో ముఖ్యమపాత్ర పోషిస్తుందని ప్రభుత్వం చెబుతోంది. రేషన్ కార్డుదారులకు సన్న బియ్యంతోపాటు పౌష్టికాహారమైన జొన్నలను కూడా పంపిణీ చేయాలన్న నిర్ణయానికి సంబంధించి ప్రాథమిక కసరత్తును సర్కారు వేగవంతం చేసింది. రాష్ట్ర మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా సేకరించిన జొన్నలు, మొక్కజొన్నలను రేషన్ షాపుల ద్వారా ప్రజలకు నేరుగా అందుబాటులోకి తేవాలని అధికారులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఇప్పటికే ఆదేశించారు. అదేవిధంగా ప్రభుత్వ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారం అందించడంలో భాగంగా జొన్నలను వినియోగించాలని సూచించారు. ఈ నేపథ్యంలో కేవలం వరి అన్నం మాత్రమే కాకుండా చిరుధాన్యాల వాడకాన్ని పెంచడం ద్వారా ప్రజల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. త్వరలోనే ఈ జొన్నల పంపిణీ విధానం అమల్లోకి రానుంది. అదే సమయంలో రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సర్కారు, జొన్నలు, మొక్కజొన్నలకు మద్దతు ధర కల్పించేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. మార్కెట్‌లో ధరలు తగ్గుతున్న నేపథ్యంలో మొక్కజొన్నలతో పాటు జొన్నలను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కేబినెట్ సబ్ కమిటీ తీర్మానించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి మద్దతు లేకపోయినప్పటికీ రాష్ట్ర నిధులతోనే ఈ సేకరణ ప్రక్రియను చేపట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. దీంతో యాసంగి సీజన్‌లో పండించిన జొన్న పంటను కొనుగోలు చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఇక రాష్ట్రంలో పండించే మక్కలను నేరుగా పౌల్ట్రీ రైతులకు కేటాయించాలని, ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. కాగా.. ఇప్పటికే పొరుగు రాష్ట్రం ఏపిలో రేషన్ దుకాణాల ద్వారా జొన్నలు, రాగులు పంపిణీ చేస్తున్నారు. కొంత బియ్యం కోటాకు బదులు రాగులు, జొన్నలు అందిస్తున్నారు.

## వారం - వర్జ్యం

07-05-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, కృత్తిక కార్తె
పంచమి ఉ.10.13
పూర్వాషాఢ సా.6.44
వర్జ్యం : రా.3.35-తె.5.21
దు.ఉ.9.55-ఉ.10.46, 2)మ.3.03-మ.3.54
శుభసమయం : ఉ.7.30-8.30
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** వృత్తి ఉద్యోగములలో మీరు ఆశించిన మార్పులు, బదిలీలు జరుగుతాయి. ఖర్చులు అధికమవుతాయి.

**వృషభం:** ప్రయాణాలు చేసేటప్పుడు మెలుకువ తోటి ప్రవర్తించండి. వివాహ యత్నాలు ముమ్మరం చేస్తారు.

**మిథునం:** అనాలోచితంగా మీరు పెట్టిన పెట్టుబడులకు కొద్దిపాటి నష్టము కలుగవచ్చును. ఆరోగ్య విషయంలో జాగ్రత్త.

**కర్కాటకం:** గృహ నిర్మాణము, భూమి మొదలైన వాటిలో అభివృద్ధి కనిపిస్తుంది. కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

**సింహం:** ఒకరికి అప్పు ఇవ్వడం, అప్పు తీసుకోవడం రెండూ చేయకండి. సాంకేతిక విద్యావకాశాలు పొందుతారు.

**కన్య :** ఎంత సహాయం చేసిన సంతృప్తి చెందని సోదర వర్గాన్ని చూసి అసహనానికి లోనవుతారు. వాహన సౌఖ్యం కలదు.

**తుల :** మానసిక ధైర్యం అన్నిటి కన్నా గొప్పదని గుర్తించండి. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. వస్త్రలాభం.

**వృశ్చికం:** కుటుంబ వృద్ధికి సంతాన పురోగతికి దైవానుగ్రహం వల్ల మంచి అవకాశాలు కలిసి వస్తాయి.

**ధనుస్సు:** మీ ప్రమేయం, పర్యవేక్షణ నామ మాత్రంగా ఉన్న సందర్భాలలో సైతం మీ వాళ్ళు మంచి పురోగతి సాధిస్తారు.

**మకరం:** ఎంతో ఊరట కలిగించే పరిణామము ఎదురువుతాయి. కృషి, పట్టుదల క్రమశిక్షణ మరింత మేలు చేస్తాయి.

**కుంభం:** మీడియా ప్రచార సాధనాల వల్ల మధ్యస్తమైన ఫలితాలు ఉంటాయి. ఆర్థికంగా చెప్పుకోదగిన అభివృద్ధి ఉండదు.

**మీనం:** ఎంతో శ్రమిస్తే గాని ఫలితం దక్కదన్న సత్యాన్ని తెలుసుకుంటారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్త.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అకాల వర్షాలకు నలుగురు రైతులు బలి

>> వరి ధాన్యాన్ని కాపాడుకోవాలని కల్లాల వద్దకు వెళ్లిన రైతులపై మృత్యువు విరుచుకుపడింది. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలంలోని కొత్తూరు, గంపలపల్లి గ్రామాల్లో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షం, ఈదురుగాలుల కారణంగా రెండే వేర్వేరు ఘటనల్లో నలుగురు రైతులు మృతిచెందారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. గంపలపల్లిలో ధాన్యంపై పరదాలు కప్పేందుకు వెళ్లి వర్ష ఎక్కువ కావడంతో పక్కన షెడ్డులోకి వెళ్లిన తనుగుల నాగరాజు, అభిరామ్ తండ్రీ కొడుకులపై గోడ కూలి మృతి చెందారు. కొత్తూరు గ్రామంలో వరి ధాన్యం పై పరదాలు కప్పేందుకు వెళ్లిన రైతులు ఆరుగురు మీద గోడ కూలి పడింది. ఈ ఘటనలో గుండారపు వెంకటేష్ (కొత్తూరు) రైతు మృతి చెందారు. ముత్యంపేట గ్రామానికి చెందిన నెల్కి లచ్చన్న అనే వ్యక్తి లక్షెట్టిపేటలో తన కొడుకును బస్సు ఎక్కించి తిరిగి ఇంటికి వెళ్తూ వర్షం పడుతుందని కొత్తూరులో రైతులు ఆగిన దగ్గర ఆగారు. ఈ క్రమంలో గోడ కులడంతో ఆయన సైతం మృతి చెందారు. ఘటనలో గాయ పడిన మరో నలుగురిని మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లుగా సమాచారం. భారీ ఈదురుగాలుల ప్రభావంతో లక్షెట్టిపేట పరిసర ప్రాంతాల్లో జనజీవనం స్తంభించిపోయింది. అనేక చోట్ల భారీ వృక్షాలు విరిగి రోడ్లపై పడ్డాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో మండల వ్యాప్తంగా అంధకారం నెలకొంది. రోడ్లపై చెట్లు పడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.
ఇక.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి వడ్లు, మొక్కజొన్నలు నీటిపాలయ్యాయి. ప్రభుత్వం వడ్లు , మక్కలు కొనుగోలు చేయడంలో నిరక్ష్యం వహించడంతో రైతులు కల్లాల్లో రోడ్లపై ధాన్యాన్ని ఆరబోసుకున్నారు. ఈ క్రమంలో అకాల వర్షానికి ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. జిల్లాలో సుమారుగా 20.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యధికంగా మల్హార్, మహాదేవపూర్, పలిమెల మండలాల్లో వర్షపాతం నమోదయింది. అదేవిధంగా.. ఉమ్మడి మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. పెద్దపల్లి జిల్లా మంథని ప్రాంతంలో ఈదురుగాలుల బీభత్సా నికి భారీ వర్షం తోడవడంతో కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వడ్లు, మొక్కజొన్నలు తడిసి ముద్దయ్యాయి. సిద్దిపేట జిల్లా గజ్వేల్, జగదేవ్‌పూర్ ప్రాంతాల్లో కురిసిన వర్షానికి మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటలు నీటిపాలయ్యాయి. కళ్లముందే పంట పాడవుతుండడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. మరోవైపు.. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం గద్దపాక గ్రామానికి చెందిన రైతు ఐలయ్య ఇటీవల పంటను కోశాడు. వడ్లను కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాడు. కానీ ప్రభుత్వం పంట కొనుగోళ్లలో జాప్యం చేస్తుండటంతో తీవ్ర వేదనకు గురయ్యాడు. ఈ క్రమంలోనే మంగళవారం సాయంత్రం మబ్బులు కమ్మేయడంతో వర్షం పడేలా ఉందని ఎండబోసిన వడ్లను వెంటవెంటనే కుప్పపోశాడు. ఈ క్రమంలో గుండెపోటుకు గురై అక్కడే కుప్పకూలాడు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తమకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

**తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం:మంత్రి శ్రీధర్ బాబు**

**మంథని, ప్రభాతవార్త:** అకాల వర్షాలకు తడిసినా వరి ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం మంథని మార్కెట్ యార్డులో అకాల వర్షానికి తడిసిన వరి ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా రైతులు నష్టపోకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి నాగేశ్వరరావు అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని తెలిపారు. దీనికి సంబంధించి జిల్లా కలెక్టర్ ద్వారా అధికారులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని మంత్రి భరోసా కల్పించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రవాణా ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లారీలు, హమాలీల కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో అవసరమైన మేర గన్నీ బ్యాగులు, టార్పాలిన్ అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వం ఎప్పటికప్పుడు రైతు సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందని మంత్రి పేర్కొన్నారు. ఈ పర్యటనలో మంత్రి వెంట జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, మంథని మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, ఆర్డిఓ సురేష్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# విజయ్‌కి షాక్!

>> రెండుస్థానాలు గెలిచిన ఐయుఎంఎల్‌కానీ, రెండుస్థానాలతో ఉన్న సిపిఐకాని మద్దతు తెలపలేదు. సరికదా డిఎంకె కూటమిలోనే ఉంటామని తెగేసి చెప్పాయి. అయితే ఇపుడు తమిళనాడులో మరో సరికొత్త పొత్తుల వ్యూహం తెరపైకి వచ్చింది. ద్రవిడేతర పార్టీలకు చోటు కల్పించకూడదన్న పటిష్టమైన సంకేతాలిస్తూ బద్ధ శత్రువులుగా మారిన రెండు ప్రాంతీయ పార్టీలు ఇపుడు ఒకే వేదికపైకి వస్తున్నాయన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి. పైపైకి అదేమీలేదని చెపుతున్నప్పటికీ స్టాలిన్ నేతృత్వంలోని డిఎంకె, పళనిసామి నేతృత్వంలోని అన్నా డిఎంకె పార్టీలు ఒక్కటి అవుతాయని, పొత్తులు కుదిరితే ఇతరులను కలుపుకుని ప్రభుత్వం ఏర్పాటుకు సై అంటున్నాయన్న వార్తలు విస్తృతంగా వెలుగుచూసాయి. అయితే చర్చలు జరిగిన మాట వాస్తవమేనని, ప్రస్తుత పరిస్థితుల్లో అన్నాడిఎంకెనుకానీ, పళనిసామినికాని బతించాల్సిన అవసరం డిఎంకెకు లేదని పార్టీ అధినేత స్టాలిన్‌కు పార్టీ సీనియర్లు బహుముఖంగా వివరించినట్లు సమాచారం. ఇప్పటికిప్పుడు స్పష్టత రాకపోయినప్పటికీ డిఎంకెకు 59 స్థానాలు, ఎడిఎంకెకు 47 స్థానాలు గెలుచుకున్నాయి. ఈక్రమంలో రెండూ కలిసినా 106 స్థానాలు మాత్రమే వస్తున్నాయి. మ్యాజిక్ ఫిగర్ 118 స్థానాలు అవసరం కావడంతో కనీసం మరో 14స్థానాలు అవసరం అవుతున్నాయి. దీనితో ఇపుడు తమిళనాట ప్రభుత్వం ఏర్పాటులో తీవ్ర సందిగ్ధత నెలకొంది. ఇదిలా ఉంటే విజయ్ తన పార్టీ నేతలతోకలిసి గవర్నర్ వి.ఆర్లేకర్‌ను కలిసి తమను ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాలని పక్షం రోజులు వ్యవధినిస్తే మెజార్టీని నిరూపించుకుంటామని లేఖ ఇచ్చారు. అయితే గవర్నర్ మాత్రం సంఖ్యాబలం తక్కువ ఉన్నందున న్యాయపరంగా సమీక్షించిన తర్వాతనే నిర్ణయం ప్రకటిస్తామని ప్రకటించడంతో లోక్‌భవన్‌నుంచి విజయ్ వెళ్లిపోయారు. మెజార్టీ స్థానాలు సంఖ్యాపరమైన జాబితా ఇవ్వాలని గవర్నర్ న రాచించినట్లు న సమాచారం. ప్రస్తుతం విజయ్‌వద్ద 112 మంది జాబితామాత్రమే ఉంది. మరో ఆరుగురు తక్కువ ఉండటంతో గవర్నర్ ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించలేమనిచెప్పారని సమాచారం. నిజానికి 108 స్థానాల్లో ఉన్న విజయ్‌కు ఐదు స్థానాల కాంగ్రెస్ మాత్రమేమద్దతుప్రకటించింది. దీనివల్ల 113 స్థానాలుమాత్రమే బలం సాధించినట్లవుతుంది. విజయ్ గెలిచిన రెండుస్థానాల్లో తిరుచ్చి ఈస్ట్ మినహాయిస్తే 112 స్థానాలే అవుతాయి. దీనితో కనీసం మరో ఎనిమిది మంది ఎమ్మెల్యేలు కనీసం మద్దతుఅవసరం అవుతుంది. అదే అనుకుంటే మిగిలిన చిన్న పార్టీలు మద్దతిస్తే మొత్తం 120 స్థానాలు అవుతాయి. అయితే చర్చల్లో సిపిఐ మద్దతు లేదని ప్రకటించినా మారే అవకాశాలుమాత్రం పుష్కలంగా ఉన్నాయి. అలాగే డిఎంకె, అన్నాడిఎంకెలు ఒక్కటిగా కలిసినా ఇతర పార్టీలవైపు చూడక తప్పదు. ఈక్రమంలో విజయ్ ప్రమాణస్వీకారం సందిగ్ధంలో పడటంతో గురువారం జరగాల్సిన ప్రమాణస్వీకారాన్ని రద్దుచేసినట్లు పార్టీ నేతలుప్రకటించారు.
పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు తిరుగుబాటు సమావేశం ఏర్పాటుచేసి షణ్ముగం ఆధ్వర్యంలో టివికెను కలిసి మద్దతివ్వాలని నిర్ణయించినట్లు వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని పార్టీ డిప్యూటి జనరల్ సెక్రటరీ కెపి మునుస్వామి ఖండించారు. ఎట్టిపరిస్థితుల్లోను టివికెకు మద్దతు ఇవ్వమని వారు చెప్పారు. తమనేత పళనిస్వామి ఆదేశాలమేరకే తాము ఈస్పష్టత ఇస్తున్నామని వెల్లడించారు.
స్టాలిన్‌నేతృత్వంలోని డిఎంకె ఇప్పటికే ఎవరికీ మద్దతు ఇచ్చేదిలేదని స్టాలిన్ చెప్పకపోయినా సీనియర్లు మాత్రం చెపుతున్నారు. సమీకరణాలు మారితే అటు అన్నాడిఎంకెకానీ ఇటు డిఎంకె కానీ పొత్తుల్లోకి రావచ్చన్న ప్రచారం కూడా ముమ్మరంగా సాగుతోంది. అయితే అధినేతల సమాలోచనలు జరిగాయని ఇద్దరు మాజీ సీఎంలు కలుసుకుని రాష్ట్ర తాజా రాజకీయాలపై విస్తృతంగా చర్చించినట్లు తెలుస్తోంది.



బుధవారం గౌహతిలోని లోక్‌భవన్‌లో గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్యకు రాజీనామా లేఖను అందజేస్తున్న అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ

తెలంగాణ ప్రభుత్వం
**పురపాలక సంఘ కార్యాలయము, సిరిసిల్ల**
ఆసక్తి వ్యక్తీకరణ (EOI)-2nd Call
నెం. E1/2207/2026/2 తేది: 06.05.2026
ఇందుమూలంగా ఆసక్తి గల ఏజెన్సీలు లేదా వ్యక్తుల నుండి సిరిసిల్ల పట్టణములోని కరీంనగర్ రోడ్డులో గల కొత్త చెరువు బండ్ మరియు పార్క్ రెండు సంవత్సరాల కాలం ఆపరేషన్ & నిర్వహణ కొరకు గాను ఆసక్తి వ్యక్తీకరణ (EOI) కోరనైనది. కావున, ఆసక్తి గల ఏజెన్సీలు లేదా వ్యక్తులు తేది: 12.05.2026 సా.4.00 గంటల వరకు దరఖాస్తు రుసుము రూ.5,000/- (Non Refundable) మునిసిపల్ కమిషనర్ గారి పేరుపై డి.డి రూపేన జత చేసి మీ యొక్క దరఖాస్తుతో పాటు ప్రతిపాదనలు సిరిసిల్ల పురపాలక సంఘం కార్యాలయం సమర్పించవలయును మరియు ఇతర వివరముల కొరకు ఆఫీసు పని వేళలలో మున్సిపల్ కార్యాలయములో గల ఇంజనీరింగ్ విభాగమునందు సంప్రదించగలరు. నిబంధనలు వర్తిస్తాయి (ఫోన్ నెం. 8978859590)
సం/-. కమిషనర్, పురపాలక సంఘము, సిరిసిల్ల.
DIPR.NO. 2014-PP/CL/ADVT/1/2026-27 తేది: 06.05.2026

తెలంగాణ ప్రభుత్వం
**పోలీస్ విభాగం**
డైరెక్టర్ TG FSL వారి కార్యాలయం, రెడ్ హిల్స్, హైదరాబాద్ ఫోన్: 040-29394449
టెండర్ ప్రకటన
Rc.No. TGFSL-STOR/MISC/15/2025-26 తేది: 04.05.2026
ఉత్పత్తి దారులు మరియు అధీకృత డీలర్ల నుండి సాంవత్సరిక రేట్ కాంట్రాక్ట్ కొరకు ఈ క్రింది ఐటమ్‌ల సరఫరాకు అవార్డ్ ప్రారంభ తేదీ నుండి ఒక సంవత్సర కాలానికి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారంపై టెండర్‌లు (Id No. 696537) కోరబడుతున్నవి. పనితీరు సంతృప్తిగా వుంటే, ఇరు పార్టీలచే (ఒక సంవత్సరం దాటకుండా) తదుపరి ఒక సంవత్సర కాలానికి లేదా పరస్పర అంగీకారం విధంగా కాంట్రాక్ట్ పొడిగించవచ్చు. టెండర్ డాక్యుమెంట్‌లోని ఒక్కొక్క కేటగిరీకి జతపరచబడిన అనుబంధాల ప్రకారం క్రింది ఐటమ్‌ల యొక్క సరఫరా నిమిత్తం రేట్ కాంట్రాక్ట్. సరఫరా చేయవలసిన వస్తువు పేరు మరియు ఐటమ్‌ల యొక్క సంఖ్య: 1. రసాయనిక ఐటమ్‌లు-397. 2. గాజు సామగ్రి - 178. 3. కంప్యూటర్ స్టేషనరీ-187. 4. వివిధరకాలు-166. 5. విద్యుత్ సంబంధమైనవి-42. 6. ప్రి-ప్రింటింగ్ ఐటమ్‌లు-13. 7. DNA కిట్స్ -54.
సం/-. డైరెక్టర్, TG FSL, హైదరాబాద్.
DIPR.NO. 2021-PP/CL/ADVT/1/2026-27 తేది: 06.05.2026

## ధాన్యం కొనుగోళ్లపై విపక్షాల దుష్ప్రచారం

>> ఏర్పాట్లు చేశామని, అదనంగా 11.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసేందుకు గోదాముల గుర్తించామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేందుకుగాను 6,200 వాహనాల ఏర్పాటు చేశామని చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు చనిపోతే తక్షణమే పరిహారం అందించాలని అధికారులను ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఉదయం, సాయంత్రం పూట కొనుగోళ్లకు ఆదేశాలు జారి చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎప్పటికప్పుడు రాష్ట్రస్థాయి నోడల్ అధికారితో పర్యవేక్షణ జరిపిస్తున్నామని చెప్పారు. ప్రత్యేకంగా పౌర సరఫరాలశాఖ రాష్ట్ర కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామన్నారు. వాతావరణంలో సంభవిస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాలకు సమాచారం అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. తాలు పేరుతో కోత విధిస్తే కఠిన చర్యలు ఉంటాయని అధికారులను ఆదేశించారు. వాస్తవాలు ఇలా ఉంటే బిఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వరుసగా నాలుగు ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించినా ఆపార్టి నేతలు గుణపాఠం నేర్చుకోలేదని మండిపడ్డారు.

## భూములపై సుప్రీం కీలక తీర్పు

>> గతంలో జారీ చేసిన ఉత్తర్వులు యథాతథమని స్పష్టం చేసింది. దాంతో 1950 నాటి నిజాం కాలపు ఫారెస్ట్ గెజిట్ నోటిఫికేషన్‌ను సవాలు చేసిన అప్పీలుదారులకు చుక్కెదురు అయింది. పట్టా సర్టిఫికేట్ లేకుండా కేవలం పహాణీలు, ఫైసల్ పట్టీల ఆధారంగా యాజమాన్య హక్కులు రావని ఈ సందర్భంగా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.
రెవెన్యూ రికార్డులు కేవలం పన్నుల అవసరాల కోసం మాత్రమేనని వెల్లడించింది. అప్పీలుదారులు తమ క్లెయిమ్‌ను నిరూపించే అసలు డాక్యుమెంట్లు సమర్పించ లేదని సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ సందర్భంగా పేర్కొంది. ఈ భూములపై దశాబ్దాలుగా సాగుతున్న న్యాయ పోరాటానికి సుప్రీంకోర్టు తీర్పుతో తెరదించినట్లు అయింది.

**బంగారం వేలం నోటీసు**
**బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ ("BFL");**
**రిజిస్టర్డ్ కార్యాలయం: ముంబయి - పూణె రోడ్డు, అకుర్డి, పూణె 411035**

రుణగ్రహీత(లు) మరియు సాధారణ ప్రజానీకానికి ఇందు మూలంగా తెలియచేయునది ఏమనగా ఈ కింద పేర్కొనబడిన రుణగ్రహీతలుకు పలుమార్లు నోటీసులు పునరావృతం చేసినప్పటికీ తిరిగి చెల్లింపు చేయడం లో విఫలమయ్యారు లేదా కావలసిన లాభం కేటాయించడం లో విఫలమయ్యారు, ఈ పేర్కొనబడిన కారణం వలన, లోన్ చెల్లింపు కోసం సెక్యూరిటీగా రుణగ్రహీత(లు) అందచేసే గోల్డ్ ఈ కింది నియమాలకు లోబడి "యథాతథంగా" వేలం వేయబడుతుంది:

1. పబ్లిక్ నోటీసు యొక్క పూర్తి వివరాలు యాక్సెస్ చేయడానికి కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. (గోల్డ్ వివరాలు & స్థూల బరువు), 2. http://172.30.1.235:3000/?WOU82OG9WU పై పూర్తి బిడ్డర్ నియమాలు ఉపలబ్ధం ఉన్నాయి 3. వేలం వేసే రోజు లేదా అంతకంటే ముందుగా ఆన్‌లైన్ ద్వారా బిడ్డర్స్ ₹25,000/- ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (EMD) తప్పనిసరిగా డిపాజిట్ చేయాలి; 4. వేలం వేసే వేదిక వద్ద ఉదయం 10 గంటలకి చెల్లుబాటయ్యే గుర్తింపు & చిరునామా తో తప్పనిసరిగా వ్యక్తిగతంగా హాజరు కావాలి.

వేలం తేదీ లో ఏదైనా మార్పు గురించి వేలం కేంద్రం లో ప్రదర్శించబడుతుంది. బిడ్ సమర్పణ పైన పేర్కొన్న నియమాలను అంగీకరించినట్లుగా పరిగణించబడుతుంది. ఏవైనా సందేహాల కోసం, wecare@bajajfinserv.in ను సంప్రదించండి.

(10-06-26): **ఆర్మూర్ - అంబేడ్కర్ చౌరాస్తా;** PB56SGL17990656. **బాన్సువాడ - బస్ స్టాండ్;** PCV9SGL17837441. **భద్రాచలం - ఆర్‌టీసీ బస్ స్టాండ్;** PEK5SGL17655804, 17764524, 17900600, 18309142. **భైంసా - నిర్మల్ రోడ్;** PPA4SGL17407734, 17441704, 17449850, 17444474, 17791117, 17795588, 17956459, 17964837, 17987984, 17994041. **భోధన్ - నాందేడ్ మెయిన్ రోడ్;** PEJ7SGL17403104, 17635027, 17857599. **భూపాలపల్లి - మైన్ రోడ్;** PCW2SGL17766069, 18002428. **గద్వాల్ - రాజీవ్ మార్గ్;** PCW4SGL17867885, 18222359. (11-06-26) **గజ్వేల్ - పిడ్జేడ్;** PEJ6SGL17790496, 17902757, 17982902. **హాలియా - దేవరకొండ మెయిన్ రోడ్;** PGC7SGL17651242, 17718027. **ఇబ్రాహింపట్నం - బీజేఎల్;** POC5SGL17449448. **కామారెడ్డి - నిజామ సాగర్ రోడ్;** P86QSGL18078150, 18159436, 18309442. **కరీంనగర్ - సీవీఆర్‌ఎస్ రోడ్;** PCW8SGL17544394, 17571378, 18140676. **ఖమ్మం - గాంధీ చౌక్;** PB54SGL17701003, 18071201, 18081130. (12-06-26) **ఖమ్మం - జమ్మిబండ రోడ్;** PGG1SGL16626580, 16730533, 17702138, 17990313, 18222814, 18296785. **ఖమ్మం - ఖానాపురం హవేలీ;** POH9SGL17426529, 17665455. **కొండ - మల్లెపల్లి సాగర్ రోడ్;** PJV4SGL17427639, 18236357. **కోరుట్ల - బీజేఎల్;** PNU4SGL17862144, 17861768, 17949183. **కోస్గి - శివాజీ చౌక్;** PJH6SGL17760149, 17950626, 18135200. **కొత్తగూడెమ్ - మధుర బస్తి;** PEJ5SGL17835911. **మహబూబ్ నగర్ - జడ్చెర్ల;** POI2SGL18324759. (15-06-26): **మాల్ - బస్ స్టాండ్;** PKL9SGL17719860. **మంచేరియల్ - హైదరాబాద్ రోడ్;** PCW9SGL17788853, 17905679, 18027181. **మణుగూరు - అశోక్ నగర్;** PCX1SGL16745722, 17396911, 18307002. **మెదక్ - టిఎల్ బ్రాంహ్మణ్ స్ట్రీట్;** PCX2SGL17566683, 17983563. **మెట్‌పల్లి - మైన్ రోడ్;** PEF7SGL15531492, 17894629, 18033931. **మిర్యాలగూడ - బీజేఎల్;** PNT9SGL17394003, 17467257, 17691628. (16-06-26) **ములుగు - గాంధీ చౌక్;** PJV5SGL17593408, 17831227, 18161974, 18335169. **నాగర్‌కర్నూల్ - బీజేఎల్;** PNY5SGL17422168. **నారాయణ్‌పేట్ - నర్సి రెడ్డి చౌరాస్తా;** PJH5SGL17476152, 17760525, 17992463. **నర్సంపేట్ - జయ్ శ్రీ థియేటర్;** PCX3SGL17893341, 18090863. **నిర్మల్ - గంగా కాంప్లెక్స్;** PCX4SGL17430208, 17468235, 17530531, 17764708, 17945235, 18041535, 18026276. **నిజామాబాద్ - వినాయక నగర్;** PCX5SGL17560948, 17723883, 18151879. **పాల్వంచ - కేఎస్‌పీ రోడ్;** PPE3SGL17958509. (17-06-26) **పరిగి - బహార్ పేట్;** PMK2SGL17701687, 18315477. **పర్కల్ - బస్ స్టాండ్;** PJG8SGL17392069, 17576773, 17955571. **పట్టన్‌చేరు - బీజేఎల్;** PY29SGL14020987, 17944754. **పెద్దపల్లె - సుభాష్ నగర్;** PEO3SGL17564396, 17686565, 17732471, 17901098, 17984815. **సదాశివ్ పేట్ - రాచయ్య నగర్;** PCX6SGL18320203. **సంగారెడ్డి - బీజేఎల్;** POA5SGL17618324, 17741622, 17962053, 18225844. (18-06-26): **సంగారెడ్డి - పాత బస్ స్టాండ్ ;** PJG6SGL17504011. **సత్తుపల్లి - సూపర్ మార్కెట్;** PCX8SGL17391951, 17473778, 17468487, 17473209, 17505252, 17533743, 17825282, 18212068. **శంశాబాద్ - బీజేఎల్;** POA8SGL17420684, 17423234, 17570573, 17754365, 18173495. **సిద్దిపేట్ - మెదక్ రోడ్;** PGM8SGL17652496, 17754482, 17804115. **సిర్సిల్లా - మెయిన్ రోడ్;** PB66SGL17640346, 17832879, 17989679. **సూర్యపేట్ - గాంధీ విగ్రహం;** PJG4SGL17401662, 17531190, 17565673, 17658876, 18004663, 18134305, 18339519. (19-06-26) **తాండూర్ - ఇందిరా చౌక్;** PDA6SGL16741448, 17442599, 17448911, 17598322, 17600340, 17695769, 17770998, 17788642, 17891161, 17956041, 17950064, 18027902. **తొర్రూర్ - వరంగల్ రోడ్;** PJH3SGL17450959, 17733709. **వనపర్తి - రాజీవ్ చౌక్;** PCX9SGL17757083, 17829000, 17984098, 18139600. **వరంగల్ - సూబేదారీ;** PB55SGL17427248. **యెల్లందు - బుగ్గవాగు;** PGC4SGL15347896, 17726969, 17954311, 18081396. **జాహిరాబాద్ - ఆర్‌టీసీ బస్ స్టాండ్;** PER4SGL17726325, 17948382.

**బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్**

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

7-5-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 96 పేజీలు: 10+4 వెల: 6.50

బీహార్ కేబినెట్ విస్తరణ నేడే 8

యుఎస్ నౌకాదళం కట్టడికి రంగంలోకి ఇరాన్ డాల్ఫిన్లు

'యాక్ట్ ఈస్ట్'లో వియత్నాం కీలకం 8

- వాణిజ్య, రక్షణ, కీలక రంగాల్లో బంధం బలోపేతం
- ద్వైపాక్షిక వాణిజ్యం టార్గెట్ 25 బిలియన్ డాలర్లు
- ఇరు దేశాల మధ్య కుదిరిన 13 ఒప్పందాలు



స్టాలిన్‌తో రజినీ భేటీ

క్లిష్ట సమయంలో అండగా నిలుస్తా: సూపర్ స్టార్ 8



# మెట్రో ఫేజ్-2ను ఆమోదించండి

ప్రాజెక్టులో కేంద్రం భాగస్వామిగా ఉండాలి

ఎయిర్‌పోర్ట్ -ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను ఫేజ్-3 కింద చేపట్టాలి

రూ.38,595 కోట్లతో సమగ్ర డిపిఆర్

కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సిఎం రేవంత్ రెడ్డి వినతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే6:** హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2కు ఆమోదం తెలపాలని కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఏడు కారిడార్లతో కూడిన మెట్రో ఫేజ్-2 సమగ్ర ప్రణాళికను రూపొందించి డీపీఆర్‌ను ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2, మెట్రో ఫేజ్-3పై కేంద్ర మంత్రితో చర్చించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రోను మరింతగా విస్తరించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2, ఫేజ్-3 విస్తరణ సజావుగా సాగాలనే ఉద్దేశ్యంతోనే మెట్రో ఫేజ్-1ను ఎల్ అండ్ టిఎంఆర్‌హెచ్‌ఎల్‌ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం వివరించారు. ప్రస్తుతం ఫేజ్-1 ప్రభుత్వం పరిధిలో ఉండడంతో ఫేజ్-2, ఫేజ్-3 విస్తరణ సులువవుతుందన్నారు. హైదరాబాద్‌లో మెట్రో రైలు నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు రాష్ట్ర >>2



బుధవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి ఖట్టర్‌తో భేటీ అయిన సిఎం రేవంత్



గురువారం చెన్నైలోని లోక్‌భవన్‌లో గవర్నర్ వి.ఆర్లేకర్‌తో భేటీ అయిన విజయ్

## విజయ్‌కి షాక్!

ప్రమాణస్వీకారానికి అనుమతి ఇవ్వని గవర్నర్

112 మంది ఎమ్మెల్యేల జాబితా మాత్రమే ఇచ్చిన విజయ్

118 మంది పేర్లు ఇవ్వాలన్న గవర్నర్

చిన్నపార్టీలతో కొనసాగుతున్న మంతనాలు

స్టాలిన్, పళనిసామి భేటీ అయినట్లు నెట్టింట హల్‌చల్

రగులుతున్న తమిళ రాజకీయం

**చెన్నై,మే 6:** తమిళనాడులో అసెంబ్లీఎన్నికలు ముగిసినప్పటికీ రాజకీయ ప్రకంపనలు మాత్రం తగ్గలేదు. 108 స్థానాలు గెలిచి ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ నటుడు విజయ్ సారథ్యంలోని టివికెకు మద్దతు సమీకరణ సవాలుగా మారుతోంది. కాంగ్రెస్ తన ఐదుగురు ఎమ్మెల్యేలతో మద్దతు పలికినప్పటికీ మెజార్టీకి మరికొంతమంది ఎమ్మెల్యేలు అవసరం అవుతున్నారు. ఈక్రమంలో పిఎంకె నాలుగు, >>2



## 'సుప్రీం'కు మమత!

బిజెపి గెలుపును సవాల్ చేస్తానని వెల్లడి

ఎన్నికల హింస, రిగ్గింగ్‌పై మమత పోరాటం

**కోల్‌కత్తా, మే 6:** బీజేపీ, కేంద్ర ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా మమతా బెనర్జీ ఇప్పుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాలని భావిస్తున్నారు. గెలిచిన టీఎంసీ ఎమ్మెల్యేలతో సమావేశమైన ఆమె బీజేపీపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని ఆరోపిస్తూ సుప్రీంకోర్టులో బీజేపీ గెలుపును సవాల్ చేస్తానని ప్రకటించారు. స్థానికంగా ఓటములు ఎదురైనా, తన ప్రాథమిక లక్ష్యం ఢిల్లీ పీఠమే అని, ఇండియా కూటమి ఐక్యంగా పోరాటం కొనసాగిస్తుందని ఆమె అన్నారు. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం మమతా బెనర్జీ సీఎం పదవికి రాజీనామా చేయకూడదని గట్టిగా నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. బలవంతంగా దొంగిలించబడిన గెలుపుకు నిరసనగా తాను పదవిలో కొనసాగాలని అనుకుంటున్నట్లు >>2



ప్రధాని రాకతో తెలంగాణలోనూ పెను మార్పులు

పిఎం మోడీ పర్యటనపై మీడియాతో రాష్ట్ర బిజెపి చీఫ్ రామచంద్రరావు 2

## దండం కాదు.. కాంగ్రెస్‌కు పిండం

రైతు భరోసా మాటల్లోనే..

హనుమకొండ రైతు సంగ్రామ సభలో కెటిఆర్



బుధవారం హనుమకొండలో కెటిఆర్

**హనుమకొండ బ్యూరో ప్రభాతవార్త:** హనుమకొండ వేదికగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రైతు డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ రైతులను మోసం చేసిందని ఆరోపించారు. ఆ డిక్లరేషన్ అసలు అమలు కాని "బోగస్ పత్రం" అని మండిపడ్డారు. డిక్లరేషన్ ఇచ్చిన రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎక్కడున్నారని ప్రశ్నించారు. హనుమకొండలో బుధవారం నిర్వహించిన రైతు సంగ్రామ సదస్సులో మాట్లాడిన కేటీఆర్.. కాంగ్రెస్ హామీలపై ప్రశ్నల వర్షం కురిపించారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలిచ్చే హామీ ఏమైందని నిలదీశారు. రూ.2 లక్షల రుణమాఫీ, రైతు కూలీలకు రూ.12 వేల సహాయం, పంటలకు బోనస్ ఇవన్నీ కేవలం మాటలుగానే మిగిలిపోయాయని విమర్శించారు. కౌలు రైతులకు సహాయం, పంట బీమా, అసైన్డ్ భూముల పట్టాలు అన్ని హామీలు గాల్లో కలిసిపోయాయని అన్నారు."దుక్కి దున్నే రైతులను కాంగ్రెస్ దారుణంగా వంచించింది" అని కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ నిర్వహించినది మెగా రైతు మేళా కాదు.. "దగా రైతు మేళా" అని ఎద్దేవా చేశారు. "కాంగ్రెస్ కరోనా కంటే డేంజర్" అంటూ సెటైర్లు వేశారు.బీఆర్‌ఎస్ హయాంలో రైతుబంధు పథకం సమయానికి అందేదని గుర్తుచేసిన కేటీఆర్, మాజీ సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన పథకాన్ని దేశంలోని పలు రాష్ట్రాలు అనుసరించాయని తెలిపారు. రైతులకు 11 విడతల్లో రూ.73 వేల కోట్లు అందించామని చెప్పారు.చివరగా రైతులకు పిలుపునిచ్చిన కేటీఆర్.."దండం పెట్టడం కాదు.. కాంగ్రెస్ పార్టీకి పిండం పెట్టండి.. అప్పుడు మాత్రమే మంచి రోజులు వస్తాయి" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని, అవసరమైతే కాలర్ పట్టాలని కూడా పిలుపునిచ్చారు



## ధాన్యం కొనుగోళ్లపై విపక్షాల దుష్ప్రచారం


ప్రజలు తిరస్కరించినా తీరుమార్చుకోని బిఆర్ఎస్

కాంగ్రెస్ హయాంలోనే అత్యధిక ధాన్యం దిగుబడి

తాలుపేరుతో తరుగు తీస్తే కఠిన చర్యలు

పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోళ్లపై ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మండిపడ్డారు. రైతులను అయోమయంలో పడేసేందుకు తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే రాష్ట్రంలో రికార్డ్ స్థాయిలో ధాన్యం దిగుబడి వచ్చిందన్నారు. అయితే ధాన్యం కొనుగోలు, దిగుబడిలో బిఆర్ఎస్ అసత్య ప్రచారానికి పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లి, పార్లమెంట్, స్థానిక, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పినా బిఆర్ఎస్ నేతలకు కనువిప్పు కలుగలేదని మండిపడ్డారు. భారతదేశం మొత్తంలోనే రికార్డ్ స్థాయిలో దిగుబడి వచ్చింది, కొనుగోళ్లు జరిపింది తెలంగాణా రాష్ట్రంలోనేనని స్పష్టం చేశారు. ఈ మేరకు రాష్ట్రంలో కొనుగోళ్లపై పౌరసరఫరాల అధికారులతో సచివాలయంలో ఆయన బుధవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఈరబీ సీజన్‌లో 67లక్షల ఎకరాల్లో వరిసాగు కాగా.. 141లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి రానుందని, అందులో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధమైందన్నారు. ఇప్పటి వరకు 17.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ. 2310 కోట్లు రైతులకు చెల్లించామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ముందెన్నడూ లేనిరీతిలో వసతులు కల్పించామని, అకాల వర్షాలు సంభవిస్తే ధాన్యం తడవకుండా ఉండేందుకుగాను 2.63 లక్షల టార్పాలిన్ షీట్లు అందుబాటులో ఉంచామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 8,575కొనుగోలు కేంద్రాలుఏర్పాటు చేయగా 18.75కోట్ల గన్నిబ్యాగులు అందుబాటులో ఉంచామని వివరించారు. దాదాపు 64.83 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసేందుకు >>2



రేషన్ ద్వారా జొన్నలు

పంపిణీకి డి.సిఎం భట్టి ఆదేశాలు

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:** తెలంగాణలో రేషన్ కార్డు ఉన్న వారికి రేవంత్ సర్కార్ భారీ శుభవార్త అందించింది. రేషన్ కార్డుదారులకు జొన్నలు కూడా పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకుంది. రైతుల నుంచి ప్రభుత్వం వీటిని సేకరించి రేషన్ కార్డు లబ్దిదారులకు పంపిణీ చేయనుంది. మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల నుంచి జొన్నలను ప్రభుత్వం కొనుగోలు చేయనుంది. అనంతరం రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు అందించనుంది. రైతుల నుంచి తీసుకున్న జొన్నలను బహిరంగ వేలం వేస్తే మధ్యవర్తులు లాభపడతారు. అదే దీనిని రేషన్ కార్డుదారులకు >>2



కాలువల నగరం ఫారెస్ట్ భూములపై సుప్రీం కీలక తీర్పు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే6:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం కాలువల నగరంలోని రిజర్వ్ ఫారెస్ట్ భూములపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. 600 ఎకరాల భూమిపై దాఖలైన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం బుధవారం కొట్టివేసింది. రెవెన్యూ రికార్డులు కేవలం పన్నుల వసూలుకే అని స్పష్టం చేసింది. అవి యాజమాన్య హక్కులను కల్పించవని పేర్కొంది. ఈ వ్యవహారంలో గతంలో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును జస్టిస్ ఎస్.వి.ఎన్. భట్టి ధర్మాసనం సమర్థించింది. సర్వే నంబర్ 81లోని 600 ఎకరాల భూమిని అటవీ భూమిగా గుర్తిస్తూ >>2



5 ఏసిబికి చిక్కిన బోధన్‌టౌన్ ఎస్ఐ



2 బెంగాల్ బిజెపి నేత సువేందు అధికారి పిఎ హత్య

పాయింట్ బ్లాంక్‌రేంజ్ నుంచి కాల్పులు



సిఎం కాన్వాయ్ రూట్‌లో ట్రాఫిక్ ఆంక్షలు కుదింపు

ముఖ్యమంత్రి ఆదేశాలతో మార్పులు -డిజిపి ఆనంద్ 5

## అకాల వర్షాలకు నలుగురు రైతులు బలి

ధాన్యం కాపాడుకోబోయి విగతజీవులయ్యారు



బుధవారం లక్షెట్టిపేటలో రాస్తారోకో చేస్తున్న జీవన్‌రెడ్డి, ఇతర నాయకులు



మృతిచెందిన వెంకటేష్, లచ్చన్న (ఫైల్)

**హైదరాబాద్ / లక్షెట్టిపేట మే 6, ప్రభాతవార్త:** మండువేసవిలో ఆకస్మాత్తుగా కురుస్తున్న అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పలు జిల్లాల్లో మంగళవారం అర్ధరాత్రి కురిసిన అకాలవర్షాలు రైతులను నిండా ముంచాయి. హఠాత్తుగా వీచిన ఈదురుగాలులు, భారీవర్షం అన్నదాతల జీవితాల్లో తీరని శోకాన్ని నింపాయి. మంచిర్యాల జిల్లా రైతులను అకాల వర్షాలు అతలాకుతలం చేశాయి. అకాల వర్షంబారి నుండి >>2

మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటలో తీవ్ర విషాదం

మరో ఆరుగురికి తీవ్ర గాయాలు

భూపాలపల్లి జిల్లాలో తడిసిన వడ్లు, మొక్కజొన్నలు

వార్త

ఒక చేత్తో మీ కర్తవ్యాన్ని పాటిస్తూ, మరో చేత్తో భగవంతుడిని ప్రార్థించండి. మీ కర్తవ్యం ముగిసిన తర్వాత రెండు చేతులు ఎత్తి భగవంతుడిని ప్రార్థించండి.

- రామకృష్ణ పరమహంస

## చివరకు మిగిలిందేమిటి?

పశ్చిమాసియా యుద్ధంలో గెలుపోటముల గురించి చర్చించుకోవడమే తప్ప ఎవరు గెలిచిందీ ఎవరు ఓడిందీ ఇప్పుడప్పుడే చెప్పలేం. యుద్ధమంటేనే చివరాఖరికి విజేతలెవరో తేలిపోతుంది. ఇక్కడలా కాదు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌లో ఎవరు ఎంతకు తెగించారో మాత్రం చెప్పగలం. ఎంత సేపూ ట్రంప్ ధోరణిలో పేల్చేస్తాం, కూల్చేస్తాం. అనే వ్యాఖ్యాలే తప్ప అమీతుమీ తేలడం లేదు. యుద్ధం ఆగిందని యుఎస్ ప్రకటించిందంటే దాని నేపథ్యం ఏమిటో తేల్చి చెప్పలేం.ఈ యుద్ధంలో తేలేదేమిటంటే ఏ దేశం ఎంత నష్టపోయిందో కాస్త అటూ ఇటూగా లెక్కలు బయటికొస్తాయి. ఇరాన్ బాంబు నుంచి ప్రపంచాన్నితానే కాపాడానంటూ ట్రంప్ గప్పాలు కొట్టడం మామూలే. ఆయన మాటతీరు తెలుసు కనుక ఏమాత్రం విచిత్రంగా ఉండదు. పైగా ఇరాన్‌తో ఏర్పడిన వైషమ్యాలకు ఇక చెల్లుచీటి అని ఆయనే అమెరికన్ కాంగ్రెస్‌కు తెలిపారు. యుద్ధం ఇకపై ఏమాత్రం సాగకూడదని అమెరికన్ సెనేట్ తీర్మానించింది. ఇరాన్ ఆర్థిక మూలాలపై దెబ్బ కొట్టామని చెప్పుకోవడం తప్ప ఈయుద్ధ పర్యవసానాలు ఏవీ అమెరికాకు లాభదాయకం కాదు. అమెరికా యుద్ధ విమానాలను విధ్వంసం చేసి అమెరికా ఆస్తులకు ఇరాన్ పాతరేసింది. గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో అమెరికా దిగ్బంధంతో ఇరాన్‌కు తీవ్ర ఆర్థికనష్టం జరిగిందన్న మాట వాస్తవమే. అది కూడా చమురు అమ్మకాల ద్వారా వచ్చే దాదాపు 5 బిలియన్ డాలర్ల ఆదాయం ఇరాన్ కోల్పోయిందని ఒక అంచనా. ప్రపంచవ్యాప్తంగా చమురు అవసరాలున్నప్పుడు ప్రత్యేక పరిస్థితుల రీత్యా ఆ సరుకు అక్కడ్నించి కదలక, అమ్ముకోలేకపోతే ప్రత్యేకంగా ఇరాన్‌కి దెబ్బతగి లిందంటే ఆ మాట ఉత్తిదే. ఎందుకంటే చమురు నిల్వ ఉండే సరుకే.కనుక ఈసారి మరికొంత ధర పెంచి అమ్ముకో వచ్చు. ఆవిధంగా ఇరాన్‌కు వచ్చే నష్టం భర్తీ అయిపోతుంది. ఈ యుద్ధ సమయంలో ఎవరికి వారు ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ పాచికలు కదుపుతూ వస్తే ఒకరు హార్మూజ్ జలసంధిని ఇతర దేశ వాణిజ్యానికి అందకుండా చేస్తే, దానివల్ల కలిగే ప్రయోజనాలు ఇరాన్‌కు దక్కకుండా అమెరికా దిగ్బంధనం ప్రకటించింది. పర్షియన్ గల్ఫ్ నుంచి గల్ఫ్ ఆఫ్ ఒమన్ వరకు అమెరికన్ మిలిటరీ ఆధిపత్యమే కొనసాగుతోంది. హార్మూజ్ జలసంధిలో తమ నౌకలపై ఇరాన్ దుందుడుకు చర్యలేమైనా చేపడితే ఇరాన్‌ను భూమ్మీదే లేకుండా చేస్తామన్నవి ట్రంప్ హెచ్చరికలే. అయితే తమ నౌకలవైపు వచ్చిన 6 ఇరాన్ బోట్లను పేల్చివేయడంలో అమెరికా బోణీకొట్టింది. కాగా ఇరాన్ సైన్యం ఖండించింది. 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్' పేరిట అమెరికా చర్యను నిరసిస్తూ ఇరాన్ యుఎఇలోని ఫుజైరా చమురు క్షేత్రాలపై క్షిపణులు, డ్రోన్‌లు ప్రయోగించగా, ముగ్గురు భారతీయ సిబ్బంది గాయపడ్డారు. ఇస్లామాబాద్‌లో జరిగిన చర్చలకు విఘాతం కలగడంతో అమెరికా తన ఆఖరు అస్త్రంగా హార్మూజ్‌పై దిగ్బంధనాన్ని తలపెట్టింది. ఈ ఆపరేషన్‌లో రెండునౌకలను అమెరికా దళాలు స్వాధీన పరుచు కున్నాయి. హార్మూజ్ జలసంధిలో ఇరాన్ రాకపోకలను నియంత్రిస్తుంటే, అమెరికా దిగ్బంధం మొదలుపెట్టింది. ఇలాంటి దుశ్చర్యలతో ఇరాన్, అమెరికా దేశాల మధ్య చర్చల ప్రతిష్టంభన కారణంగా భారీ ఆర్థికవిధ్వంసం జరిగినట్లే! అందులో భిన్నాభిప్రాయాలకు తావులేదు. అందుకే ఇరాన్ ఒప్పందం ఖరారైనా కాకపోయినా తామేవిజేతలమని అమెరికా భావిస్తోంది. కొన్నిరోజుల్లో ఇరాన్‌వద్ద నిల్వ సామర్థ్యంపూర్తిగా లేక,చమురు ఉత్పత్తిని నిలిపివేస్తుంది. ఈ లెక్కన ఇరాన్‌కు నష్టం సంభవించినట్లే కదా! ఇప్పటికీ యుద్ధ వ్యూహాలు కొనసాగుతున్నాయి. తాజాగా ప్రతిష్టంభన, దిగ్బంధనల వ్యూహంతో ఇరాన్ విలవిల్లాడి కాళ్ల బేరానికి వస్తుందని అమెరికా ఆలోచన. అమెరికా, ఇరాన్ మధ్యకాల్పుల విరమణ కొనసాగడం యుద్ధం ముగిసిందని ట్రంప్ ప్రకటించడం, యుద్ధకాలం విషయంలో గడవు ముగిసినట్లు సెనేట్ భావించి తర్వాత ఏవిధమైన విపత్కర పరిస్థితులను సృష్టించరాదన్న వ్యాఖ్యలతో అమెరికా తోక ముడు స్తుందా?, అమీ తుమీ తేల్చుకునేవరకు ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొంటుందా వేచిచూడాలి. ఇరాన్‌పై సైనిక చర్యలు ఆది నుంచీ ఉవ్విళ్లూరిన ట్రంప్ అసలిది యుద్ధమే కాదంటున్నారు. చేసేదంతా చేసేసి ఇరాన్ ప్రతి ఘటన చర్యలకు మింగుడుపడక ఆయనలాంటున్నట్లుంది. యుద్ధానికి 60 రోజుల్లోగా కాంగ్రెస్ అనుమతి తీసుకోవాలన్న షరతుపై శ్వేతసౌధం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. అందుకే తామిప్పుడు చేస్తున్నది అసలు యుద్ధమే కాదంటోంది. దీనిపై అమెరికా కాంగ్రెస్‌లోని ప్రతిపక్ష డెమొక్రాట్‌లు గడువు ముగిసినందున ఇరాన్ నుంచి అమెరికా బలగాలను తక్షణమే వెనక్కి పిలవాలని డిమాండ్ చేస్తున్నారు. యుద్ధాన్ని యుద్ధమే కాదని కొట్టిపారేసిన అమెరికన్ ప్రభుత్వం ఇరాన్‌పై భీకరదాడి కొనసాగించడానికి 'దార్క్ ఈగిల్' అనే హైపర్ సోనిక్ క్షిపణులను వాడేందుకు అనుమతి నివ్వాలని కోరింది. దేనికీ ఒక పొంతన ఉండదని వ్యవహారం నడపడంలో శ్వేతసౌధం దిట్టం. ఒకవైపు ఇజ్రాయిల్‌కు యుద్ధసహాకారం అందిస్తూనే, మరోవైపు యుద్ధాన్ని ఆపగల శక్తి అమెరికాకు లేదు. ఆ కారణం చేతనే అమెరికా దౌత్యపర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. అమెరికా ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తూ దేశాల మధ్య సయోధ్యకు ససేమిరా అనడం, అదే ప్రపంచానికి ఏమాత్రం శుభసూచకం కాదు. ఫుజైరా ఆయిల్ ఇండస్ట్రీస్ జోన్‌పై డ్రోన్ దాడులు అంత తేలికగా తీసుకునే సంఘటన కాదు. ఈ సంఘటనపై ఇప్పుడు భారత్ పలుదేశాలు ఖండిస్తున్నాయి. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా హార్మూజ్ జలసంధి మీదుగా స్వేచ్ఛాయుత నౌకాయానం, వాణిజ్యం కొనసాగించాల్సిన అవసరాన్ని అన్ని దేశాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. ఉభయ వర్గాలు పట్టు విడుపులు విడిస్తే తప్ప మంటలు ఆరవు.



అత్యధిక శాతం జనాభా నిరుపేదలు, దౌర్భాగ్యులుగా ఉన్న సమాజం వర్ధిల్లదు. అటువంటి సమాజంలో సుఖశాంతులు పరిఢవిల్లవు.

ఆడమ్ స్మిత్



వివేకవంతులతో గడిపిన సమయం మెరుగైనదైనట్లే, మంచి పుస్తకాలతో గడిపిన వయసు మెరుగైనదవుతుంది.

లాంగ్‌ఫెలో

## ప్రజావాక్కు



### పెరుగుతున్న అవినీతి

ప్రభుత్వం నెలనెల టంచన్‌గా అందించే వేలాది రూపాయల జీతాలతోఎంతో హుందాగా ఉండాల్సిన,బాధ్యతగా మెలగాల్సిన కొంతమంది ఉద్యోగులు నేల విడిచి సాము చేస్తూ తమ దగ్గరకు ఏదేని పని నిమిత్తమై వచ్చిన సామాన్య ప్రజల నుంచి,చిన్న,సన్న కారు రైతుల నుంచి తమకు కావలసినంత సొమ్మును ముక్కుపిండి మరీ వసూలు చేస్తూ తమవికృత,నికృష్ట నైజాన్ని చాటుకుంటుండటం తీవ్రహేయమైన విషయం.ఆవిధంగా కొంత మంది ఉద్యోగుల డబ్బు పిచ్చి ఏవిధంగా తయారు అయ్యింది అంటే 'అయ్యా గారికి లంచం ఇస్తేనే కంచం కదిలేది'లాగా,కాస్తో,కూస్తో సామాన్య ప్రజల నుంచి కాసులు గుంజనిదే వారికి ఆ రోజు నిద్రపట్టేలా లేదు అన్నట్లుగా. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని రూపుమాపేందుకు ఒక యుద్ధ ప్రాతిపదికన ఉద్యమిద్దాం.

- బుగ్గన మధుసూదనరెడ్డి, నంద్యాల జిల్లా

### వేసవి కాలం..అమూల్యమైన కాలం

ప్రతి సంవత్సరం వచ్చే వేసవి కాలం కేవలం ఎండలు, సెలవులు మాత్రమే కాదు, జీవితాన్ని మరింత ఉపయోగకరంగామలచుకునే ఒక గొప్పఅవకాశం.ముఖ్యంగా విద్యార్థులు, చిన్నారులు, పెద్దలు అందరికీ వేసవికాలం విశ్రాంతి, వినోదం, విజ్ఞానం, వ్యక్తిత్వ వికాసానికి అనువైన సమయంగా మారుతుంది.ఈసమయాన్ని ఎలా వినియోగించుకుంటామన్నది భవిష్యత్తుపై సానుకూల ప్రభావం చూపుతుంది. చిన్నారుల విషయానికి వస్తే, వేసవి సెలవులు చదువుల ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తాయి. అయితే ఈసమయాన్ని కేవలం ఆటలకే పరిమితం చేయకుండా, సృజనాత్మకతను పెంపొందించే కార్యక్రమాలకు ఉపయోగిస్తే ఎంతో మేలు జరుగుతుంది. ప్రతిఒక్కరూ తమసమయాన్ని సద్వినియోగం చేసుకుంటేవేసవి కాలం జీవితాన్ని మరింత సార్థకం చేసే కాలంగా మారుతుంది.

- డాక్టర్. వై. సంజీవ కుమార్,హైదరాబాద్

### చలివేంద్రాలు అవసరం

రాష్ట్రంలో ఎండలు ఎక్కువగా ఉన్నాయి. బస్టాండ్, రైల్వే స్టేషన్,దేవాలయం, ఆఫీస్,మార్కెట్, హాస్పిటల్, విద్యా సంస్థలు, పార్కులు ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతాలలో చలివెంద్రాలు ఏర్పాటుచేయాలి. యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో చలి వేంద్రాలను ఏర్పాటు చేసి నీటిని అందుబాటులో ఉంచాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్‌జిల్లా

### పర్యావరణానికి ముప్పు

మానవ మనుగడలో సాంకేతిక పరిజ్ఞానం భాగమైన వేళ ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పర్యావరణానికి పెను సవాలుగా మారాయి. పాత మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, రిఫ్రిజిరేటర్లు, టెలివిజన్ల వంటి పరికరాలు పనికిరాకుండా పోయినప్పుడు అవి ఇ వ్యర్థాలుగా మారుతాయి. భారతదేశంలో ఈ సమస్య తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది.గణాంకాలప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఇవ్యర్థాల ఉత్పత్తిలో అమెరికా, చైనా తర్వాత భారతదేశం మూడవ స్థానంలో ఉంది. భారతదేశం ఏటా సుమారు 3.2మిలియన్ టన్నుల ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఉత్పత్తి చేస్తోంది. ఇందులో కేవలం పది శాతం మాత్రమే శాస్త్రీయంగా పునర్వినియోగం అవుతోంది. మిగిలిన వ్యర్థాలు అసంఘటిత రంగం చేతుల్లోకి వెళ్లడం వల్ల విషపూరితమైన సీసం, పాదరసం,కాడ్మియం వంటి మూలకాలునేలలోకి, నీటిలోకి చేరుతున్నాయి. దీనివల్ల శ్వాసకోశ వ్యాధులు, నాడీ వ్యవస్థ దెబ్బతినడం వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పుష్కరాలకు సన్నద్ధం

రెండువేల ఇరవైఏడులో వచ్చేగోదావరి పుష్కరాలకు ప్రభుత్వం రెడీఅవుతుంది. కుంభమేళాకంటే భారీగా జరపాలని మన మంత్రులు ప్రకటిస్తున్నారు. కుంభమేళాలో వందలాది మంది శవాలు గంగలో కొట్టకపోయాయి. కుంభమేళా జరిగిన ప్రదేశంలోచుట్టూ రెండొందల కిలోమీటర్లుకాలుష్యంతో పనికి రాకుండా పోయింది. అంతకంటే ఎక్కువ జరగాలని ప్రభుత్వ ఉద్దేశ్యమా!ప్రభుత్వం పుష్కరాలను ప్రచారం చెయ్యకూడదు. లక్షలాది మంది ఒకేసారి నీళ్లలో మునిగితే , వాళ్ళ మురికి మొత్తం నీళ్లలో చేరిపోతుంది. ఆ నీటిని పక్కనున్న వారు నోటీలో పోసుకుంటారు. పుష్కరాలలో మునిగితే వచ్చేది పుణ్యం కాదు.అంటురోగాలు.

- నార్నె వెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### బాల్య వివాహాలను అరికడదాం

ప్రస్తుత రోజుల్లో సమాజంలో బాలబాలికలను చిన్నపటి నుండే చదువుకు దూరంగా ఉంచుతూ పారిశుద్ధ్య రంగాలలో, ఇతర రంగాలలో చేర్పించి వారి బంగారి భవిష్యత్‌ను కాజేస్తున్నారు.వారి భవిష్యత్‌ను కాపాడాల్సిన భాధ్యత ఎంతైనా ఉంది.వాళ్ళు చదువుకుని ఉన్నత రంగాలలో రాణిస్తేనే కుటుంబాలు బాగుపడతాయి. బాల్యవివాహానాలను అరికట్టడానికి అందరూ ముందుకు రావాలి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి
ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# యుద్ధాలతో పర్యావరణ విధ్వంసం

**ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం ప్రకారం, ప్రధాన సాయుధ ఘర్షణల్లో 60 కంటే ఎక్కువ జీవవైవిధ్య సమృద్ధిగల ప్రాంతాల్లో జరుగుతుండటంతో పర్యావరణ ప్రమాదాలు పెరుగుతున్నాయి. స్థానిక సమాజాలను సంరక్షణ, పునరుద్ధరణ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలి. యుద్ధ సమయంలో సహజవనరుల అక్రమ వినియోగాన్ని అరికట్టేందుకు బలమైన పరిపాలన, అవినీతినిరోధక చర్యలు అవసరం. ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం వంటి సంస్థల ద్వారా గ్లోబల్ సహకారం పెంపొందించడం ద్వారా దీర్ఘకాలిక పర్యావరణ స్థిరత్వం, శాంతిని సాధించవచ్చు.**



డాక్టర్. పి.ఎస్. చారి

తరచుగా వివిధ దేశాల మధ్య జరిగే ప్రాంతీయ యుద్ధాలు బాంబు దాడులు సైనికచర్యల ద్వారా అడవులు, చెరువులు (వెట్‌ల్యాండ్స్), వ్యవసాయ భూములను నాశనం చేసి తీవ్రమైన పర్యావరణ నష్టాన్ని కలిగిస్తున్నాయి. పేలుళ్లు, రసాయన ఆయుధాల వాడకం గాలి, మట్టి, నీటిలో విషపూరిత పదార్థాలను విడుదల చేసి దీర్ఘకాలిక కాలుష్యానికి దారితీస్తుంది. చమురు లీకులు, ఇంధన నిల్వల దహనం గాలి, సముద్రకాలుష్యాన్ని గణనీయంగా పెంచుతాయి. వన్యప్రాణుల నివాసాలు దెబ్బతిని, జంతువులు వలసవెళ్లాల్సి వస్తుంది లేదా అంతరించిపోవచ్చు. భారీయంత్రాల వినియోగం, భూసొరంగాల వల్ల మట్టి నాణ్యత క్షీణించి వ్యవసాయ ఉత్పాదకత తగ్గుతుంది. నీటి వనరులు కలుషితమై మనుషులు, జంతువులకు అనారోగ్యకరంగా మారుతాయి. యుద్ధాలు పర్యావరణ పరిరక్షణ వ్యవస్థలను బలహీనపరచి సహజవనరుల అక్రమ వినియోగానికి దారితీస్తాయి. యుద్ధానంతర పునర్నిర్మాణం ఇప్పటికే నష్టపోయిన పర్యావరణంపై అధిక ఒత్తిడిని కలిగిస్తుంది. యుద్ధసమయంలో పెరిగే హరిత గృహవాయువుల ఉద్గారాలు వాతావరణ మార్పులను మరింత తీవ్రతరం చేస్తాయి. మొదటి, రెండవ ప్రపంచయుద్ధాలు (1914-1918, 1939-1945) విపరీతమైన దీర్ఘకాలిక పర్యావరణ నష్టాన్ని కలిగించాయి. మొదటి ప్రపంచ యుద్ధసమయంలో, నేలలో గోతుల(ట్రెంచ్)యుద్ధాలు మాత్రమే యూరప్‌లో విస్తారమైన భూభాగాలను నాశనంచేశాయి. ఇవి వృక్షసంపదను నాశనం చేసి, మట్టిని గట్టిపరచి, నేలక్షీణత (ఎరోషన్)ను వేగవంతం చేశాయి. అలాగే క్లోరిన్, వంటి రసాయన ఆయుధాల వినియోగం మట్టి, నీటి వ్యవస్థలను విషపూరితం చేసి, భూమిని అనేక సంవత్సరాలపాటు నిరుపయోగంగా మార్చింది. చారిత్రక విశ్లేషణల ప్రకారం, లక్షల హెక్టార్ల అడవులు సైనిక అవసరాల కోసం నరికివేయబడి,నివాస ప్రదేశాలనష్టం, జీవ వైవిధ్యం తగ్గుదలకు దారితీశాయి.రెండవ ప్రపంచ యుద్ధంలో, పరిశ్రమల ఆధారిత యుద్ధ విధానాల వల్ల పర్యావరణ నష్టం మరింత పెరిగింది.బాంబుదాడులు యూరప్,ఆసియా అంతటా పర్యావరణ వ్యవస్థలను ధ్వంసం చేశాయి. ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం అంచనాల ప్రకారం, యుద్ధాలు పర్యావరణ వ్యవస్థలను భంగం చేసి,నీటి వనరులను కలుషితం చేసి, సహజవనరులను తగ్గిస్తాయి. వీటి ప్రభావాలు తరతరాల పాటుకొనసాగుతాయి.రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో మునిగిపోయిన నౌకలవల్ల సముద్రాలలో 15 మిలియన్ టన్నులకుపైగా చమురు విడుదలై దీర్ఘకాలిక సముద్రకాలుష్యాన్ని కలిగించింది.హిరోషిమా, నాగాసాకిపై అణుబాంబు దాడులు సుమారు4000సి ఉష్ణోగ్రత, వికిరణాన్ని సృష్టించి,వెంటనే వృక్షజాలం జంతుజాలాన్ని నాశనం చేసి, దీర్ఘకాలిక రేడియో ధార్మిక కాలుష్యాన్ని మిగిల్చాయి. సైన్స్‌డైరెక్ట్ పరిశోధనల ఆధారంగా 193 గ్లోబల్యేస్సడీల సమీక్ష ప్రకారం, యుద్ధాలు సాధారణంగా అడవుల నాశనం, మట్టిక్షీణత,పర్యావరణ వ్యవస్థల కుప్పకూలుటకు దారితీస్తాయి.అదనంగా, ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమంనివేదికలు ప్రపంచ జీవవైవిధ్య హాట్‌స్పాట్లలో రెండు మూడవవంతు కంటే ఎక్కువప్రాంతాల్లో సాయుధ ఘర్షణలు జరిగినట్లు సూచిస్తూ, సంరక్షణ వ్యవస్థలకు తీవ్రముప్పు ఉందని చెబుతున్నాయి.వివిధ ఖండాల్లో జరిగిన ప్రధాన ప్రాంతీయ యుద్ధాలు విస్తృతస్థాయి పర్యావరణ



నష్టాన్ని కలిగించాయి. ఈ విషయాన్ని ఐక్యరాజ్యసమితి ప్రకృతి సంరక్షణ కోసం అంతర్జాతీయ సంఘం శాస్త్రీయ జర్నల్స్ నివేదికలు స్పష్టంగా వెల్లడిస్తున్నాయి. ఆసియాలో, వియత్నాం యుద్ధం (1961-1975) అత్యంత అధ్యయనం చేయబడిన ఉదాహరణలలో ఒకటి. ఈయుద్ధంలో సుమారు 11-20 మిలియన్ గ్యాలన్ల వరకు ఏజెంట్ ఆరెంజ్ వంటి హార్బిసైడ్లు పిచికారీ చేయబడి,లక్షలహెక్టార్ల అడవులు, మాంగ్రోవ్ అరణ్యాలు,జీవవైవిధ్యాన్ని నాశనం చేశాయి. సుమారు 366 కిలోల వరకు విషపూరిత డయాక్సిని విడుదలై, దశాబ్దాల తర్వాత కూడా పర్యావరణంలో నిలిచింది. పరిశోధనలు చూపించిన ప్రకారం, పిచికారీ చేసిన అడవుల్లో పక్షుల జాతులు 24వరకు మాత్రమే ఉండగా,ప్రభావంలేని ప్రాంతాల్లో 150కు పైగాఉన్నాయి. మధ్యప్రాచ్యంలో, 1991గల్ఫ్ యుద్ధం అత్యంత భయంకరమైన పర్యావరణ విపత్తులలో ఒకటిగా నిలిచింది. ఇందులో6-8మిలియన్ బ్యారెళ్ల చమురు ఉద్దేశపూర్వకంగా పర్షియన్ గల్ఫ్‌లోకి విడుదల చేయబడింది. సుమారు 700చమురు బావులను కాల్చివేయడం వల్ల భారీసముద్ర, గాలికాలుష్యం ఏర్పడింది. ఈ ఘటనలు తీరప్రాంత పర్యావరణ వ్యవస్థలు, మత్స్యసంపద, గాలి నాణ్యతను తీవ్రంగా దెబ్బతీశాయి. యూరప్‌లో, 1990ల బాల్కను యుద్ధాల సమయంలో పరిశ్రమలపై బాంబు దాడులు జరిగి, డాన్యూబ్ వంటినదుల్లో విషపూరిత రసాయనాలు చేరి, నీటివనరులు, వ్యవసాయ భూములు కలుషితమయ్యాయి. ఆఫ్రికాలో,సూడాన్,కాంగోవంటి ప్రాంతాల్లో జరిగిన అంతర్గతయుద్ధాలు పరిపాలన బలహీనత కారణంగా అడవుల నాశనం, వన్యప్రాణుల నష్టం, సహజవనరుల అక్రమ వినియోగాన్ని పెంచాయి. ఇటీవలికాలంలో, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం అడవులు, వ్యవసాయ భూములు, నీటి మౌలిక సదుపాయాలను విస్తృతంగా దెబ్బతీసి కాలుష్యాన్ని, హరిత గృహవాయువుల ఉద్గారాలను పెంచింది. నిపుణులు ఈ ప్రభావాలను 'ఎకోసైడ్' (పర్యావరణనాశనం)గా పేర్కొంటున్నారు. అలాగే, పశ్చిమఆసియాలోని ఘర్షణలు నీటి వనరులు, పట్టణపర్యావరణ వ్యవస్థలను ధ్వంసంచేసి పర్యావరణ ఒత్తిడిని మరింత పెంచాయి.ఆహార వ్యవసాయసంస్థ ప్రకారం, ప్రపంచ ఆహారభద్రత లోపంలో 40 కంటే ఎక్కువకు యుద్ధాలు కారణమవుతున్నాయి.ఎందుకంటేవ్యవసాయ భూములు విడిచి పెట్టబడటం లేదా క్షీణించడం జరుగుతుంది. అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటీ నివేదికల ప్రకారం, సుమారు 60 యుద్ధాల్లో నీటివ్యవస్థలు దెబ్బతిని, శుద్ధమైన నీటి అందుబాటును తగ్గించి, జలజీవ వ్యవస్థలకు హాని కలిగిస్తున్నాయి. నివేదికలు సూచిస్తున్నట్లుగా, పర్యావరణ పునరుద్ధరణ చాలా మందగమనంగా జరుగుతుంది లేదా పూర్తిగా జరగదు. కొన్నిపర్యావరణ వ్యవస్థలు తిరిగి పునరుద్ధరించడానికి దశాబ్దాలు లేదా శతాబ్దాలు పడుతుంది. ప్రాంతీయ యుద్ధాల ప్రభావాల నుండి సహజవనరులను రక్షించడానికి అనేక ప్రపంచ సదస్సులు, కార్యక్రమాలు చేపట్టబడ్డాయి.ఐక్యరాజ్యసమితి నిర్వహించిన మానవ పర్యావరణ సదస్సు సాయుధ ఘర్షణలు తీవ్రమైన పర్యావరణ నష్టాన్ని కలిగిస్తాయని మొదట గుర్తించి, గ్లోబల్ చర్యలకు పునాది వేసింది. ఎర్త్‌సమ్మిట్ ద్వారా రూపొందించిన అజెండా 21 సుస్థిరవనరుల నిర్వహణపై దృష్టిపెట్టి, ఘర్షణలు పర్యావరణ వ్యవస్థలను తీవ్రంగా దెబ్బతీస్తాయని పేర్కొంది. వరల్డ్ సమ్మిట్ ఆన్‌సస్టైనబుల్ డెవలప్మెంట్ ప్రకారం,1960 తర్వాత జరిగిన ఘర్షణల్లో సుమారు 40 సహజవనరులతో సంబంధం ఉన్నాయని, ఘర్షణలకు గురయ్యే ప్రాంతాల్లో పర్యావరణ వ్యవస్థలను రక్షించాల్సిన అవసరాన్ని పునరుద్ఘాటించింది. ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం ప్రకారం, ప్రధాన సాయుధ ఘర్షణల్లో 60 కంటే ఎక్కువ జీవవైవిధ్య సమృద్ధిగలప్రాంతాల్లో జరుగుతుండటంతో పర్యావరణ ప్రమాదాలు పెరుగుతున్నాయి. స్థానిక సమాజాలను సంరక్షణ, పునరుద్ధరణ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలి.యుద్ధసమయంలో సహజవనరుల అక్రమ వినియోగాన్ని అరికట్టేందుకు బలమైన పరిపాలన, అవినీతినిరోధక చర్యలు అవసరం. ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం వంటి సంస్థల ద్వారా గ్లోబల్ సహకారం పెంపొందించడం ద్వారా దీర్ఘకాలిక పర్యావరణ స్థిరత్వం, శాంతిని సాధించవచ్చు. ●

# బెంగాల్ ఫలితం దేశ రాజకీయాలకు కొత్త దారి

తిప్పర్తి శ్రీనివాస్

భారత రాజకీయాల్లో ప్రతి ఎన్నిక ఒక ప్రాంతీయ కథ మాత్రమే కాదు, అది దేశ రాజకీయ దిశను సూచించే సంకేతాల సమాహారం. తాజాగా వెలువడిన బెంగాల్ ఫలితాలు కూడా అలాంటివే. ఎన్నో సంవత్సరాలుగా అజేయ కోటగా నిలిచిన తృణమూల్ కాంగ్రెస్ ఆధిపత్యాన్ని సవాల్ చేస్తూ, 'నమోషా' వ్యూహం ఆ కోటను బలంగా కదిలించింది. నరేంద్ర మోడీ, అమిత్ షా ద్వయం చేపట్టిన సమగ్ర వ్యూహం, మైక్రో మేనేజ్‌మెంట్, బలమైన నేరేటివ్ నిర్మాణాలు ఈఫలితాల్లో కీలకపాత్ర పోషించాయి. అయితే ఈ ఫలితాలను కేవలం ఒక పార్టీ విజయం, మరొకటి ఓటమిగా మాత్రమే చూడడం సరిపోదు. ఇది ఒక పెద్ద సామాజిక రాజకీయ మార్పు ప్రతిబింబం. ముఖ్యంగా మమతా బెనర్జీ నాయకత్వంపై వచ్చిన ప్రజాభిప్రాయం, ఆమె విధానాలపై ఉన్న అసంతృప్తి, మార్పు కోసం ప్రజల్లో పెరిగిన ఆకాంక్షలు ఈ తీర్పులో స్పష్టంగా కనిపిస్తున్నాయి. మమతా బెనర్జీ నేతృత్వంలోని ప్రభుత్వంపై విమర్శలు కొత్తవి కావు. పరిపాలనా లోపాలు, అవినీతి ఆరోపణలు, స్థానిక స్థాయిలో హింసాత్మక రాజకీయాలు ఇవన్నీ కలిపి ప్రజల్లో విసుగు కలిగించాయి. ముఖ్యంగా సనాతన ధర్మంపై ఆమె పార్టీ నాయకులు చేసిన వ్యాఖ్యలు, ఆ భావజాలాన్ని గౌరవించే పెద్ద వర్గాన్ని దూరం చేశాయనే అభిప్రాయం బలపడింది. భారతదేశం వంటి దేశంలో సాంస్కృతిక ఆధ్యాత్మిక విలువలు రాజకీయాల్లో కూడా ప్రభావం చూపుతాయి. ఆ విలువలను విస్మరించడం లేదా విమర్శించడం ప్రజలలో ప్రతికూల ప్రతిస్పందనను రేకెత్తించడం సహజం.ఇక్కడ ప్రశ్న వస్తుంది మమతను ప్రజలు పూర్తిగా తిరస్కరించారా? లేక ఇది ఒక హెచ్చరికా? నిజానికి, ఈ ఫలితాలు రెండింటి మేళవింపుగా చూడాలి. ప్రజలు పూర్తిగా ఒక నాయకత్వాన్ని తృణీకరించకపోయినా, తమ అసంతృప్తిని స్పష్టంగా వ్యక్తంచేశారు. ఇది ప్రజాస్వామ్యంలో ఆరోగ్యకరమైన పరిణామం.ఓటరు ఎప్పుడూ మౌనంగా ఉండడు. సరైన సమయంలో తన తీర్పును చెబుతాడు. ఇంకా ఒక ముఖ్యఅంశం బిజెపి పెరుగుదల.గతంలో పరిమిత స్థాయిలో ఉన్నపార్టీ, ఈసారి గణనీయమైన స్థాయికి చేరుకుంది.




ఇది కేవలం హిందుత్వనేరేటివ్ వల్లనేకాదు, కేంద్రప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు, బలమైన నాయకత్వ ప్రతిభకూడా దీనికితోడయ్యాయి. 'డబుల్ ఇంజిన్ ప్రభుత్వం' అనే నినాదం బెంగాల్‌లో ఎంతవరకు పనిచేసిందో ఈ ఫలితాలు చూపిస్తున్నాయి. అయితే,ఈ విజయాన్ని కూడా సమతుల్యంగా విశ్లేషించాలి. బెంగాల్ రాజకీయాలు ప్రత్యేకమైనవి. భాష, సంస్కృతి, ప్రాంతీయ గర్వం ఇవి అన్నీ అక్కడి ఓటింగ్ ప్రవర్తనను ప్రభావితం చేస్తాయి. అందు వల్ల, ఒక ఎన్నిక ఫలితంతోనే పూర్తి రాజకీయ మార్పు జరిగిపోయిందని చెప్పడం అతిశయోక్తి అవుతుంది. కానీ ఇది ఒక కీలకమలుపు మాత్రం అనడంలో సందేహం లేదు. మమతా బెనర్జీకి ఈఫలితాలు ఒక స్పష్టమైన సందేశం ఇస్తున్నాయి.పాలనలో పారదర్శకత, ప్రజలతో నేరుగా అనుసంధానం, విభజనాత్మక వ్యాఖ్యలకు దూరంగా ఉండడం అవసరం. అదే సమయంలో, బిజెపికి కూడా ఇదిఒక బాధ్యతను ఇస్తోంది. ప్రజలు ఇచ్చిన ఈ మద్దతును నిలబెట్టుకోవాలంటే, వారు చూపించిన నమ్మకాన్ని నెరవేర్చాలి. బెంగాల్ ఫలితాన్ని ఒక పెద్ద దృక్కోణంలో చూడాలి. ఇది కేవలం ఒక రాష్ట్ర రాజకీయ పరిణామం కాదు, దేశ రాజకీయాల్లో మారుతున్న ధోరణులకు ప్రతిబింబం.ప్రజలుఇకపై కేవలం భావోద్వేగాలతో కాకుండా, పనితీరు, పారదర్శకత, విలువల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి. ●

# సాంకేతిక చేయూతతో కులవృత్తుల అభివృద్ధి

దాడిశెట్టి శ్యామ్ కుమార్

భారతదేశంలో కుల వ్యవస్థ అనేది పూర్వకాలం నుండి వ్యక్తుల సమూహాలు, బ్రతుకుతెరువు కోసం చేసే పనులను బట్టి, వృత్తి ప్రాతిపదికన వ్యవస్థీకృతమైనటువంటి సాంఘిక, సామాజిక శ్రమ జీవన విధానాలకు ప్రతిబింబాలుగా నిలుస్తూ ఉంటాయి. కాలగమనంలో గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో మానవ జీవన శైలికి కావాల్సిన అవసరాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సమాజంలో అనేక పెనుమార్పులు చోటుచేసుకుంటూ మానవ సహజ సామర్థ్యాలతో పాటు వృత్తి నైపుణ్యాలు వస్తువు ఉత్పత్తిల్లో నూతన విధానాలు గోచరిస్తూ కులవృత్తుల్లో ఆధునిక సాంకేతిక యంత్ర పరికరాలు ఉపయోగించడంవల్ల వస్తు ఉత్పత్తికి సంబంధించినటువంటి పని చేసేవారి సంఖ్య సహజంగా కొంత తగ్గి ఉండవచ్చు. కానీ పూర్తిగా కులవృత్తుల్లోకి సాంకేతిక ఉపకరణాలు అందుబాటులోకి రావడం తక్కువ సమయంలో ఎక్కువ వస్తు ఉత్పత్తులను తయారు చేయడానికి అవకాశం ఏర్పడుతుంది. గ్రామీణ మారుమూల ప్రాంతాల్లోని కులవృత్తుల్లోకి సాంకేతిక విధానాలు రావడం వల్ల సాధారణ కులవృత్తులు చేసే పనివారికి పనులు తగ్గిపోయాయి అనే వాదనలు లేకపోలేదు. దీనికి కారణం కుల వృత్తుల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికంగా వెసులుబాటు ఉన్న వారి దగ్గరే సాంకేతిక ఉపకరణాల వినియోగం నిక్షిప్తమై ఉండడం దాన్ని ఉపయోగించే వ్యవస్థమీద పూర్తి అవగాహన సరిపడా వినియోగం కొంతమంది సాధారణ కులవృత్తుల వారికి లేకపోవడంతో సాంకేతిక ఉపకరణాలు వస్తు ఉత్పత్తులలో కూలీలను గణనీయంగా తగ్గించిఉండవచ్చు.ఈ క్రమంలో సాంకేతిక ఉపకరణాలు అందిపుచ్చుకోలేని వారుకొందరు కులవృత్తి పనులు వదిలేసి వేరేపనుల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళిపోతున్నారు అనే భిన్నఅభిప్రాయాలు తరచూ వినిపిస్తుండడం గమనార్హం.అయితే ప్రస్తుత సమాజంలో టెక్నాలజీ మొత్తం ప్రపంచాన్ని శాసిస్తుంది అని అనుకోవడం సరైనదేనా కాదా అనే అంశంలో టెక్నాలజీ అందుబాటులోకి వచ్చినప్పటికీ, కుటీర పరిశ్రమలతో పాటు చేనేత, వడ్రంగి, కుమ్మరి, కమ్మరి, లాంటి అనేకరకాల కులవృత్తులలో ఆధునిక యాంత్రిక టెక్నాలజీ యంత్ర పరికరాలు వినియోగం పెరుగుతున్న జనాభా దృష్ట్యా అవసరమైనదే మానవుడు దాన్ని సరైన రీతిలో వినియోగిస్తే టెక్నాలజీ అవసరం ఉంటుంది. లేకుంటే వినియోగంలోకి రాకుండా పోతుంది కాబట్టి టెక్నాలజీ మానవ నిర్వహణ పద్ధతినిబట్టి ఉంటుంది. కానీ టెక్నాలజీ పూర్తిగామానవుని మీద ఆధిపత్యం చలాయించడం అనేది దాదాపుగా ఉండకపోవచ్చు. ఒకప్పుడు కులవ్యవస్థతో వ్యవస్థీకృతమైన గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో సైతం కులవృత్తులతో నిరంతరం వారికి అనునిత్యం చేతినిండా పని నిండుగా ఉండేది.దీనికి ప్రధాన కారణం అప్పుడు యంత్ర సాంకేతికత విధానం అంతగా



లేకపోవడం ఉత్పత్తి చేసే వస్తువులు చేతులతోనే కాకుండా రకరకాల సాంప్రదాయ పనిముట్లను ఉపయోగించేవారు. కాలక్రమేణా పనిముట్ల వాడకంతోపాటు ఆధునిక సాంకేతికత తోడవడంతో శ్రమ కాస్త తక్కువై వస్తుఉత్పత్తి మరింత సులభతరమైంది. కానీ గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో కొందరిలో సాంకేతిక యంత్ర పరికరాల వినియోగం నైపుణ్యాలపై తగినంత పట్టులేకపోవడమే కొంత గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో పనులు కరువైపోయిన పరిస్థితి ఏర్పడి ఉండి ఉండవచ్చు. కానీ కేవలం టెక్నాలజీ కులవృత్తుల్లోకి చొచ్చుకు వచ్చి కులవృత్తుల వారికి తగినంత ఆదరణ కరువైంది అనేభావన కేవలం అపోహ మాత్రమే కావచ్చు. ఏది ఏమైనప్పటికీ సాంకేతికత కూడిన యంత్రపరికరాలు గ్రామీణ మారుమూల ప్రాంతంలోకి రావడం వాటి వినియోగం నైపుణ్యాలను తగినంతగా కులవృత్తుల వారుమరింత అందిపుచ్చుకోవాల్సిన అవసరంఉంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని కుటీర పరిశ్రమలలో ఆధునిక సాంకేతిక యంత్ర పరికరాలపై గ్రామీణ ప్రజల్లో ప్రతిఒక్కరు అవగాహన నైపుణ్యాలను కలిగే విధంగా ప్రయత్నిస్తే గ్రామీణ ప్రాంతం కుల వృత్తుల్లో కూడా సాంకేతిక యంత్ర పరికరాలు ఉపయోగించే వ్యవస్థమీద ప్రతి ఒక్కరికి పట్టు దొరుకుతుంది. అయితే మారుతున్న కాలానుగుణంగా సమాజంలో వస్తున్న మార్పులకు కొత్త తరం ఆలోచన విధానాలకు అనుగుణంగా ప్రత్యేకమైన కులం వారే నిర్దిష్టమైన పనులు చేయాలనే నియమాలున్నట్టు ప్రస్తుతం క్షేత్రస్థాయిలో కొన్ని సందర్భాల్లో కనిపించడం లేదు.దీనికికారణం కుల వృత్తుల్లో ఆధునిక సాంకేతికత అభివృద్ధి చెందినట్లు మానవ ఆలోచన విధానాల్లో కూడా పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయి కాబోలు.కానీ ఎక్కువశాతం ఒకేమార్గాన్ని కాకుండా ఆయా విషయాల్లో సాధించిన నైపుణ్యాలతో కులాన్ని ప్రాతిపదికగా తీసుకోకుండా సాధ్యమైనంతగా విభిన్నరంగాల్లోకి ఉపాధి అవకాశాల కోసం వెళ్తుండడం సర్వసాధారణంగా గోచరిస్తుంది. ప్రభుత్వాలు కూడా వృత్తి నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి సారించి వృత్తిపరమైన విషయాల్లో వస్తున్న ఆధునిక పోకడలకు అనుగుణంగా టెక్నాలజీపై అవగాహనతోపాటు సరైన నైపుణ్యంతో యంత్ర ఉపకరణాలను వినియోగించే విధానాన్ని కులవృత్తుల వారితోపాటు అందరికీఅందించాలని ఆలోచిస్తుండడం అభినందనీయం.గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో కులవృత్తుల వారు వస్తువులు ఉత్పత్తి చేసుకునే క్రమంలో సాంకేతికతను వినియోగించేతీరు అందరికీ సులభతరంగా ఉంటే తప్పనిసరిగా గ్రామీణవ్యవస్థలో కూడా ప్రతి ఒకరికి చేతినిండా పని తప్పనిసరిగా ఉంటుందేమో. కాబట్టి టెక్నాలజీ కేవలం మానవుని సహాయకారిగా ఉండి శ్రమను తగ్గిస్తుంది తప్ప కులవృత్తులను శాసించే విధంగా మాత్రం ఉండదేమో. అయితే ఆధునిక టెక్నాలజీ పెరుగుతున్న మానవ అవసరాలకు ఉపయోగకరమైనది కానీ టెక్నాలజీ కుల వృత్తుల పనులలో కొంత మానవ భాగస్వామ్యాన్ని తగ్గించాయి తప్ప మొత్తానికే మానవ ప్రమేయం లేకుండా టెక్నాలజీ వినియోగం అనేది సాధ్యం కాదు అని అనిపిస్తుంది. ఈ క్రమంలో రాబోవు కాలాల్లో పూర్తిస్థాయిలో మారుతున్న కాలానికి అనుగుణంగా కుల వృత్తిలో వస్తున్న ఆధునిక యాంత్రిక సాంకేతిక ఉపకరణాల వినియోగం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోనే తిరిగి అనేక ఉపాధి అవకాశాలకు ఆస్కారం ఉంటుంది. తద్వారా విభిన్న రకాల కుల వృత్తుల వారికి ఆర్థిక స్వావలంబన దిశగా సామాజిక స్థితిగతులు మెరుగుపడతాయని ఆశించవచ్చు. ●

# మాదకద్రవ్యాల ప్రభావంతో రాహుల్, రేవంత్‌లపై కెటిఆర్ విమర్శలు

## పిట్టలదొరలా కేంద్రమంత్రి బండిసంజయ్ వైఖరి

## జాతీయంగా సిపిఎంతో దోస్తీ కొనసాగుతోంది: టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్




**హైదరాబాద్,మే 6,ప్రభాతవార్త:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాదకద్రవ్యాల ప్రభావంతో కెటిఆర్ విమర్శలు చేస్తున్నారనీ టిపిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్ అనుమానం వ్యక్తం చేశారు. గాంధీ భవన్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ కెటిఆర్ ఓ 420 అనీ కెసిఆర్ ది దొంగల బ్యాచ్ అని ఆరోపించారు. పాస్ పోర్ట్ కుంభకోణం మొదలై భూముల కుంభకోణం వరకు కెటిఆర్ కుటుంబమే ఉందనీ వివరించారు. కెటిఆర్ నీ స్థాయి ఏంటీ,నువ్వా రాహుల్ గాంధీ,రేవంత్ రెడ్డిని విమర్శించేదనీ ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో దొంగచాటుగా వచ్చిచేరి కెకె మహేందర్ రెడ్డి గొంతుకోసావనీ ఆరోపించారు. యువతను మద్యానికి అలవాటు చేసి రాష్ట్ర భవిష్యత్‌ను బిఆర్ఎస్ నాశనం చేసిందనీ దుయ్యబట్టారు. ఏం చేసారని ఒకే కుటుంబంలో ఉన్న వారందరికీ పదవులు ఇచ్చుకున్నారు. దళితుడిని ముఖ్యమంత్రి చేయకుంటే తలనరుక్కుంటా అన్న కెసిఆర్‌కు ఇప్పుడు తల ఉందా లేదా అని అడిగారు. బిఆర్ఎస్ హాయాంలో జరిగిన ఆగడాలు ప్రజలు ఇంకా మర్చిపోలేదనీ అన్నారు. కేంద్ర మంత్రి బండిసంజయ్ పిట్టల దొరలా మారడనీ కాళేశ్వరం సిబిఐ అప్పగిస్తే పొడిచేస్తామన్నారనీ ఆరు నెలలుగా ఏం చేస్తున్నారనీ ప్రశ్నించారు. జాతీయ స్థాయి రాజకీయాలు వేరు రాష్ట్ర స్థాయిలో రాజకీయాలు వేరనీ,జాతీయ స్థాయిలో సిపిఎంతో దోస్తీ కొనసాగుతుందనీ తెలిపారు.కేరళ స్థాయిలో సిపిఎంతో పోరాటం ఉంటుందనీ అన్నారు.తమిళనాడు లో డిఎంకె తొ ఎన్నికలకు వెళ్ళినా, ఆ రాష్ట్ర పరిస్థితుల నేపథ్యంలోనే టివికెకు మద్దతు ఇచ్చామనీ తెలిపారు.

# మొబైల్ ఫోన్ల కొనుగోళ్లపై బిఆర్ఎస్‌ది తప్పుడు ప్రచారం

## తేల్చి చెప్పిన కోర్టు.. తీర్పుపై మంత్రి సీతక్క హర్షం

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:** అంగన్‌వాడీలకు మొబైల్ ఫోన్ల కొనుగోళ్ల అంశంపై బిఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని హైదరాబాదు సిటీ సివిల్ కోర్టు తీవ్రంగా పరిగణించిందని రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క చెప్పారు. ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా సోషల్ మీడియా వేదికలపై అసత్య ప్రచారం సాగిందని కోర్టు గుర్తిస్తూ సంబంధిత పోస్టులను తక్షణమే తొలగించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ముఖ్యంగా రూ.30 కోట్ల అవినీతి జరిగిందన్న ఆరోపణలను కోర్టు పూర్తిగా ఖండించిందని వివరించారు. ఈ మేరకు కోర్టు తీర్పుపై బుధవారం మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. అధికారిక రికార్డుల ప్రకారం ఒక్కో మొబైల్ ఫోన్‌ను రూ.11,650 ధరకు మొత్తం 38,130 ఫోన్లను రూ.44,42,14,500 వ్యయంతో కొనుగోలు చేసినట్లు స్పష్టమైందన్నారు. అయితే రూ.8,499 విలువైన ఫోన్‌ను రూ.14,499కు కొనుగోలు చేశారన్న బీఆర్ఎస్ ఆరోపణలు అసత్యమని కోర్టు తేల్చిచెప్పిందన్నారు. ఈ మేరకు తన వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసే ఉద్దేశ్యంతో అసత్య ప్రచారం సాగిందన్న పిటిషనర్ తరఫు వాదనతో కోర్టు ఏకీభవించిందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌తోపాటు ఆ పార్టీ అధికారిక సోషల్ మీడియా అకౌంట్ల ద్వారా ఏప్రిల్ 10న ప్రచురించిన పోస్టులను ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ వేదికల నుంచి తక్షణమే తొలగించాలని కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని వివరించారు. అదేవిధంగా.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను మంత్రి సీతక్క ఖండించారు.

కేటీఆర్ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ వ్యాఖ్యలు అహంకారానికి నిదర్శనమని పేర్కొన్నారు. రైతులను బీఆర్ఎస్ పూర్తిగా నిరక్ష్యం చేసిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో పూర్తి రుణ మాఫీ జరగలేదని విమర్శించారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు పరిహారం ఇవ్వలేదన్నారు. తాము ప్రజల్లో తిరుగుతున్నామని, ఫారిన్ టూర్లలో కాదని బిఆర్ఎస్ నేతలకు చురకంటించారు. సమ్మక్కసారలమ్మ ఆలయంపై కేటీఆర్ అసత్య ఆరోపణలు చేశారని దుయ్యబట్టారు. ఇకనైనా ప్రజలను తప్పుదారి పట్టించే వ్యాఖ్యలు మానుకోవాలని బిఆర్ఎస్ నేతలకు హితవు చెప్పారు.

# బకాయిల క్లియరెన్స్‌కు వన్ టైమ్ సెటిల్మెంట్

## విద్యుత్ శాఖకు సర్కార్ ఊరట

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వ శాఖల్లో పేరుకుపోయిన వేల కోట్ల రూపాయల బకాయిలకు సంబంధించి వాటి క్లియరెన్స్‌కు రాష్ట్ర సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలోని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రభుత్వ శాఖలకు కరెంటు సరఫరా చేసినందుకు గాను బిల్లు చెల్లించకుండా అవిభారీగా బకాయిలు పడ్డాయి. ఒక్కో సంస్థకు దాదాపు రూ.వేల కోట్లు రావాల్సి ఉన్నది. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఆయా శాఖలకు సర్కారు ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం.

దీంతో అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. బకాయిలు, వాటిపై వడ్డీలు, జరిమానాలు ఇవన్నీ కలిపి చెల్లించాల్సిన బిల్లులు ఆయా శాఖలకు, సంస్థలకు తడిసి మోపడయ్యాయి. దీంతో వాటిని ఏ విధంగా చెల్లించాలో తెలియక అధికారులు తలలు పట్టుకునే పరిస్థితి ఏర్పడింది. తాజాగా జరిగిన మంత్రివర్గ సమావేశంలో చెల్లించాల్సిన బకాయిల విషయంలో వడ్డీ, ఫైన్లు కట్టాల్సిన అవసరం లేదని మినహాయింపులు ఇస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

ఇందుకు అనుగుణంగా వన్ టైమ్ సెటిల్మెంట్ వెసులుబాటు కల్పించే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. జలమండలికి వివిధ శాఖల నుంచి దాదాపు రూ.5,864 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. జరిమానాలు, వడ్డీలన్నీ మినహాయించగా, వన్టైమ్ సెటిల్మెంట్ ద్వారా రూ.1,686 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేశారు. అలాగే మిషన్ మిషన్ భగీరథ నుంచి విద్యుత్ శాఖకు దాదాపుగా రూ.5 వేల కోట్ల చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ మొత్తాన్ని ప్రభుత్వ స్థాయిలో బుక్ అడ్జెస్టెమెంట్లు చేస్తారని అధికారులు చెబుతున్నారు. దీనితో పాటుగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీలు విద్యుత్ శాఖకు రూ.500 కోట్ల వరకు చెల్లించాల్సి ఉన్నది. ఇలా అనేక శాఖలు విద్యుత్, మున్సిపల్ శాఖలకు భారీ మొత్తంలో బిల్లులు చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచినట్టు గుర్తించారు.

# ప్రజాపాలనను చూసి ఓర్వలేక కెటిఆర్ విమర్శలు: ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్



**హైదరాబాద్,మే6,ప్రభాతవార్త:**రేవంత్ రెడ్డి ప్రజాపాలన చూసి ఓర్వలేక కెటిఆర్ విమర్శలు చేస్తున్నారని వయసులో పెద్దోడు అయిన కెసిఆర్ మంచిగా మాట్లాడమని రేవంత్ రెడ్డి కి గతంలో కెటిఆర్ హితవు పలికాడుమరీ ముఖ్యమంత్రిపై ఆయన ఎందుకు అడ్డగోలుగా మాట్లాడుతున్నాడనీ ఎమ్మెల్సీ దయాకర్ అన్నారు. బుధవారం సిఎల్‌పిలో విలేఖరులతో మాట్లాడుతూ ఇక నుంచి కెటిఆర్‌దిగజారుడు భాష నే మేం మాట్లాడతామనీ హెచ్చరించారు. కెటిఆర్ బూతు భాషనే అంతా మాట్లాడాలనీ కాంగ్రెస్ కార్యకర్తలకు పిలపునిచ్చారు. కెటిఆర్ డిఎన్ ఏ నే బూతు అని ఆరోపించారు. నువ్వు కెసిఆర్ కొడుకువే అయితే రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందో చర్చకు రా.. అని సవాల్ విసిరారు. బిజెపి, బిఆర్ఎస్ ఆఫీసుకు వచ్చి చర్చించడానికి మేం సిద్ధం అని ఆయన ప్రకటించారు.లక్ష రూపాయల రుణమాఫీ మీరు నాలుగు విడతల్లో చేశారనీ ఎద్దేవా చేశారు.మా ప్రభుత్వం 21 వేల కోట్ల రుణమాఫీ ఏక కాలంలో చేసిందని వివరించారు.ప్రతి గ్రామంలో రుణమాఫీ లబ్దిదారుల జాబితా పెట్టామనీ చూసుకో అని తెలిపారు. రైతుల కోసం మా ప్రభుత్వం వచ్చాక ఈ 28 నెలల్లో ఏకంగా 1,52,656 కోట్ల రూపాయలు ఖర్చు చేశామనీ చెప్పారు.దీనిపైన చర్చ కు సిద్ధమా అని అడిగారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో 2,88,670 కోట్ల మాత్రమే ఖర్చు చేసింది. ఏడులక్షల కోట్ల అప్పుతో అప్పుల కుప్పగా తెలంగాణను మార్చారనీ, తెలంగాణ సమాజం కెసిఆర్ కుటుంబాన్ని నమ్మి మోసంపోయిందన్నారు.

# ఎన్ఎస్‌యూఐ కేంద్ర ఎన్నికల అథారిటీకి పర్యవేక్షకుడిగా కిరణ్ ముగబసవ్

**హైదరాబాద్,మే6,ప్రభాతవార్త:** ఎన్ఎస్‌యూఐ అంతర్గత సంస్థాగత ఎన్నికలను పర్యవేక్షించేందుకు కన్హయ్య కుమార్, కిరణ్ ముగబసవ్‌ను ఆ పార్టీ కేంద్ర ఎన్నికల అథారిటీ కి నియమించారు. హుబ్లీకి చెందిన సీనియర్ నాయకుడైన ముగబసవ్ ఎన్ఎస్‌యూఐ ఎన్నికల కమిషనర్‌గా 2016-18 వరకు పనిచేశారు క్రమశిక్షణ కలిగిన పార్టీ కార్యకర్తగా కిరణ్ ముగబసవ్ గుర్తింపు పొందారు. ప్రస్తుతం ఏఐసిసి సభ్యులుగా కెపిసిసి ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నారు. తెలంగాణలో రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ ను నిర్మించి, దాని జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.కిరణ్ 3,570 కి.మీ. భారత్ జోడో యాత్ర, 600 కి.మీ. సర్వోదయ సంకల్ప పాదయాత్ర, 600 కి.మీ. లోక్ స్వరాజ్ పాదయాత్రలను పూర్తి చేశారు. మహారాష్ట్ర, న్యూఢిల్లీలో ఎఐసిసికి జాతీయ వార్ రూమ్ కోఆర్డినేటర్‌గా పనిచేశారు.

# ఇజ్రాయెల్ రెనొవేషన్‌లో 1200 మందికి ఉపాధి

## ఇజ్రాయెల్ ప్రతినిధులతో మంత్రి వివేక్ వెంకటస్వామి చర్చలు

**హైదరాబాద్, మే 6 ప్రభాతవార్త:**ఇజ్రాయెల్ ప్రభుత్వం రీనోవేషన్ రంగంలో 1,200 మంది కార్మికుల అవసరం తీర్చేందుకు ఉత్తమ నైపుణ్యం కలిగిన వారిని తెలంగాణ నుంచి ఉపాధి నిమిత్తం పంపుతున్నామని రాష్ట్ర కార్మిక, ఉపాధి,గనుల శాఖ మంత్రి డా. జి.వివేక్ వెంకటస్వామి తెలిపారు. రాష్ట్ర కార్మిక, ఉపాధి,గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి, ఇజ్రాయెల్ ప్రభుత్వ ప్రతినిధులు,ప్రైవేట్ రంగ భాగస్వాములతో సమావేశమై రాష్ట్రంలోని నైపుణ్య యువతకు ఉపాధి అవకాశాలపై చర్చలు జరిపారు.ఈ సమావేశాన్ని కార్మిక ఉపాధి శాఖ ఆధ్వర్యంలోని తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బుధవారం హైదరాబాద్ మాసాబ్ ట్యాంక్‌లోని టామ్‌కామ్ కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది.నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇంటర్నేషనల్ , పాప్యులేషన్ అండ్ ఇమ్మిగ్రేషన్ అథారిటీ ఆఫ్ ఇజ్రాయెల్ సమన్వయంతో అభ్యర్థులకు సిరామిక్ టైలింగ్, ప్లాస్టరింగ్, బ్లాక్ మేసన్, డ్రై వాల్ వంటి రంగాల్లో శిక్షణ అందిస్తున్నారు. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇంటర్నేషనల్ , పాప్యులేషన్ అండ్ ఇమ్మిగ్రేషన్ అథారిటీ ఆఫ్ ఇజ్రాయెల్ సమన్వయంతో అభ్యర్థులకు సిరామిక్ టైలింగ్, ప్లాస్టరింగ్, బ్లాక్ మేసన్, డ్రై వాల్ వంటి రంగాల్లో శిక్షణ అందిస్తున్నామనీ మంత్రి తెలిపారు. గత సంవత్సరం నవంబర్ 17 నుండి 19 వరకు నిర్వహించిన ప్రీ స్కిల్ అంచనా పరీక్షల్లో మొత్తం 4,247 మంది అభ్యర్థులు పాల్గొనగా, అందులో 2,059 మంది అర్హత సాధించారనీ వివరించారు. ప్రస్తుతం తుది దశలో ఎంపికైన 1,200 మంది అభ్యర్థులకు మంగళవారం నుంచి ఫైనల్ స్కిల్ పరీక్షలు నిర్వహిస్తున్నారనీ ఈనెల 10వరకు కొనసాగుతోందని మంత్రి తెలిపారు.

ఈ కార్యక్రమం ద్వారా భారతీయ యువతకు, నిర్మాణ కార్మికు లకు ఇజ్రాయెల్‌లోని రీనోవేషన్ రంగంలో నియమించేందుకు నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇంటర్నేషనల్ , పాప్యులేషన్ అండ్ ఇమ్మిగ్రేషన్ అథారిటీ ఆఫ్ ఇజ్రాయెల్ లతో భాగస్వామ్యంగా చర్యలు చేపడుతున్నారు.ఈ కార్యక్రమంలో కార్మిక, ఉపాధి, శిక్షణ ఫ్యాక్టరీల శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, ఉపాధి శిక్షణ డైరెక్టర్ కాంతి వెస్లీ, టామ్‌కామ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యువత ప్రతిభకు పట్టంకట్టాలి: మంత్రి వివేక్

## వైభవంగా ప్రారంభమైన 3రోజుల యువ నాటకోత్సవాలు



జ్యోతిప్రకాసనంతో యువనాటకోత్సవాలను ప్రారంభిస్తున్న మంత్రి జి.వివేక్, అలేఖ్యపుంజాల, బిక్షు తదితరులు

**రవీంద్రభారతి, మే 6 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజాప్రభుత్వ ప్రజాపాలన ఉత్సవాల్లో భాగంగా అన్నిరంగాల్లో ప్రగతి వెల్లివిరుస్తుందని, తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో కళారంగంలో 3రోజులపాటు యువత ప్రతిభకు పట్టంకడుతూ యువనాటకోత్సవాలు నిర్వహించడం హర్షదాయకమని తెలంగాణ రాష్ట్ర గనుల, కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఈమేరకు మంత్రి అకాడమీ అధ్యక్షురాలు ఆచార్య అలేఖ్య పుంజాల, నాటక దర్శకుడు బిక్షు తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి యువనాటకోత్సవాలను లాంఛనంగా ప్రారంభించి ప్రసంగించారు. కళలను, కళాకారులను ఇతోధికంతో ప్రోత్సహించడానికి కట్టుబడి తమ ప్రభుత్వం ముందుంటుందని మంత్రి స్పష్టం చేశారు. యువతను ప్రోత్సహించడం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆలోచన, అభీష్టమని, మన సంస్కృతి, సంప్రదాయాలు, కళలకు పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఈనాటి నాటక ప్రదర్శనల్లోని కళాకారులు, దర్శకులను మంత్రి వివేక్ ఘనంగా సత్కరించారు. సమాజ పరివర్తన కోసం సందేశాత్మక ప్రదర్శనలు రూపొందించి, ప్రోత్సహించడానికి అకాడమీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని అలేఖ్య పుంజాల అన్నారు.

సర్వకళల సమా హారం నాటకమని, కళాకారులు సమాజ శాస్త్ర వేత్తలని ఆచార్య డా. బిక్షు అభివర్ణించారు. మొదటిరోజు యువనాటకోత్సవాల్లో సభకు ముందుగా తెలుగు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు దర్శకత్వంలో పాత్రికేయ రచించిన డింభకరాజ్యం వీధినాటకం ప్రకృతి పరిరక్షణ ప్రతీఒక్కరి బాధ్యతనే సందేశంతో రవీంద్రభారతి ప్రాంగణంలో విశ్వవిద్యాలయ విద్యార్థి బృందంచే అద్భుతంగా ప్రదర్శింపబడింది. సభానంతరం గేమ్ సాంఘిక నాటిక, శ్రీ మహిషాసురమర్ధిని పద్యనాటకం అద్భుతంగా ప్రదర్శింపబడి ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

# మంచిర్యాల జిల్లా రైతులకు అండగా ప్రభుత్వం

## తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది: మంత్రి తుమ్మల



**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:** అకాల వర్షాలతో అస్తవ్యస్తమైన మంచిర్యాల జిల్లా రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. మంచిర్యాల జిల్లాలో రైతులు ప్రాణాలు కోల్పయిన ఘటనలపై ఆ జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని రక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యాన్ని ఆరబెట్టేందుకు అవసరమైన డ్రైయర్స్, టార్పాలిన్లు తక్షణం అందుబాటులోకి తీసుకురావాలన్నారు. తడిసిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. జిల్లాలో పరిస్థితిని పర్యవేక్షించేందుకు మార్కెటింగ్ అధికారులను వెంటనే మంచిర్యాలకు పంపించారు.

# ఉచిత విద్యుత్ డిస్కంపై దుష్ప్రచారం

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:** విద్యుత్ ఉద్యోగ సంఘాల దుష్ప్రచారంపై ఉచిత విద్యుత్ పంపిణీ సంస్థ యాజమాన్యం హైకోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. తెలంగాణలోని ఇతర విద్యుత్ సంస్థల నుండి కొత్తగా ఏర్పడిన ఉచిత విద్యుత్ డిస్కంలోకి వెళ్లే సందర్భంలో ఉద్యోగుల ఆప్షన్లకు వ్యతిరేకంగా పలు ఉద్యోగ సంఘాల నేతలు హైకోర్టుకు వెళ్లబోతున్నారని తెలియడంతో, 45 సంఘాల వివరాలతో యాజమాన్యం హైకోర్టులో కేవియట్ వేసింది. ప్రధానంగా ఉచిత విద్యుత్ డిస్కమ్‌లో చేరకుండా, కొత్తగా నియామకాలు జరగకుండా కొందరు ఉద్యోగ సంఘాల నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని యాజమాన్యం భావిస్తోంది. ఈ కొత్త డిస్కమ్ పరిధిలో కమర్షియల్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, అకౌంట్స్, ఐటీ, రెగ్యులేటరీ విభాగాల్లో 660 మంది ఇంజనీర్లు, 1,000 మంది సిబ్బంది, 340 మంది పరిపాలనా ఉద్యోగులను నియమించాల్సి ఉంది. టీజీ ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎన్‌పీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్ పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులను పదోన్నతుల ద్వారా తీసుకోవాలని ఉన్నతాధికారులు గైడ్ లైన్స్ జారీ చేశారు, దీనికి గాను ఈ నెల 8 వరకు గడువు ఉంది. ఇప్పటివరకు కేవలం 670 మంది

**ఉద్యోగ సంఘాలకు వ్యతిరేకంగా**
**హైకోర్టులో కేవియట్**

ఉద్యోగులు మాత్రమే కొత్త డిస్కంలో చేరడానికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 4వ తేదీ నాటికి నార్త్ డిస్కమ్ నుంచి 320, సౌత్ డిస్కమ్ నుంచి 253, జెన్కో నుంచి 71, ట్రాన్స్ కో నుంచి 26 మంది ఉద్యోగులు అప్షన్ ఇచ్చారు. ఈ కొత్త డిస్కంలో ఉద్యోగులు చేరకుండా కొన్ని విద్యుత్ సంఘాల నేతలు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. రైతు డిస్కమ్‌ను ప్రైవేట్ పరం చేస్తారని, ఆ డిస్కమ్ అప్పుల్లో కూరుకుపోతుందని, అందులో పనిచేసే ఉద్యోగులకు జీతాలు కూడా టైమ్‌కు ఇవ్వరని దుష్ప్రచారం చేస్తున్నట్లు కొత్తగా ఏర్పడిన ఉచిత విద్యుత్ పంపిణీ సంస్థ యాజమాన్యం దృష్టికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఇంధన శాఖ ఉన్నతాధికారులు ఇప్పటికే ఆయా ఉద్యోగ సంఘాల నేతలతో పలుమార్లు చర్చలు జరిపి వారి అనుమానాలు నివృత్తి చేసే ప్రయత్నం చేశారు. కొత్త డిస్కంలో చేరే ఉద్యోగులకు ప్రభుత్వం తరపున ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు అందిస్తున్న విషయాన్ని వివరించారు. అయినప్పటికీ కొం దరు లీడర్లు ఉద్యోగుల ఆప్షన్లకు వ్యతిరేకంగా హైకోర్టుకు వెళ్లే సూచనలు కనిపించడంతో రైతు డిస్కమ్ యాజమాన్యం అలర్ట్ అయింది. ఈమేరకు విద్యుత్ శాఖలో గుర్తింపు పొందిన సంఘాల వివరాలను పేర్కొంటూ హైకోర్టును ఆశ్రయించింది. ఒక వేళ ఎవరైనా రైతు డిస్కమ్‌కు వ్యతిరేకంగా కోర్టును ఆశ్రయిస్తే తమ వాదనలు వినకుండా ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయరాదని హైకోర్టును అభ్యర్థించింది. దీంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యోగ సంఘాలు వ్యవహరిస్తున్న తీరుపై విద్యుత్‌శాఖలో జోరుగా చర్చ జరుగుతోంది.

# వంట గ్యాస్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

## రాష్ట్ర కార్మికశాఖ కార్యదర్శి దాసరి హరిచందన

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:**వంట గ్యాస్ డెలివరీ బాయ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను నెల రోజులలోపు పరిష్కరించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర కార్మికశాఖ కార్యదర్శి దాసరి హరి చందన హామీ ఇచ్చారు. ఈ విషయమై ఎల్‌పిజి డెలివరీ బాయ్స్ ఎదుర్కొంటున్న సమస్యలను బుధవారం సచివాలయంలో హరిచందనను తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ సలహాదారు టి చిరంజీవులు, నాయకులు చామకూర రాజు, నకిరేకంటి శ్రీనివాస్‌గౌడ్, అజయ్‌రెడ్డి కలిసి వివరించారు. ఎల్‌పిజి డిస్ట్రిబ్యూటర్లు సిలిండర్లు సరఫరా చేసే కార్మికులకు కనీస జీతాలు చెల్లించడం లేదని చెప్పారు. ఈఎస్ఐ, పిఎఫ్ ఇవ్వడం లేదంటూ పలు అంశాలను వివరించారు. రాష్ట్రంలో 806 గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూషనర్లు ఉన్నారని చెప్పారు. కార్మికులకు ముందస్తు సమాచారం లేకుండా అక్రమంగా తొలగిస్తున్నారని వారాంతపు సెలవులు కూడా ఇవ్వడం లేదని కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కార్యదర్శి హరిచందన మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై స్పందించి డిస్ట్రిబ్యూటర్లకు కార్మికశాఖ తరపున నోటీసులు పంపిస్తామన్నారు. డిస్ట్రిబ్యూటర్లతో సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగేష్‌గౌడ్, గ్రేటర్ హైదరాబాద్ నాయకులు యునుస్ తదితరులు పాల్గొన్నారు.

# రోస్టర్ పాయింట్లలో మాలలకు అన్యాయం

## రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతాం: జి.చెన్నయ్య




**హైదరాబాద్ (సైఫాబాద్), మే 6 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ హేతుబద్ధంగా జరిగిందని, రోస్టర్ పాయింట్ల, కులగణన సర్వేలో మాలలకు తీరని అన్యాయం జరిగిందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య, మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే రోస్టర్ పాయింట్ల విషయంలో మాలలకు న్యాయం చేయాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని వారు హెచ్చరించారు. మాల మహానాడు, మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం సైఫాబాద్‌లోని సామ్రాట్ కాంప్లెక్స్ లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రం ఆవిర్భావం నుంచి టిఆర్ఎస్, బిఆర్ఎస్ పాలనలో మాలలకు జరిగిన అన్యాయాలను అధిగమించడానికి కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం వేసిన షమీమ్ అక్తర్ కమిషన్ ఏకపక్షంగా ఉందని, 2011 జనాభా ప్రకారం ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టి మాలలకు తీరని అన్యాయం చేసిందని వారు ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో మాల మహానాడు నాయకులు బూర్గుల వెంకటేశ్వర్లు, రంజీత్‌కుమార్, రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పదేళ్ల పాలనలో రైతులను పట్టించుకోని బిఆర్ఎస్: ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్



**హైదరాబాద్,మే6,ప్రభాతవార్త:** పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో రైతులను పట్టిం చుకోలేదనీ కల్వకుంట్ల తారకరామారావు అలియాస్ తుఫాకీ రాముడు ఇప్పుడు రైతుల మీద అపార ప్రేమ ఉన్నట్లు మాట్లాడుతున్నారని ప్రభుత్వవిప్ బల్మూరి వెంకట్ విమర్శించారు. బుధవారం సిఎల్‌పిలో విలేఖరులతో మాట్లాడుతూ ఖమ్మంలో మిర్చి రైతులకు సంకెళ్లు వేశారనీ సిరిసిల్ల నియోజకవర్గం నేరెళ్లలో రైతులను వేధించారనీ ఆయన ఆరోపించారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్ళలలో రూ.2.88 లక్షల కోట్లు మాత్రమే రైతుల కోసం ఖర్చు చేసిందనీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 28 నెలల్లో 1.52,656 కోట్ల రూపాయలను రైతుల కోసం ఖర్చు చేసిందనీ గణాంకాలతో వివరించారు. డ్రగ్స్ తీసుకుని వచ్చి కెటిఆర్ మాట్లాడుతున్నాడా అన్న అనుమానం కలుగుతోందనీ అన్నారు. రాహుల్ గాంధీ ఆయన చెల్లెలు ప్రియాంక గాంధీ పట్ల అపారగౌరవాన్ని చూపిస్తున్నారనీ ఆమెను ఎంపీని చేశారనీ గుర్తుచేశారు. కాని కెటిఆర్ ని ఆయన చెల్లెలు కవిత రోజూ నిన్ను తిడుతోందనీ ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ గురించి మాట్లాడే స్థాయి కెటిఆర్‌కు లేదని,నా కుర్చీ రేవంత్ రెడ్డి గుంజుకుని పోయాడన్న కడుపు మంటలో మాట్లాడితే ప్రజలు ఊర్కోరని హెచ్చరించారు. డ్రగ్స్ టెస్ట్ పిలిస్తే కెటిఆర్ ఆమ్‌స్టర్‌డామ్ లో టెస్టులు చేయించుకుని క్లీన్‌గా వచ్చి డ్రగ్స్ టెస్ట్ చేయమని ముందుకు వచ్చాడనీ ఆరోపించారు. మేడిగడ్డను బాంబులు పేలిస్తే అప్పుడు అధికారంలో ఉన్న మీరు ఏం చేశారనీ ఆయన ప్రశ్నించారు.

# నిర్మాణ వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పారవేయవద్దు

## ఎస్కీ వర్క్ షాప్‌లో జయేష్ రంజన్

**హైదరాబాద్, మే 6 ప్రభాతవార్త:** రోజురోజుకు పెరిగిపోతున్న పట్టణీకరణ నేపథ్యంలో పలు నిర్మాణాలతో పాటుగా కూల్చివేత వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయని, అక్రమంగా తరలిస్తున్న ఈ వ్యర్థాలు ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ పరిసరాల్లో, చెరువులు, కుంటలు, నాలాలు ఖాళీ ప్రదేశాల్లో పడేస్తున్నారని, ఐకియా ప్రాంతంలోని పేరుకుపోయిన నిర్మాణ వ్యర్థాల గుట్టను తొలగించాలంటే సుమారు 60 కోట్లు ఖర్చు అవుతుందని, ప్రజలు నిర్లక్ష్యంతో వేస్తున్న ఈ నిర్మాణ వ్యర్థాల వలన పర్యావరణ కాలుష్యం పెరిగిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేష్ రంజన్ అన్నారు. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా, అర్బన్ డెవలప్ మెంట్, స్పోర్ట్స్ డిపార్టుమెంటు సహకారంతో గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా బుధవారం ఏర్పాటు చేసిన రివైజ్డ్ కన స్ట్రక్షన్ అండ్ డిమాలిషన్ వేస్ట్ మేనేజిమెంట్ రూల్స్-2025పై జరిగిన వర్క్‌షాప్‌లో జయేష్ రంజన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.నగరంలో ప్రతి రోజూ ఉత్పత్తి అవుతున్న సుమారు ఎనిమిదివేల టన్నుల చెత్తలో 1700 టన్నుల చెత్త కేవలం నిర్మాణ వ్యర్థా లైన కాంక్రీట్, మట్టి, ఇసుక, గ్రావెల్, ఇటుకలు, పింగాణీ కలప, లోహాలు, ప్లాస్టిక్, పైపులు, టైల్స్ ఉంటున్నాయని, ఒకటన్ను చెత్త రవాణాకు ప్రభుత్వం రెండు వేలు ఖర్చు చేస్తున్న విషయాన్నీ ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. వేస్ట్ టు వెల్త్ దిశగా ప్రభుత్వం కృషి చేస్తున్నప్పటికీ, నిర్మాణ వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే ప్లాంట్స్ ఇంకా ఎక్కువ అవసరమన్నారు. ప్రతి ప్రభుత్వ టెండర్‌లో 20 నుండి 25 శాతం నిర్మాణ వ్యర్థాల రీ సైక్లింగ్ మెటీరియల్ వాడే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు జయేష్ రంజన్ తెలిపారు. హైదరాబాద్ నగరం 2047 నాటికీ నెట్ జీరో నగరంగా ఉండాలని ఇటీవల జరిగిన గ్లోబల్ సమిట్‌లో ముఖ్యమంత్రి నిర్ణయించారని, ప్రతి పౌరుడు, కాలుష్య నివారణ తన బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఉదయం జరిగిన సమావేశంలో ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నేషనల్ ఛైర్మెన్ సి. శేఖర్ రెడ్డి మాట్లాడుతూ మెట్రో స్టేషన్స్, ఐటి బిల్డింగ్స్, తదితర భారీ నిర్మాణాల్లో గ్రీన్ బిల్డింగ్ కాన్సెప్ట్ కోసం రూపొందించిన 32 రేటింగ్స్‌ను తాము పరిశీలిస్తామన్నారు. నిర్మాణ వ్యర్థాలను పరిశీలించి సర్టిఫైడ్ చేసే ఒక సంస్థ తప్పనిసరిగా అవసరమన్నారు. నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్మెంట్ కౌన్సిల్ తెలంగాణ ప్రెసిడెంట్ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ వికసిత భారత్ లక్ష్యంగా ప్రభుత్వానికి, రియల్ ఎస్టేట్ ఇండస్ట్రీ సమన్వయకర్తగా పని చేస్తున్న తమ సంస్థ పలు నిర్మాణాల పనితీరును పరిశీలిస్తుందని, నిర్మాణ వ్యర్థాల కొత్త రూల్స్ 1 మార్చ్, 2026 నుండి అమల్లోకి వచ్చా యన్నారు. ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు వర్క్ షాప్ ప్రాధాన్యతను వివరిస్తూ, ఇల్లీగల్ డంపింగ్‌ను నివారించడానికి, రెగ్యులర్ మానిటరింగ్ మేనేజిమెంట్ అవసరమన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమీషనర్ రఘు ప్రసాద్ కన స్ట్రక్షన్ అండ్ డిమాలిషన్ ప్రాధాన్యతపై సమగ్ర వివరణతో కూడిన ప్రెజెంటేషన్ ఇచ్చారు. నగరంలోని ఫతుల్లాగూడ, జీడిమెట్ల, శంషాబాద్, తూముకుంటలో రోజుకు 500 టన్నుల నిర్మాణ వ్యర్థాలను రీ సైక్లింగ్ చేసే ప్లాంట్స్ ఉన్నాయని, మరిన్ని ప్లాంట్స్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసే యోచనలో ఉందన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా మహిళా, శిశు సంక్షేమంలో సోదాలు

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆయా శాఖల్లో అవినీతిపై ఆరోపణలు రావడంతో సోదాలు చేపట్టినట్టు తెలిసింది.జగిత్యాల కలెక్టరేట్‌లోని జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ కార్యాలయంలో ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు.మంచిర్యాల జిల్లా సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో ఏసీబీ అధికారులు రికార్డులు, కంప్యూటర్లు పరిశీలించి పలువురిని విచారించారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని వరంగల్ జిల్లా సంక్షేమాధికారి కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఫైళ్లు, రికార్డులను పరిశీలించారు. హనుమకొండ రిజిస్ట్రేషన్ శాఖ సబ్ రిజిస్ట్రార్ ఇండ్లలోనూ ఏసీబీ తనిఖీలు కొనసాగుతున్నట్లు తెలిసింది.



# నిరుద్యోగులకు వయోపరిమితి పదేళ్లు పెంచాలి

**డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకు కోదండరాం, అద్దంకి దయాకర్ వినతి పత్రం అందజేత**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే6:** రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగ అభ్యర్థులకు ప్రభుత్వం తరఫున తీపి కబురు అందించే అవకాశం కనిపిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఇచ్చే నోటిఫికేషన్లలో వయోపరిమితిని మరో 10 ఏళ్ల పాటు సడలించాలని పొలిటికల్ జేఏసీ చైర్మన్, ఎమ్మెల్సీ కోదండరాం, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్‌లు ప్రభుత్వానికి విన్నవించారు. ఈ మేరకు వారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలను వేర్వురుగా కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ఉద్యమ కాలంలో పదేళ్ల పాటు ఎటువంటి నోటిఫికేషన్లు విడుదల కాలేదని, స్వరాష్ట్రం సిద్ధించిన తర్వాత అధికారంలోకి వచ్చిన గత ప్రభుత్వం కూడా పదేళ్ల కాలంలో ఉద్యోగాల భర్తీని నిర్ల [illegible] చేసిందని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సుదీర్ఘ 20 ఏళ్ల కాలంలో సరైన నోటిఫికేషన్లు లేక లక్షలాది మంది అభ్యర్థులు వయోపరిమితి దాటిపోయి, అర్హత కోల్పోయి తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుత ప్రజా ప్రభుత్వం నిరుద్యోగుల పక్షపాతి అని, ఈ నేపథ్యంలో అభ్యర్థులు నష్టపోకుండా ఉండాలంటే భవిష్యత్తులో విడుదలయ్యే అన్ని నోటిఫికేషన్లలో వయోపరిమితిని పెంచాలని కోరారు. తద్వారా వేలాది మంది యువతకు ఉద్యోగ పోటీ పొందే అవకాశం లభిస్తుందని వారు వివరించారు. ఈ విన్నపంపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. నిరుద్యోగులకు సంబంధించిన ఈ సమస్య గురించి వారితో లోతుగా చర్చించారు. దీనిపై త్వరలోనే ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి, సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం వయోపరిమితి సడలింపుపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు డిప్యూటీ సిఎం హామీ ఇచ్చారు.

# పారదర్శకంగా బదలీలు చేపట్టాలి..

**ఉద్యోగుల సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత, బదలీల ప్రక్రియ ఆదర్శంగా నిలిచేలా ఉండాలి**

**అధికారులను ఆదేశించిన సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:** పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ ఎలాంటి వివాదాలకు తావు లేకుండా ఉద్యోగుల బదిలీలను నిర్వహించాలని అధికారులను రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదేశించారు. బదిలీల ప్రక్రియను సంక్షేమశాఖ పరిధిలో పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షికంగా అమలు చేయాలన్నారు. ఈ మేరకు సచివాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. దూర ప్రాంతాల్లో చాలాకాలంగా సేవలు అందించిన ఉద్యోగులకు కోరుకున్న ప్రాంతాల్లో పోస్టింగులు కల్పించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు ఉన్న ఉద్యోగులు, దంపతులు ఒకే చోట పనిచేసే స్పౌస్ కేసులు వంటి అంశాలను సానుకూలంగా పరిగణించాలని ఆదేశించారు. దుర్భర పరిస్థితుల్లో విధులు నిర్వహించిన వారికి మానవీయ దృక్పథంతో న్యాయం చేయాలని పేర్కొన్నారు. బదిలీలకు స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించి ఉద్యోగులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రతీ దశలో డిజిటల్ పద్ధతులను వినియోగించి మానవ జోక్యం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి వేగంగా స్పందించాలని ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. ఎలాంటి ఒత్తిడి లేదా ఇతర వ్యక్తిగత ప్రభావాలు లేకుండా నిష్పాక్షికంగా ప్రక్రియ కొనసాగించాలని స్పష్టం చేశారు. గురుకుల సంస్థల్లో బోధన నాణ్యత దెబ్బతినకుండా అవసరమైన సిబ్బంది సమతుల్యతను కాపాడాలని మంత్రి అడ్లూరి స్పష్టం చేశారు. మహిళా ఉద్యోగులు, దివ్యాంగులు, సీనియర్ ఉద్యోగులకు ప్రత్యేక సౌలభ్యాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. గురుకులాల్లో అమలు చేసిన 370 జీవో కారణంగా ఉద్యోగులు ఎదుర్కొన్న ఇబ్బందులను అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి స్పందిస్తూ..జీవో 190 అమలు సాధ్యాసాధ్యాలను సమగ్రంగా పరిశీలించి అమలు చేసేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి సంతోష్, వివిధ సంక్షేమ విభాగాల ఉన్నతాధికారులు శారద, ఎస్. రాజేందర్‌రెడ్డి, నటరాజ్, వెంకన్న, లింగారెడ్డి, రాజుబాబు, వేణు గోపాల్, దివ్యాంగులశాఖ డైరెక్టర్ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

# విద్య, వైద్యం బాధ్యత ప్రభుత్వాలదే..

## ఫీజులు పెంచినా పట్టించుకోకపోవడం దుర్మార్గం:

## టిఆర్ఎస్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్,మే 6,ప్రభాతవార్త:** విద్య ద్వారానే సమానత్వం, స్వేచ్ఛ సాధ్యమని టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత అన్నారు.నాణ్యమైన విద్య ఫీజుల నియంత్రణ అనే అంశంపై ఆమె హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉచిత విద్య, వైద్యం భాద్యత ప్రభుత్వాలదే అనే నమ్మకం ప్రజల్లో ఉండాలన్నారు. ప్రైవేటు పాఠశాలలు, కార్పొరేట్ స్కూళ్ల ఫీజులు ఎంత పెంచినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉంటామంటే కుదరదని హెచ్చరించారు. ముఖ్యమంత్రే విద్యాశాఖ మంత్రి ఉండటం రాష్ట్రానికి దౌర్భాగ్యమైన పరిస్థితిగా మారిందన్నారు. 50 నుంచి 120 శాతం ఫీజులు పెరిగినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. పిల్లల చదువు బాధ్యత కేవలం తల్లిదండ్రులది మాత్రమే కాదని ప్రభుత్వ పాత్ర కూడా ఉండాలని గుర్తుచేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం అవతరించిన తర్వాత ఫీజుల నియంత్రణ కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం తిరుపతిరావు కమిషన్ వేసిందని కవిత తెలిపారు. ఆ కమిషన్ అధ్యయనం చేసి స్పష్టమైన నివేదికను కూడా ఇచ్చినట్లు గుర్తుచేశారు. కానీ ఫీజు రీయిం బర్స్‌మెంట్ విషయంలో కేసీఆర్ సర్కార్ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని మండిపడ్డారు. గురుకులాలు ఏర్పాటు చేశామని ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోబోమంటే కుదరదని తేల్చి చెప్పారు. తమిళనాడు తరహాలో ఇక్కడ కూడా ఫీజు నియంత్రణ కోసం పర్మినెంట్ అథారిటీ ఉండాలని లేదంటే గుజరాత్ లో మాదిరిగా ప్రాథమిక విద్యకు 15 వేలు, ఉన్నత విద్యకు 25 వేలకు మించి ఫీజు ఉండొద్దనే రెండు అంశాల్ని ఆమె ప్రత్యామ్నాయంగా ప్రభుత్వానికి సూచించారు. మన రాష్ట్రంలో 64 లక్షల మంది విద్యార్థులు ఉంటే 65నుంచి 75 శాతం వరకు ప్రైవేటు పాఠశాలల్లోనే చదువుతున్నారని కవిత అన్నారు. ఈ ప్రభుత్వం కచ్చితంగా కార్పొరేట్ స్కూళ్ల దోపిడీని నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించిన జీవోను తక్షణమే జారీ చేయాలన్నారు. గతేడాదితో పోలిస్తే ఒక్క రూపాయి కూడా ఫీజు పెంచకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ముఖ్యమంత్రి ప్రైవేట్ స్కూల్స్ ఓపెనింగ్‌లకు వెళ్తూ ఏం సందేశం ఇస్తున్నట్లు? ప్రైవేట్ విద్యాసంస్థలను దోపిడీని ముఖ్యమంత్రే ప్రోత్సహిస్తున్నట్లా? అని కవిత ప్రశ్నించారు.

# ఆర్టీసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయండి

## ఎండి నాగిరెడ్డికి ఎంప్లాయిస్ యూనియన్ నివేదిక

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:** ఆర్టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని యాజమాన్యాన్ని టిజెఎస్‌ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ కోరింది. ఈ విషయమై బుధవారం ఆర్టిసి ఎండి నాగిరెడ్డిని యూనియన్ నేతలు ఈదురు వెంకన్న, అహ్మద్ అలి, డి. గోపాల్, రాఘవులు, నగేష్ పటేల్ తదితరులు కలిశారు. తెలంగాణ ఆవిర్భావ దినోతనసవం జూన్ 2ను విలీనానికి అపాయింటెడ్‌డేగా ప్రకటించాలని కోరుతూ రూపొందించిన నివేదికను సమర్పించారు.


అదేవిధంగా దివంగత శంకర్‌గౌడ్ కుటుంబానికి ప్రతి ఉద్యోగి మే నెల జీతం నుండి 300 రూపాయలు కట్ చేసి ఇవ్వాలని ఎండిని కోరారు. కాగా తాము సమర్పించిన వినతి పత్రంపై ఎండి సానుకూలంగా స్పందించారని, ప్రభుత్వానికి నివేదిక పంపుతామని హామీ ఇచ్చారని యూనియన్ నేతలు తెలిపారు.

# పాత పద్ధతిలోనే పిఆర్ఎస్ అమలు, డిఎల విలీనంపై అసత్య కథనాలను నమ్మొద్దు

**ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జెఎసి వినతి**

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త**:రాష్ట్రంలో పిఆర్‌సి అమలు, డిఎల విలీనంపై సోషల్ మీడియాలో వస్తున్న కథనాలు అవాస్తవమని, వాటిని నమ్మి ఆందోళనచెందొద్దని ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్లకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జెఎసి సూచించింది. ఈ విషయమై జెఎసి ఛైర్మన్‌మారం జగదీశ్వర్, కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పిఆర్ఎస్ అమలు తేది 1.7.2023 నాటికి ఉన్న డిఎలను మాత్రమే బేసిక్ పేలో విలీనం చేసి ఆపై ఫిట్‌మెంట్ నిర్ణయిస్తారని, ఇది దశాబ్దాలుగా వస్తున్న పద్ధతి అని స్పష్టం చేశారు. జెఎసిలోని ఒక్కనాయకుడు, సంఘం కూడా నిబం దనలకు భిన్నంగా మాట్లాడలేదని వారు స్పష్టం చేశారు. ఒకవేళ ఎవరైనా మాట్లాడినా అది జేఎసి వైఖరికాదని తేల్చిచెప్పారు. ఈ విషయంలో కొన్ని రాజకీయ పార్టీలు, ఉద్యోగ సంఘాల మాజి నేతల కుట్రలు ఉన్నాయని మండిపడ్డారు.

# ఆడబిడ్డ కళ్లలో ఆనందం కోసం 6 నెలల పసిపాప కిడ్నాప్



పాపను తల్లిదండ్రులకు అప్పజెప్పిన పోలీసులు

## 48 గంటల్లో కేసు ఛేదించిన సూరారం పోలీసులు

## ఐదుగురు అరెస్ట్.. పాపను తల్లి ఒడికి చేర్చిన వైనం

**జీడిమెట్ల, మే 6, ప్రభాతవార్త:** సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఆరు నెలల పసిపాప అపహరణ కేసునుపోలీసులు 48 గంటల్లో ఛేదించారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. **వివరాల్లోకి వెళితే..** అర్ధరాత్రి సమయంలో తల్లి ఒడిలో నిద్రపోతున్న ఆరు నెలల పసిపాపను బైక్‌పై వచ్చిన దుండగులు ఎత్తుకెళ్లారు. మెలుకువ వచ్చిన తల్లి కేకలు వేస్తూ వారిని వెంబడించినా, దుండగులు వేగంగా పారిపోయారు. వెంటనే ఆమె సూరారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి నాలుగు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. సుమారు 50 సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించి కేసును ఛేదించారు. పోలీసుల దర్యాప్తులో పసిపాప రాజేంద్రనగర్ అత్తాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో పనిచేసే శ్రీదేవి (35) వద్ద ఉన్నట్లు గుర్తించారు. ఆమెను అదుపులోకి తీసుకుని పాపను సురక్షితంగా రక్షించి తల్లి ఒడికి చేర్చారు.పోలీసుల విచారణలో బయటపడిన విషయం..ఈ కిడ్నాప్‌కు శ్రీదేవితో పాటు కార్తీక్ (18), జాన్సన్ (24), మరో ఇద్దరు మైనర్లు కలిసి ముఠాగా ఏర్పడి ఈ దారుణానికి పాల్పడ్డట్లు వెల్లడైంది. నిందితురాలి ఆడపడుచుకు పిల్లలు లేకపోవడంతో, ఆమె కళ్లలో ఆనందం చూడాలనే ఉద్దేశంతో ముందుగా ప్రాంతాన్ని పరిశీలించి ఈ అపహరణకు పథకం రచించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కుత్బుల్లాపూర్ డీసీపీ తెలిపారు.

# విద్య, పరిశ్రమల అవసరాలకనుగుణంగా బోధన ఉండాలి

## ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్టారెడ్డి హెచ్చరిక

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:**ప్రస్తుత విద్యా, పరిశ్రమ మార్పులకనుగుణంగా ఉపాధ్యాయులు, అధ్యాపకులు తమను తాము అప్‌డేట్ చేసుకోకపోతే కాలానుగుణంగా వెనుకబడే ప్రమాదం ఉందని తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి హెచ్చరించారు. కొత్త కోర్సులు విద్యార్థుల ఉపాధి అవకాశాలు, సామాజిక ప్రాముఖ్యతను పెంపొందించేలా రూపొందించామని గుర్తు చేశారు. ఇందుకు ఆరు విశ్వవిద్యాలయాల వైస్‌చాన్స్‌లర్లు, పరిశ్రమ నిపుణులు, ఇతర భాగస్వాములతో విస్తృతంగా చర్చలు జరిపినట్లు పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం 2026-27లో ప్రవేశపెట్టనున్న కొత్త డిగ్రీ కోర్సులపై చైర్మన్ ఆధ్వర్యంలో బుధవారం ఆన్‌లైన్ ఇంటరాక్టివ్ అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతర నైపుణ్యాభివృద్ధి అవసరాన్ని ప్రస్తావించారు. కాలేజీలకు పాఠ్యపుస్తకాలు, నిపుణుల సేవలు, అలాగే తప్పనిసరి ఇంటర్న్‌షిప్‌ల కోసం కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకునేందుకు జాబితా అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కోర్సుల నిర్మాణంలో టెక్నాలజీ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, న్యాయ అంశాలు, పరిశోధన/ ఇంటర్న్‌షిప్ అనే నాలుగు ముఖ్య భాగాలను సమన్వయం చేసినట్లు వివరించారు. మారిటైం రంగం వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని, విద్యార్థులను ఆ దిశగా సిద్ధం చేయడం ఉపాధ్యాయుల బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. డిగ్రీ దండగా కాదు.. పండగా అని వ్యాఖ్యానించారు.

# రోడ్డుప్రమాదంలో సంతోష్ నాయర్ మృతి

**పతనంతిట్ట, మే 6:** ప్రముఖ మలయాళ నటుడు సంతోష్ నాయర్ (63) రోడ్డు ప్రమాదంలో కన్నుమూశారు. కేరళలోని పతనంతిట్ట జిల్లా ఏనాతు వద్ద ఈ దుర్ఘటన జరిగింది. ఆయన ప్రయాణిస్తున్న కారును ఎదురుగా వస్తున్న ఓ లారీ వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంతోష్‌ను ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతున్న సమయంలో గుండెపోటు రావడంతో ఆయన తుదిశ్వాస విడిచారు. ఈ ప్రమాదంలో సంతోష్ నాయర్ భార్య శుభశ్రీకి కూడా తీవ్ర గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ సైతం గాయపడినట్లు సమాచారం.

# ఆన్‌లైన్ బెట్టింగ్ కోసం హత్య - దొంగతనాలకు పాల్పడిన దంపతులు అరెస్ట్

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి:** సిద్దిపేట జిల్లాలో సంచలనం రేపిన హత్య కేసును చిన్నకోడూరు పోలీసులు ఛేదించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ అలవాటుతో అప్పుల్లో కూరుకుపోయిన దంపతులు డబ్బుల కోసం హత్య, దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం బెలిదే వనిత భర్త విశ్వనాథ్ మిస్సింగ్ కేసుగా నమోదైన ఘటన (క్రైమ్ నెం.100/2026) దర్యాప్తులో హత్యగా మారింది. మే 3న మల్లన్నసాగర్ కాలువ వద్ద లభించిన మృతదేహాన్ని విశ్వనాథ్‌గా గుర్తించారు. అనంతరం సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాల ఆధారంగా నిందితులను గుర్తించారు. ఈ కేసులో గౌటే ప్రవీణ్ కుమార్ (42), ఆయన భార్య గౌటే రజిత (35)లను అరెస్ట్ చేశారు. వీరు ఆన్‌లైన్ బెట్టింగ్‌లో సుమారు రూ.36 లక్షలు నష్టపోయి అప్పుల్లో కూరుకుపోయినట్లు తెలిపారు. మే 2న విశ్వనాథ్‌ను సిద్దిపేట ఎల్లమ్మ గుడి వద్దకు పిలిచి కారులో తీసుకెళ్లిన నిందితులు, పెద్దకోడూరు శివారులోని నిర్మానుష్య ప్రాంతంలో చేతులు కట్టి మెడకు వైర్ బిగించి హత్య చేశారు. అనంతరం అతని వద్ద ఉన్న బంగారు చైన్, కడెం, ఉంగరాలను దోచుకుని మృతదేహాన్ని మల్లన్నసాగర్ కాలువలో పడవేశారు. దొంగిలించిన బంగారాన్ని హైదరాబాద్ బేగంబజార్‌లో విక్రయించి సుమారు రూ.12.10 లక్షలు పొందినట్లు విచారణలో వెల్లడైందని, ఇదే దంపతులు ఏప్రిల్ 25న సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వృద్ధురాలిని ఆసుపత్రికి తీసుకెళ్తామని నమ్మించి ఆమె బంగారు పుస్తెలతాడును దొంగిలించిన ఘటన కూడా వెలుగులోకి వచ్చింది. ఆ బంగారాన్ని విక్రయించి వచ్చిన డబ్బును కూడా ఆన్‌లైన్ బెట్టింగ్‌లో కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు. సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక సమాచారంతో నిందితులను అరెస్ట్ చేసి కేసును ఛేదిం చిన పోలీసు బృందాన్ని సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి అభినందించారు. కేసులో మరింత దర్యాప్తు కొనసాగుతోంది.

# మౌనం వీడిన మహువా మొయిత్రా

**కోల్‌కత్తా, మే 6:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చారిత్రాత్మక విజయం సాధించిన నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ మహువా మొయిత్రా తన మోనాన్ని వీడారు. ప్రజల తీర్పును గౌరవిస్తున్నామని, అయితే అసమాన ప్రతికూలతల మధ్య తమ పార్టీ గొప్ప పోరాటం చేసిందని ఆమె అన్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఆమె ఒక పోస్ట్ చేశారు. ప్రజల తీర్పే శిరోధార్యం. బెంగాల్ బీజేపీని కోరుకుంటే, వారికి బీజేపీ లభించింది. మేము దానిని గౌరవిస్తాం. ఊహించని ప్రతికూలతల మధ్య మేము మంచి పోరాటం చేశాం. అందుకు నా నాయకురాలు, నా పార్టీ పట్ల గర్వపడుతున్నానని ఆమె పేర్కొన్నారు. బలప్రయోగంతో కూడిన మెజారిటీవాదం కాకుండా, రాజ్యాంగమే తుది నిర్ణయంగా ఉండే లౌకిక దేశం కోసం తాము పోరాడుతూనే ఉంటామని ఆమె స్పష్టం చేశారు. నిజానికి, ఓట్ల లెక్కింపు రోజు ఉదయం మహువా మొయిత్రా చాలా చురుగ్గా ఉన్నారు. ఈవీఎంల ట్యాంపరింగ్ జరుగుతోందని, స్ట్రాంగ్‌రూమ్‌లలో విద్యుత్ కోతలు విధిస్తున్నారని ఆరోపించారు. అయితే, ఫలితాలు బీజేపీకి అనుకూలంగా రావడం మొదలయ్యాక ఆమె పూర్తిగా నిశ్శబ్దంగా ఉండిపోయారు. ఫలితాల్లో బీజేపీ 206 స్థానాలు గెలుచుకుని మూడింట రెండొంతుల మెజారిటీ సాధించింది. దీంతో 15 ఏళ్ల టీఎంసీ పాలనకు తెరపడింది. మహువా మొయిత్రా ప్రాతినిధ్యం వహిస్తున్న కృష్ణానగర్ లోక్‌సభ నియోజకవర్గంలోని పలు అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ బీజేపీ గెలిచింది.

# జీలుగ విత్తనాల కోసం అన్నదాతల ఎదురు చూపులు

## ఈ ఖరీఫ్‌లో ముందే నైరుతి పలకరిస్తుందన్న వాతావరణశాఖ

## సరఫరాపై కసరత్తు ప్రారంభించని వ్యవసాయశాఖ

**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:**తెలంగాణలో వానాకాలం పంటల సాగుకు సమయం ఆసన్నమవుతుండటంతో పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ విత్తనాల కోసం రైతులు తీవ్రంగా ఎదురుచూస్తున్నారు. మరో 20 రోజుల్లో రోహిణి కార్తె ప్రారంభం కానుండడం, వానాకాలం సాగుకు పొలాలను సిద్ధం చేసుకోవాల్సిన పరిస్థితుల్లో భూసారాన్ని పెంచేందుకు జీలుగ విత్తనాలు కీలకమని అన్నదాతలు భావిస్తున్నారు. జీలుగ విత్తనాల సరఫరా ఆలస్యమైతే వానాకాలం సాగు కూడా వెనుకబడుతుందని వాపోతున్నారు. ఎందుకంటే విత్తనాలు చల్లిన 40 రోజులకు పెరిగిన జీలుగ మొక్కలను కలియదున్నాల్సి ఉంటుంది. ఆ తర్వాతే వరినాట్లు వేసుకోవాలి. ఈ నేపథ్యంలో జీలుగ విత్తనాలు పంపిణీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. 2026-27 వానాకాలానికి జీలుగ పచ్చిరొట్ట విత్తనాల సరఫరా విషయంఒల వ్యవసాయశాఖ ఇప్పటి వరకు ఎలాంటి కసరత్తు మొదలుపెట్టకపోవడంపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ సారి నైరుతి ముందే వస్తుందన్న వాతావరణశాఖ ప్రకటనతో అన్నదాతలు ఖరీఫ్ సాగుపై గంపెడాశలు పెట్టుకున్నారు. సాగులో కీలకమైన పచ్చిరొట్ట సాగుకు సిద్ధమవుతున్నారు. అయితే జీలుగ విత్తనాల సరఫరాపై రాష్ట్ర వ్యవసాయశాఖ, విత్తనాభివృద్ధి సంస్థ ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో గతంలో మాదిరిగా జీలుగ విత్తనాల కోసం అగ్రోస్ రైతు సేవా కేంద్రాలు, వ్యవసాయ కార్యాలయాల వద్ద పడిగాపులుగాయాల్సి వస్తుందేమోనన్న ఆందోళన అన్నదాతల్లో వ్యక్తమవుతోంది. అదే సమయంలో 30 కేజీల జీలుగ బస్తా ధర రూ. 1150 నుండి రూ. 2150కి పెరగడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామీణ జిల్లాలకు కలిపి జిల్లాకు సగటున 6వేల క్వింటాళ్ల కిలోల జీలుగ విత్తనాలు కావాల్సి ఉంటుంది. ఈ లెక్కన తెలంగాణ రాష్ట్రానికి లక్షా50వేల క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అవసరమవుతాయని అంచనా. నేల సారాన్నిపెంచడానికి, వరిసాగుకు ముందు జీలుగ చాలా కీలకమైనది కావడంతో వ్యవసాయశాఖ వేగంగాస్పందించి సబ్సిడీపై జీలుగ విత్తనాలను అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

# బయో టెర్రర్ కేసులో ముగ్గురు ఐసిస్ ఉగ్రవాదులపై ఛార్జిషీటు



**హైదరాబాద్, మే 6, ప్రభాతవార్త:** ఏడాది క్రితం రాజేంద్రనగర్‌లో వెలుగు చూసిన బయో టెర్రర్ కేసులో అరెస్టయిన ఐసిస్‌కు చెందిన ముగ్గురు ఉగ్రవాదులపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) అహ్మదాబాద్ కోర్టులో బుధవారం నాడు ఛార్జిషీట్ దాఖలు చేసింది. హైదరాబాద్‌కు చెందిన వైద్యుడు సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్ ఐసిస్‌లో కీలకంగా వుంటూ ఉగ్రవాదిగా మారడం తెలిసిందే. చైనాలో వైద్య విద్యను అభ్యసించిన ఇతను ఆ తరువాత ఐసిస్‌లో చేరి ఆముదం గింజల నుంచి రిసిన్ అనే ప్రమాదకర విష పదార్థాన్ని తయారు చేయడం విదితమే. ఇందుకోసం ఇతను రాజేంద్రనగర్‌లోని ఉప్పర్‌పల్లిలో గల ఓ అపార్ట్‌మెంట్‌లో తానుండే ఇంటిని ఒక రహస్య ప్రయోగశాలగా మార్చాడు. ఇతని మిత్రులుగా వున్న యుపికి చెందిన ఆజాద్ మహమ్మద్ సొహైల్‌లు కూడా కీలకంగా వ్యవహరించారు. వీరు కూడా ఐసిస్‌లో ఉగ్రవాదులుగా చేరారు. భారత్‌లో రిసిన్ అనే విష పదార్థాన్ని జనం రద్దీగా వుండేచోట వెదజల్లి దాని నుంచి వెలువడే విష వాయువుతో అమాయకులను చంపాలని వీరి వ్యూహం. ఇందుకోసం వీరు హైదరాబాద్‌తో పాటు ఢిల్లీ, అక్నో, అహ్మదాబాద్ వంటి పలు నగరాలలో రెక్కీ నిర్వహించారు. అయితే చివరి నిమిషంలో ముగ్గురు దొరికిపోయారు. ఇందులో సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్ హైదరాబాద్‌లో పట్టుబడగా మిగతా ఇద్దరు యుపిలో దొరికిపోయారు. నిందితులపై ఉపా చట్టం కింద కేసు నమోదు చేసిన ఎన్ఐఎ ముగ్గురిని అహ్మదాబాద్ జైల్లో నిర్బంధించారు. వీరి నేరాలు, కుట్రల కు సంబంధించి ఎన్ఐఎ బుధవారం నాడు మొదటి ఛార్జిషీట్ దాఖలు చేసింది.

# వైద్య, ఆరోగ్యశాఖలో 18 వేల ఉద్యోగాల భర్తీ

**అతి త్వరలో మల్టీపర్పస్ ఏఎన్ఎంలు, నర్సింగ్ ఆఫీసర్ల ఫలితాలు విడుదల చేస్తాం**

**బాలసదనాలను ప్రభుత్వ, సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేస్తాం**

**నారాయణఖేడ్‌లో ప్రజాపాలన ప్రగతిప్రణాళిక కార్యక్రమంలో మంత్రి దామోదర రాజనర్సింహ**



దివ్యాంగులకు స్కూటీలు అందజేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎంపీ సురేష్ షెట్కార్

**నారాయణఖేడ్, మే 6 ప్రభాతవార్త:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 99 రోజుల కార్యాచరణ అమలు కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని బాలసదనంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరైనారు. బాల సదనం నూతన భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎంపీ సురేష్ షెట్కర్‌లతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో సుమారు 18 వేల ఉద్యోగాల భర్తీని చేపట్టామన్నారు. త్వరలో మల్టీపర్పస్ ఏఎన్ఎం, నర్సింగ్ ఆఫీసర్ల ఉద్యోగ ఫలితాలను వెల్లడిస్తామన్నారు. మూడు సంవత్సరాల నుండి ఆరు సంవత్సరాల పిల్లలకి పూర్వ ప్రాథమిక విద్య అందించడంతోపాటు పోషకాహారం, ఆరోగ్యం, ప్రీ స్కూలు, రోగ నిరోధకత, రిఫరల్ సేవలు, ఆరోగ్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న బాలసదనం బాలికలతో మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖాముఖిగా మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాలసదనంలో తక్షణమే ఆర్ఓ ప్లాంట్ ని ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. అనంతరం వికలాంగులకు స్కూటీలను పంపిణీ చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా, శిశు , వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ వారోత్సవాలలో జిల్లాలో చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్స్ శుభ్రత, 18 సంవత్సరాల పైబడిన సిసిఐ పిల్లలను గుర్తించడం, ఆరోగ్య శిబిరాలు నిర్వహించుట, అత్యవసర సర్టిఫికెట్లు ఆరోగ్య కార్డుల కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం, సంస్థల నుండి పిల్లలను బయటికి డిశ్చార్జ్ చేసి తిరిగి వారికి పునరావాస కల్పించుట మరియు ఫాలోఅప్ ప్రక్రియ, రెసిడెన్షియల్ స్కూల్స్‌లో చేర్పు ప్రక్రియ లాంటివి జరిగిందని అధికారులు మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు డా.సంజీవరెడ్డి, ఎంపీ సురేష్ షెట్కర్, మున్సిపల్ చైర్మన్ నగేష్ షెట్కర్, సబ్ కలెక్టర్ ఉమా హారతి, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, మున్సిపల్ కమిషనర్ ప్రశాంత్, సీడీపీఓ సుజాత, ఆశ్రమ నిర్వాహకురాలు విజయ కుమారి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# హస్తం గెలిచిన అభ్యర్థుల్లో ముస్లింలే ఎక్కువ

**న్యూఢిల్లీ, మే 6:** నాలుగు రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ తరఫున గెలుపొందిన అభ్యర్థులను పరిశీలిస్తే, వారిలో అత్యధిక శాతం ముస్లింలే ఉన్నారు.

అసోం, కేరళ, పశ్చిమ బెంగాల్, తమిళ నాడు రాష్ట్రాల్లో ఈ ధోరణి స్పష్టంగా కనిపించింది. అసోం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 19 అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకోగా, వీరిలో 18 మంది ముస్లిం అభ్యర్థులే విజయం సాధించారు. ఆ పార్టీ మొత్తం 20 మంది ముస్లింలకు టికెట్లు ఇవ్వడం విశేషం.

# బీహార్ కేబినెట్ విస్తరణ నేడే

## నితీశ్ కుమారుడు నిశాంత్‌కు చోటు



**పాట్నా, మే 6:** ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి గురువారం మంత్రివర్గ విస్తరణకు శ్రీకారం చుట్టబోతున్నారు. ఇందుకు సంబంధించిన కసరత్తు అంతా పూర్తయ్యాయి. ఈ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో బీహార్ ఒక కీలక రాజకీయ పరిణామానికి సాక్ష్యం కానుంది. మాజీ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ తనయుడు నిశాంత్ కుమార్‌ను మంత్రివర్గంలోకి తీసుకుంటున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు ముందు, పాట్నాలో రాజకీయ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. మాజీ సిఎం, జెడియు అధినేత నితీష్ కుమార్ నేతృత్వంలో బిజెపి – జెడియు నేతలు సుదీర్ఘ మంతనాలు జరిపారు. కేబినెట్‌లో నిశాంత్ కుమార్ చేరడానికి తొలుత నిరాకరించినా, జెడియు అగ్రనేతల అభిప్రాయాలతో ఏకీభవించి అంగీకరించినట్లు తెలుస్తోంది. సీనియర్ జెడియు నాయకులు సంజయ్ ఝా, ఉప ముఖ్యమంత్రి విజయ్ చౌదరి ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి నివాసంలో సమావేశమయ్యారు. మంత్రుల పేర్లను ఖరారు చేయడంపైనే ప్రధానంగా చర్చలు జరిపినట్లు సమాచారం. మంత్రుల ప్రమాణస్వీకారానికి సంబంధించిన గాంధీ మైదాన్‌లో ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఇంకా అధికారిక ప్రకటన ఏదీ వెలువడనప్పటికీ, గురువారం 27 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. బిజెపి నుంచి 12 మంది, జెడియు నుంచి 11 మంది, ఎల్‌జెపి(రామ్ విలాస్) నుంచి ఇద్దరు, అలాగే హెచ్ఎఎం, ఆర్ఎల్ఎస్‌పి నుండి ఒక్కొక్కరు ఉండే అవకాశం ఉంది. భవిష్యత్తు రాజకీయ సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని, ఆరు మంత్రి పదవులను ఖాళీగా ఉంచవచ్చని కూడా వార్తలు వినిపిస్తున్నాయి. అసెంబ్లీ బలాన్ని బట్టి, ముఖ్యమంత్రితో కలిపి బీహార్‌లో గరిష్టంగా 36 మంది మంత్రులు ఉండవచ్చు. బీహార్ రాష్ట్ర మంత్రుల ప్రమాణస్వీకారోత్సవానికి కేంద్రం దూతగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరుకానున్నారు.

# టివికెకు కాంగ్రెస్ మద్దతు

## రెండు మంత్రి పదవులు డిమాండ్

**చెన్నై, మే 6:** తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య విజయం సాధించి, డిఎంకె, అన్నాడీఎంకేల ఆధిపత్యానికి గండికొట్టిన నటుడు విజయ్ పార్టీ తమిళగ వెట్రి కళగం(టీవీకే)కు మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఈ నిర్ణయంతో విజయ్ ముఖ్యమంత్రిగా ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. కాంగ్రెస్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశం తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. టీవీకేకు మద్దతు ఇచ్చే అధికారాన్ని తమిళనాడు కాంగ్రెస్ కమిటీకి (టీఎన్‌సీసీ) అప్పగించినట్లు కాంగ్రెస్ ఎంపీ శశికాంత్ సెంథిల్ తెలిపారు. విజయ్ ప్రభుత్వంలో రెండు మంత్రి పదవులు ఆశిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఎన్డీయే లేదా దాని మిత్రపక్షాలతో కలవకూడదనే షరతును కాంగ్రెస్ పెట్టింది. 234 స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీలో టీవీకే 108 సీట్లు గెలుచుకుంది. మెజారిటీకి కేవలం 10 సీట్ల దూరంలో నిలిచింది. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి ఉన్న 5 సీట్లతో వారి బలం 113కు చేరింది. త్వరలోనే గవర్నర్‌ను కలిసి మద్దతు లేఖను సమర్పించనున్నారు. దీంతో విజయ్ రేపటికల్లా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశాలున్నాయి. కాంగ్రెస్ తాజా నిర్ణయంతో దశాబ్దాలుగా కొనసాగుతున్న డీఎంకేకాంగ్రెస్ కూటమి విచ్ఛిన్నమైంది. ఈ పరిణామంపై డీఎంకే తీవ్రంగా స్పందించింది. ఇది 'వెన్నుపోటు అని డీఎంకే అధికార ప్రతినిధి ఎ. శరవణన్ ఆరోపించారు. తమ మద్దతు లేకుండా కాంగ్రెస్ ఆ ఐదు సీట్లు కూడా గెలిచేది కాదని ఆయన విమర్శించారు.

# హార్ముజ్‌లో ప్రాజెక్టు ఫ్రీడమ్ తాత్కాలిక నిలిపివేత

## అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడి

**వాషింగ్టన్, మే 6:** ఇరాన్‌తో చర్చల్లో పురోగతి సాధించామని, పాకిస్థాన్ వంటి దేశాల అభ్యర్థన మేరకు ప్రాజెక్టుఫ్రీడమ్‌ను నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. హార్మూజ్ జలసంధిలో తమ దళాల నేతృత్వంలో చేపట్టిన ప్రాజెక్ట్ ఫ్రీడమ్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఆయన బుధవారం ప్రకటించారు. అయితే, ఇరాన్‌పై విధించిన దిగ్బంధనం మాత్రం పూర్తిస్థాయిలో కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ మేరకు ట్రంప్ సోషల్ మీడియాలో ఒక పోస్టుపెట్టారు. ఇరాన్‌తో తుది ఒప్పందం దిశగా గణనీయమైన పురోగతి సాధించాం. పాకిస్థాన్, ఇతర దేశాల అభ్యర్థన మేరకు ప్రాజెక్ట్ ఫ్రీడమ్ కింద నౌకల కదలికలను కొంతకాలం నిలిపివేయాలని నిర్ణయించాం. ఒప్పందం ఖరారవుతుందో లేదో చూసేందుకే ఈ విరామం అని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు వైట్‌హౌస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడిన ట్రంప్, ఇటీవలి సైనిక చర్యల్లో ఇరాన్ నావికా, వైమానిక దళాలు పూర్తిగా దెబ్బతిన్నాయని వ్యాఖ్యానించారు. వారి సైనిక శక్తిని సర్వనాశనం చేశామని, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతోందని, అందుకే ఇరాన్ ఒప్పందం కోసం ముందుకు వస్తోందని ఆయన అన్నారు. ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన హార్మూజ్ జలసంధి తమ నియంత్రణలోనే ఉందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ కూడా స్పష్టం చేశారు. ఇరాన్‌తో చర్చల ఫలితం వెలువడేంత వరకు ఈ తాత్కాలిక విరామం కొనసాగనుంది.

# సర్‌లో ఓటు తొలగించినా ఎమ్మెల్యేగా గెలుపు

## కోర్టుకెళ్లి ఓటుహక్కు తెచ్చుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే

**ఫరక్కా, మే 6:** ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితా నుంచి ఆయన పేరును తొలగించారు. కానీ ఆయన ఎమ్మెల్యేగా పోటీచేసి విజయం సాధించారు. అసలు ఓటు హక్కే లేని వ్యక్తి ఎమ్మెల్యేగా ఎలా పోటీచేశాడని అందరికీ ఆశ్చర్యం కలిగింది. ఎన్నికల ముందు పశ్చిమబెంగాల్ లోనూ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జరిగింది. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా మొతాబ్ షేక్ అనే వ్యక్తి పేరును తొలగించారు. కానీ చివరికి ఆయన ఎమ్మెల్యేగా పోటీచేసి నెగ్గారు. ఈ ఆసక్తికరమైన ఘటన ఫరక్కా నియోజకవర్గంలో చోటుచేసుకుంది. ఓటర్ల జాబితా నుంచి అధికారులు తన పేరును తొలగించడాన్ని సవాల్ చేస్తూ మొతాబ్ షేక్ సుప్రీంకోర్టు నియమించిన ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. ఎమ్మెల్యే నామినేషన్ల గడువు ముగియడానికి కొన్ని గంటల ముందు మొతాబ్ ఓటు హక్కును పునరుద్ధరిస్తూ ట్రైబ్యునల్ తీర్పు ఇచ్చింది. దాంతో ఆయన ఫరక్కా నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఎన్నికల సంఘం విడుదలచేసిన ఫలితాల్లో ఆయన విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి సునీల్ చౌధరిపై ఆయన 8 వేలకుపైగా ఓట్ల తేడాతో గెలిచారు.

# స్టాలిన్‌ను కలిసిన రజనీకాంత్

## క్లిష్టసమయంలో పూర్తి అండగా ఉంటానని హామీ



**చెన్నై, మే 6:** తమిళనాడు రాజకీయాల్లో వేగంగా మారుతున్న పరిణామాల మధ్య నేడు సూపర్ స్టార్ రజనీకాంత్ మాజీ ముఖ్యమంత్రి ఎంకె. స్టాలిన్‌తో భేటీ అయినట్లు తెలుస్తుంది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో తాను స్టాలిన్ వెంటే ఉంటానని, ఆయనకు పూర్తి స్థాయిలో అండగా నిలుస్తానని రజనీకాంత్ హామీ ఇచ్చినట్లు తెలుస్తుంది. కేవలం వ్యక్తిగత పలకరింపు కాకుండా, ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో స్టాలిన్‌కు ధైర్యం చెప్పడమే లక్ష్యంగా ఈ భేటీ జరిగినట్లు సమాచారం. మరోవైపు కాంగ్రెస్, ఇతర లెఫ్ట్ పార్టీలతో కలిసి టీవీకే అధినేత విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు తెలుస్తుంది. గురువారం విజయ్ ప్రమాణస్వీకారం ఉండబోతున్నట్లు సమాచారం.



బుధవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన వియత్నాం అధ్యక్షుడు టో లాం

# 'యాక్ట్ ఈస్ట్'లో వియత్నాం కీలకం

## వాణిజ్య, రక్షణ, కీలక రంగాల్లో బంధం బలోపేతం

## ద్వైపాక్షిక వాణిజ్యం టార్గెట్ 25 బిలియన్ డాలర్లు

### ఇరు దేశాల మధ్య కుదిరిన 13 ఒప్పందాలు

**న్యూఢిల్లీ, మే 6:** పెరుగుతున్న భౌగోళిక రాజకీయ అస్థిరతల నేపథ్యంలో, వాణిజ్యం, రక్షణ, కీలక ఖనిజాల రంగాలలో ద్వైపాక్షిక సంబంధాలను విస్తరించడంపై భారత్, వియత్నాం దృష్టి సారించాయి. ద్వైపాక్షిక సంబంధాలను సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి చేర్చాలని భారత్, వియత్నాం నిర్ణయించాయి. ఆర్థిక, రక్షణ సహకారాన్ని మరింత విస్తరించాలని నిశ్చయించాయి. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం సంయుక్తంగా చర్యలు చేపట్టాలన్న అవగాహనకు వచ్చాయి. ఇరుపక్షాలు 13 ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందాలు డిజిటల్ చెల్లింపులు, అరుదైన ఖనిజాలు, ఫార్మాస్యూటికల్స్, విద్య, బ్యాంకింగ్, సంస్కృతితో సహా పలు రంగాలలో లోతైన ద్వైపాక్షిక సంబంధాలకు అవకాశం కల్పిస్తాయి. భారత పర్యటనకు వచ్చిన వియత్నాం అధ్యక్షుడు టో లాం బుధవారం ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో భేటీ అయ్యారు. తమ సంబంధాలను ఒక ఉన్నత సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి తీసుకువెళ్లేలా చర్చలు జరిపారు. ఇందులో భాగంగా 2030 నాటికి 25 బిలియన్ డాలర్ల వార్షిక వాణిజ్య లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాయి. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, వియత్నాం అధ్యక్షుడు టో లామ్‌ల మధ్య ద్వైపాక్షిక చర్చల అనంతరం, డిజిటల్ చెల్లింపులు, అరుదైన ఖనిజాలు, ఔషధాలు, విద్య, బ్యాంకింగ్, సంస్కృతి వంటి పలు రంగాలలో ఇరుపక్షాల మధ్య మరింత లోతైన సహకారానికి వీలు కల్పించే 13 ఒప్పందాలపై ఇరుపక్షాలు సంతకాలు చేశాయి. ఈ ప్రాంతంలో చైనా ఆధిపత్య పోరు పెరుగుతున్న నేపథ్యంలో ఇండో-పసిఫిక్‌లోని పరిస్థితిపై మోడీ, లామ్ చర్చించారు. చట్టబద్ధమైన పాలన, శాంతి, స్థిరత్వం, శ్రేయస్సుకు తమ వంతు సహకారాన్ని కొనసాగించడానికి వారు అంగీకరించారు. దక్షిణ చైనా సముద్రంలో చైనా తన సైనికబలాన్ని పెంచుకుంటున్న విషయం కూడా ఇరుపక్షాల మధ్య జరిగిన ప్రతినిధి బృందం స్థాయి చర్చల్లో ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. అనంతరం ఏర్పాటు చేసిన సంయుక్త సమావేశంలో మోడీ ప్రసంగించారు.

భారత్ అనుసరిస్తున్న 'యాక్ట్ ఈస్ట్' విధానంలో వియత్నాం కీలక దేశమని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. వియత్నాం సహకారంతో ఆసియాన్ దేశాలతో భారత్ సంబంధాలను మరింత విస్తరిస్తామని చెప్పారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, శ్రేయస్సు కోసం వియత్నాంతో కలిసి భారత్ పని చేస్తుందని తెలిపారు. పహల్గాం ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండించి, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశం చేస్తున్న పోరాటంలో అండగా నిలిచినందుకు వియత్నాంకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక అనుసంధానతను పెంపొందించేందుకు రెండు దేశాల కేంద్ర బ్యాంకుల మధ్య సహకారాన్ని బలోపేతం చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు మోడీ వెల్లడించారు. ఇందులో భాగంగా యుపిఐ వ్యవస్థను వియత్నాం ఫాస్ట్ పేమెంట్ సిస్టమ్‌తో త్వరలో అనుసంధానం చేయనున్నట్లు ప్రధాని వివరించారు. గత దశాబ్దంలో భారత్-వియత్నాం మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం రెట్టింపు అయి 16 బిలియన్ డాలర్లకు చేరుకుందని, 2030 నాటికి దానిని 25 బిలియన్ డాలర్లకు పెంచడమే ప్రస్తుత లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. రాబోయే కాలంలో ఇరు దేశాల మధ్య ఆర్థిక సంబంధాలు గణనీయంగా వృద్ధిచెందుతాయని మోడీ ఆశాభావం వ్యక్తంచేశారు. ఇరు దేశాల మధ్య భద్రత సహకారాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు వియత్నాం అధ్యక్షుడు టో లాం తెలిపారు.

# యుఎస్ నౌకాదళం కట్టడికోసం రంగంలోకి ఇరాన్ కామికేజ్ డాల్ఫిన్లు

**టెహ్రాన్, మే 6:** హార్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకల రాకపోకలకు ఇరాన్ మైన్లతో అంతరాయం కలిగించవచ్చన్న ఆందోళనల మధ్య, అమెరికా నౌకాదళాన్ని ఎదుర్కొనేందుకు టెహ్రాన్ కామికేజ్ డాల్ఫిన్లను రంగంలోకి దించనుందంటూ వస్తున్న వార్తలపై తీవ్ర చర్చ జరుగుతోంది. ఈ ఊహాగానాలపై అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ స్పందించారు. ఇరాన్ వద్ద అటువంటి డాల్ఫిన్ సైన్యం లేదని ఆయన స్పష్టం చేశారు. అయితే, అమెరికా వద్ద ఉన్నాయా అనే ప్రశ్నకు మాత్రం సమాధానం దాటవేశారు. మా వద్ద కామికేజ్ డాల్ఫిన్లు ఉన్నాయో లేదో నేను ధ్రువీకరించలేను. అలా అని ఖండించలేను. కానీ, ఇరాన్ వద్ద మాత్రం అవి లేవని కచ్చితంగా చెప్పగలనని మీడియా సమావేశంలో అన్నారు. అమెరికా యుద్ధ నౌకలపై దాడి చేసేందుకు ఇరాన్ మైన్లు మోసుకెళ్లే డాల్ఫిన్లను ఉపయోగించవచ్చని ఒక వార్తాకథనం వచ్చింది. మరోవైపు అమెరికా నౌకాదళం దశాబ్దాలుగా డాల్ఫిన్లను సైనిక అవసరాలకు వినియోగిస్తోంది. యూఎస్ నేవీకి చెందిన "మెరైన్ మమ్మల్ ప్రోగ్రామ్" కింద బాటిల్‌నోస్ డాల్ఫిన్లు, కాలిఫోర్నియా సీ లయన్‌లకు శిక్షణ ఇస్తున్నారు. ఇవి ఇరాన్ వాడొచ్చని ప్రచారంలో ఉన్న "కామికేజ్ డాల్ఫిన్ల" వంటివి కావు. అమెరికా డాల్ఫిన్లు కేవలం సముద్ర గర్భంలో మైన్లను గుర్తించి, వాటి లొకేషన్‌ను మార్క్ చేస్తాయేకానీ ఆత్మాహుతి దాడులు చేసి ప్రాణాలు త్యాగం చేయవు. డాల్ఫిన్ల సోనార్ వ్యవస్థ ముందు సైన్స్‌కు తెలిసిన ఏ టెక్నాలజీ సరిపోదు. నీటి అడుగున పనిచేసే డ్రోన్‌లు కూడా వీటికి సాటిరావని ఈ ప్రోగ్రామ్ వెబ్‌సైట్ పేర్కొంది.

గతంలో రష్యా తమ నౌకాశ్రయాల భద్రతకు డాల్ఫిన్లను వాడింది. 2000 సంవత్సరంలో ఇరాన్ కూడా కొన్ని డాల్ఫిన్లను కొను గోలు చేసింది. అవి ఇప్పుడు వయసు పైబడటం వల్ల ఉపయోగంలో ఉండే అవకాశం లేదని, ప్రస్తుతం టెహ్రాన్ వద్ద క్రియాశీల డాల్ఫిన్ ప్రోగ్రామ్ ఉన్నట్లు ఎలాంటి ఆధారాలు లేవని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతానికి హార్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలను తగ్గించే ప్రయత్నాల్లో అమెరికా డాల్ఫిన్లను ఉపయోగించడంలేదని అమెరికా మీడియా పేర్కొంది.

# ఐప్యాక్‌కు కటీఫ్ చెప్పిన సమాజ్‌వాది చీఫ్ అఖిలేష్



**లక్నో, మే 6:** తమిళనాడులో డీఎంకే కూటమి, పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీలకు ఐప్యాక్ పనిచేసినప్పటికీ ఓటమి పాలయ్యాయి. డిఎంకె స్టాలిన్ ఐప్యాక్‌ప్రతినిదులతో చర్చలుజరిపారు. అలాగే ఐప్యాక్ బెంగాల్ ఎన్నికల్లో టిఎంసికి పనిచేయలేదని చెప్పినప్పటికీ తెరవెనుక వ్యూహాలునడిచాయని ప్రచారం. అయితే ఓటమి తర్వాత రెండు రోజులకే ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ కీలక నిర్ణయం ప్రకటించారు. ఐప్యాక్‌తో సంబంధాలు తెంచుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇందుకు నిధుల కొరత కారణమని ఆయన తెలిపారు. వచ్చే సంవత్సరం ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఐప్యాక్‌తో గత సంవత్సరం ఒప్పందం కుదుర్చుకున్నామని అఖిలేశ్ యాదవ్ తెలిపారు. ఐప్యాక్ టీమ్ తమతో కొన్ని నెలలు పని చేసిందని, కానీ నిధుల కొరత కారణంగా దానిని కొనసాగించలేకపోతున్నామని వెల్లడించారు. బెంగాల్‌లో టీఎంసీ, తమిళనాడులో డీఎంకే ఓటమి నేపథ్యంలో ఈ ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. ఐప్యాక్ ఒప్పందాన్ని ఎందుకు రద్దు చేశారని ఓ మీడియా ప్రతినిధి ప్రశ్నించారు. మా వద్ద నిధులు లేవు. మీరు మాకు నిధులు ఇస్తే మరో కంపెనీని ఎన్నికల కోసం నియమించుకుంటాయని అఖిలేష్ సరదాగా అన్నారు. కానీ, ఐప్యాక్ పని చేసిన రెండు పార్టీలు ఓడిపోయిన అనంతరం అఖిలేష్ యాదవ్ నుంచి ఈ ప్రకటన రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. పశ్చిమ బెంగాల్ ఎన్నికల తీరును అఖిలేష్ యాదవ్ ప్రశ్నించారు. దీనిని సుప్రీంకోర్టు వెంటనే సుమోటోగా స్వీకరించాలని కోరారు. ఓట్ల లెక్కింపు వీడియో రికార్డింగును ప్రజలకు అందుబాటులో ఉంచాలని అన్నారు. బెంగాల్‌లో చోటు చేసుకున్న పరిణామాలు వచ్చే సంవత్సరం ఎన్నికలు జరగనున్న ఉత్తరప్రదేశ్‌లో పునరావృతమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

# రాహుల్ గాంధీ పిఏగా పలువురికి టోపీ!

## కోట్లు వసూలుచేసిన పంజాబ్ వ్యక్తి కటకటాల్లోకి

**డెహ్రాడూన్, మే 6:** కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ వ్యక్తిగత కార్యదర్శి పేరుతో ఒక వ్యక్తి పలువురు రాజకీయ నేతలను మోసగించాడు. పార్టీ పదవులు, టికెట్ల పేరుతో కోట్లలో డబ్బులు వసూలు చేశాడు. ఒకరి ఫిర్యాదుతో దర్యాప్తు చేసిన పోలీసులు చివరకు ఆ వ్యక్తిని అరెస్ట్ చేశారు. పంజాబ్‌లోని అమృత్‌సర్‌కు చెందిన గౌరవ్ కుమార్‌ను నిందితుడిగా గుర్తించారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ వ్యక్తిగత కార్యదర్శి కనిష్ సింగ్ పేరుతో ట్రూకాలర్‌లో నకిలీ ప్రొఫైల్‌ను అతడు క్రియేట్ చేశాడు. రాజకీయ వెబ్‌సైట్‌లు, ఆన్‌లైన్ ద్వారా రాజకీయ నేతల సమాచారం సేకరించాడు. కాంగ్రెస్ పార్టీలో పదవులు, పార్టీ టికెట్లు ఆశించే వారిని లక్ష్యంగా చేసుకున్నాడు. ఉత్తరాఖండ్‌కు చెందిన కాంగ్రెస్ నాయకురాలు భావనా పాండేను, కనిష్ సింగ్ పేరుతో గౌరవ్ కుమార్ సంప్రదించాడు. పార్టీలో ఉన్నత పదవి ఇప్పిస్తానని నమ్మించాడు. ఖాన్ ప్రాంతంలోని ఆమె నివాసానికి తన అనుచరుడిని పంపాడు. భావనా పాండే నుంచి రూ.25 లక్షలు వసూలు చేశాడు. ఆ తర్వాత మొబైల్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేయడంతో అనుమానించిన ఆమె తాను మోసపోయినట్లు గ్రహించి డెహ్రాడూన్‌లోని రాజ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

మరోవైపు సీసీటీవీ ఫుటేజ్‌లతోపాటు నిందితుడు గౌరవ్ కుమార్ కదలికలు, అతడి మొబైల్ ఫోన్‌పై పోలీసులు నిఘా పెట్టారు. అతడి అరెస్ట్ కోసం 'ఆపరేషన్ ప్రహార్ చేపట్టారు. ఎన్నికల్లో టికెట్ పేరుతో మరో కాంగ్రెస్ నేతను మోసగించి డబ్బు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్న గౌరవ్ కుమార్‌ను డెహ్రాడూన్‌లోని ఒక మాల్‌లో పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే గౌరవ్ కుమార్‌ను పోలీసులు ప్రశ్నించగా షాకింగ్ విషయాలు తెలిశాయి. కాంగ్రెస్‌లో పార్టీ పదవులు, టికెట్లు ఆశించే వారిని లక్ష్యంగా చేసుకుని పెద్ద అంతర్రాష్ట్ర రాకెట్‌ను అతడు నిర్వహిస్తున్నట్లు బయటపడింది.

# పంజాబ్‌లో రెండుచోట్ల పేలుళ్లు

**అమృత్‌సర్, మే 6:** పంజాబ్‌లో రాత్రివేళల్లో రెండుచోట్ల జరిగిన పేలుళ్ల ఘటనలు భయభ్రాంతులకు గురిచేసాయి. జలంధర్‌లో తొలుత బీఎస్ఎఫ్ ప్రధానకార్యాలయం వద్ద బ్లాస్ట్ జరిగింది. ఆ తర్వాత అర్ధరాత్రి అమృత్‌సర్‌లో మరో పేలుడు ఘటన నమోదు అయ్యింది. ఖాసా రోడ్డులో ఉన్న ఆర్మీ కంటోన్మెంట్ ఏరియా సరిహద్దు గోడ వద్ద పేలుడు జరిగింది. గోడపై పెట్టిన ఓ షీట్ కిందపడిపోయింది.దేని వల్ల ఆ బ్లాస్ట్ జరిగిందో ఇంకా తెలియరాలేదు. కంటోన్మెంట్ ప్రాంతంలో స్వల్ప స్థాయి తీవ్రతతో పేలుడు జరిగిందని అమృత్‌సర్ రూరల్ ఎస్పీ సోహెల్ ఖాసిమ్ మీర్ తెలిపారు. రాత్రి 11.15 నిమిషాల సమయంలో భారీ శబ్దం వచ్చినట్లు తమకు సమాచారం వచ్చిందని, దీంతో హుటాహుటిన ఆ ప్రదేశానికి పోలీసు బృందాలు వెళ్లినట్లు ఆయన తెలిపారు. బౌండరీ వాల్ మీద ఉన్న ఓ షీట్ కిందపడిపోయినట్లు గుర్తించామన్నారు. క్విక్ రెస్పాన్స్ టీమ్స్, ఫోరెన్సిక్ నిపుణులు, బాంబు నిర్వీర్య దళాలు ఆ ప్రాంతానికి చేరుకున్నాయి. ఆర్మీ, బీఎస్ఎఫ్ బలగాలు సంయుక్తంగా సెర్చ్ ఆపరేషన్ మొదలుపెట్టాయి. జలంధర్‌లోని బీఎస్ఎఫ్ హెడ్‌క్వార్టర్స్ దగ్గర తొలి పేలుడు ఘటన జరిగింది. రాత్రి 8 గంటల సమయంలో బీఎస్ఎఫ్ కార్యాలయం సమీపంలో పార్క్ చేసిన స్కూటర్ పేలింది. తొలుత ఆ స్కూటర్‌కు మంటలు అంటుకున్నాయి. ఆ తర్వాత అది పేలింది. సుమారు 300 మీటర్ల దూరం వరకు దాని ప్రభావం కనిపించింది.

# సిఎం పదవికి హిమంత బిశ్వశర్మ రాజీనామా

## మే 11 తర్వాత ప్రమాణస్వీకారం

**గువాహాతి, మే 6:** అసోం రాజకీయాల్లో కొత్త ప్రభుత్వం కొలువుదీరేందుకు అడుగుపడింది. ముఖ్యమంత్రి హిమాంత బిశ్వశర్మ తన సీఎం పదవికి రాజీనామా చేశారు. అసోం అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ఘనవిజయం సాధించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తన కేబినెట్ సహచరులతో కలిసి గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్యను కలిశారు. తన రాజీనామా లేఖను గవర్నర్‌కు అందజేయగా ఆయన దానిని ఆమోదించారు. అయితే నూతన ప్రభుత్వం కొలువుదీరేదాకా తాత్కాలిక ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించాలని గవర్నర్ ఆయనను కోరారు. మొత్తం 126 స్థానాలున్న అసోం అసెంబ్లీలో బిజెపి కూటమి ఏకంగా 102 స్థానాలను కైవసం చేసుకుని రికార్డు సృష్టించింది. రాజీనామా అనంతరం లోక్‌భవన్ వెలుపల మీడియాతో మాట్లాడిన హిమాంత బిశ్వశర్మ, ఈ చారిత్రాత్మక విజయం తర్వాత కొత్త ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమం మే 11 తర్వాత ఉంటుందని వెల్లడించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ప్రధాని మోడీని ఆహ్వానించినట్లు తెలిపారు. కేంద్ర పరిశీలకుల సమక్షంలో త్వరలోనే జరగబోయే బిజెపి శాసనసభపక్ష సమావేశంలో కొత్త ముఖ్యమంత్రిని అధికారికంగా ఎంపిక చేయనున్నారు. అసోంలో వరుసగా మూడోసారి బిజెపి అధికారాన్ని చేపట్టబోతుండటంతో అటు పార్టీ వర్గాల్లో, ఇటు ప్రజల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# టిఎంసి కార్యాలయాన్ని కూల్చివేసిన బిజెపి కేడర్

**కోల్‌కత్తా, మే 6:** పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. రాత్రి వేళల్లో సెంట్రల్ కోల్‌కతాలోని చారిత్రక హాగ్ మార్కెట్ (న్యూ మార్కెట్) సమీపంలో కొందరు వ్యక్తులు బుల్డోజర్‌తో ఓ నిర్మాణాన్ని కూల్చివేశారు. ఈ ఘటనతో వ్యాపారులు తీవ్ర భయాందోళనకు గురై దుకాణాలు మూసివేసి అక్కడి నుంచి పారిపోయారు. కూల్చివేతకు గురైన భవనం తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) యూనియన్ కార్యాలయంగా ప్రాథమికంగా గుర్తించారు. ఈ ఘటనపై టీఎంసీ తీవ్రంగా స్పందించింది. ఇది బీజేపీ మద్దతుదారుల పనేనని, వారి గూండాయిజమని ఆరోపించింది. టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా, సీనియర్ నేత డెరెక్ ఓబ్రెయిన్ సోషల్ మీడియాలో స్పందిస్తూ ఇది బీజేపీ విజయ వేడుకల్లో భాగమని, బెంగాల్‌లో వారి పరివర్తన్ ఇదేనంటూ తీవ్రంగా విమర్శించారు. పోలీసుల అనుమతితోనే ఈకూల్చివేత జరిగిందని ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణలను స్థానిక నివాసితులు, కొందరు వ్యాపారులు తోసిపుచ్చారు. కూల్చివేసిన నిర్మాణం అక్రమమైనదని వారు తెలిపారు. ఓ దుకాణదారుడి నుంచి బలవంతంగా స్థలాన్ని లాక్కుని, అక్కడ యూనియన్ ఆఫీసు కట్టారని వారు చెబుతున్నారు. ఘటన గురించి తెలియగానే పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. న్యూ మార్కెట్ పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేసి, పెట్రోలింగ్‌ను ముమ్మరం చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాల నేపథ్యంలో చోటుచేసుకున్న ఈ ఘటనతో, రాష్ట్రంలో రాజకీయ ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.

# టివికె ఎమ్మెల్యేగా ఐప్యాక్ టీమ్ సభ్యురాలు కీర్తనా సంపత్

**చెన్నై, మే 6:** రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ స్థాపించిన ఐపాక్ బృందంలో పనిచేసిన అనుభవంతో తన నియోజకవర్గంలో తెలుగులో ప్రసంగించి మరీ ఓటర్ల మనసులు గెలుచుకుని ఆయువతి గెలిచింది. డవిరుద్‌నగర్ జిల్లా శివకాశి నియోజకవర్గ నూతన ఎమ్మెల్యే కీర్తనా సంపత్ గెలుపు అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. కీర్తనా సంపత్ ప్రస్థానం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. పాండిచ్చేరి యూనివర్సిటీలో ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్ పూర్తి చేసినఆమె, డేటా అనలిస్ట్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు. తన ప్రతిభతో దేశంలోనే ప్రముఖ రాజకీయ వ్యూహకర్తగా పేరుగాంచిన ప్రశాంత్ కిశోర్ (ఐప్యాక్) బృందంలో చేరారు. 2021 తమిళనాడు ఎన్నికల్లో డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ గెలుపు కోసం కూడా పనిచేశారు. ఆ తర్వాత హైదరాబాద్ కేంద్రంగా టీడీపీ సోషల్ మీడియా విభాగానికి ఆమె నాయకత్వం వహించారు. దేశవ్యాప్తంగా ఎందరోనేతల గెలుపుకోసం వ్యూహాలు రచించిన కీర్తనను తన సొంత ప్రాంతంలోని సమస్యలు తీవ్రంగా ఆలో చింపజేశాయి. తాగునీరు, సరైన రోడ్లు, వైద్య సదుపాయాలు వంటి కనీస మౌలిక వసతులు లేకపోవడం, ఉన్నత చదువులు చదివిన యువత ఉపాధి కోసం పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లడం లేదా స్థానికంగా టాక్సీ డ్రైవర్లుగా మిగిలిపోవడం వంటి అంశాలు ఆమెను రాజకీయాల వైపు నడిపించాయి.



# గ్రాఫిక్ కథనం ట్రాప్‌డు

## లేడీ జర్నలిస్టు: పులిట్జర్ ప్రశస్తి

డిజిటల్ 'ట్రాప్‌'ను కళ్లకు కట్టినట్లు చూపగలిగే ఓ మహిళా జర్నలిస్టు పులిట్జర్ పురస్కార విజేతగా ఎంపికైంది. భారతదేశంలో ప్రధానంగా వృద్ధులను 'డిజిటల్ అరెస్టు' పేరుతో భయభ్రాంతుల్ని చేసి, వింతైన భయంకర అనుభూతుల్ని వారి సమక్షంలో ఆవహింపచేసి డబ్బులు కొల్లకొట్టే ఒక సైబర్ నేరం. ఇలాంటి వాటిలో లక్షలు, కోట్లు సంపద సైబర్ నేరగాళ్లపరం అవుతోంది. ఈ అంశానికి సంబంధించి డిజిటల్ మోసాల తీరు తెన్నులను సంక్షిప్తీకరించి జర్నలిస్టులు సువర్ణ శర్మ, ఆర్‌కె ఆనంద్‌లు కళాత్మక భావనను తెరకెక్కించారు. పులిట్జర్ పురస్కారం అమెరికాలో అత్యుత్తమ జర్నలిజానికిచ్చే ప్రైజ్. అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ జర్నలిజం ఆధ్వర్యంలో ఎంపిక నిర్వహణ ఉంటుంది. అమెరికా మీడియా సంస్థ. బ్లూమ్‌బెర్గ్ కోసం సువర్ణశర్మ, ఆర్.కె. ఆనంద్‌లతోపాటు నటాలీ ఒబికో పియర్సన్‌లతో కలిసి, ఇలస్ట్రేటెడ్ రిపోర్టింగ్ అండ్ కామెంటరీ విభాగంలో 'ట్రాప్డ్' అనే గ్రాఫిక్ రిపోర్టింగ్ ప్రాజెక్టుకు పులిట్జర్ బహుమతి పొందారు. ఇదొక విచిత్ర కథనం లక్నోకు చెందిన రుచిరా టాండన్‌ను సైబర్ నేరగాళ్ల అధికారులుగా నటిస్తూ ఆమెను ఆరు రోజుల పాటు గృహనిర్బంధంలో ఉంచి ఆమె బ్యాంకు నుంచి డబ్బు రాబట్టేశారు. ఇదే ఉదంతంపై రూపొందించిన గ్రాఫిక్ స్టోరీకి అభినందనలు అందాయి. ఈ కథనానికి సూత్రధారి సువర్ణవర్మ. ఈమె ఫ్రీలాన్స్ ఇన్వెస్టిగేటిగ్ జర్నలిస్ట్‌గా భారతీయులకెరుకే. సువర్ణాశర్మది జర్నలిజంలో రెండు దశాబ్దాల ప్రస్థానం. వివిధ ఆంగ్ల పత్రికల్లో పనిచేసిన అనుభవంతో ఇప్పుడు ఇన్వెస్టిగేటింగ్ జర్నలిజంలో రాణిస్తున్నారు. ఇంతకు ముందు వృద్ధుల సంరక్షణలో జరుగుతున్న లోపాలపై, నిర్లక్ష్యంపై ప్రత్యేక కథనాలు అందించి ప్రశంసలనందుకున్నారు. □

## వ్యథ: మందు పెట్టి వశీకరణం సాధ్యమా?

**ప్రశ్న:** మా అమ్మాయికి 17 సంవత్సరాలు. ఏడాది నుంచి రహస్యంగా ఒక అబ్బాయిని ప్రేమిస్తోంది. మా ఇంటిలో దొంగతనంగా అప్పుడప్పుడు మొత్తం రూ. లక్ష రూపాయలు అతనికి ఇచ్చింది. ఆ అబ్బాయికి 25 ఏళ్లు ఉంటాయి. అతనికి కొన్ని వ్యసనాలు ఉన్నాయి. విషయం తెలిసి నిలదీయగా ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది. ఆ అబ్బాయి మా అమ్మాయికి మందు పెట్టి వశం చేసుకున్నాడని అనుమానంతో నాటు వైద్యుని ద్వారా మందు తీయించాము. అయినా మార్పు లేదు. ఈ దశలో ఆమెను ఎలా మార్చాలి?

– ఒక సోదరి, కర్నూలు

**జవాబు:** అమ్మా, మీరు ఎదుర్కొంటున్న పరిస్థితి చాలా సున్నితమైనది. ఇది కేవలం 'ప్రేమ" సమస్య కాదు వయస్సు, భద్రత, భావోద్వేగ స్థితి, ఆర్థిక దోపిడీ వంటి అనేక అంశాలు కలిసి ఉన్న పరిస్థితి."మందు పెట్టి వశం చేసుకోవడం" అనేది చాలా వరకు ఒక అపోహ మాత్రమే. వాస్తవానికి ఇలాంటి సందర్భాల్లో ఉద్వేగాలు, ఆకర్షణ ప్రభావితం చేస్తాయి. నాటు వైద్యులు, మందు తీయించడం" వంటి చర్యలు సమస్యను పరిష్కరించవు. అమ్మాయి వయస్సు 17, అబ్బాయి వయస్సు 25, దొంగతనంగా డబ్బు ఇవ్వడం ఉద్వేగ లోపంగా భావించాలి.. ఆత్మహత్య బెదిరింపును తీవ్రమైన అస్థిరతగా చూడాలి. ఈ దశలో తల్లిదండ్రులు ఆమెను తిట్టడం, కొట్టడం, బలవంతంగా అడ్డుకోవడం చేస్తే పరిస్థితి మరింత విషమించవచ్చు. ప్రేమతో మాట్లాడండి. ఆమె భావాలను తక్కువ చేసి చూడకుండా, నెమ్మదిగా మాట్లాడి మార్చడానికి ప్రయత్నం చేయండి. మేము నీకు శత్రువులు కాదు" అన్న నమ్మకం కలిగించాలి. కఠిన నియంత్రణలు పెట్టకండి ఫోన్ తీసేయడం, బయటికి పంపకపోవడం వంటి చర్యలు తిరుగుబాటుకు దారి తీస్తాయి. ఆర్థిక నియంత్రణ పెట్టకండి. ఒంటరిగా వదిలేయకండి అయితే ఆమెపై సున్నితమైన పర్యవేక్షణ అవసరం. ఆ అబ్బాయితో సంబంధం ఒక్కసారిగా కట్ చేయడం కాకుండా, నెమ్మదిగా దూరం చేసే విధంగా ముందుకు వెళ్లాలి. ఒక అనుభవజ్ఞుడైన సైకాలజిస్ట్ వద్దకు తీసుకెళ్లండి. అతను కౌన్సిలింగ్, ప్రత్యేకంగా కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ ద్వారా ఆమె ఆలోచనలు, ప్రవర్తనలో మార్పు తీసుకుని వస్తారు. ఇది శిక్షతో పరిష్కారమయ్యే సమస్య కాదు. మీ అమ్మాయి ప్రస్తుతం భావోద్వేగ గందరగోళంలో ఉంది. ఈ సమయం లో ఆమెకు మీరు శత్రువులు కాదు, భరోసా ఇచ్చే వ్యక్తులని నమ్మకం కలిగించాలి. ప్రేమతో, ఓర్పుతో, నెమ్మదిగా సరైన దారిలోకి తీసుకురావ డం మాత్రమే స్థిరమైన పరిష్కా రం. అబ్బాయి వ్యసన పరుడు కాబట్టి ఫోటోలు లాంటివి తీసుకుని బ్లాక్ మెయిల్ చేసే అవకాశం ఉంటుంది. అలాంటి స్థితిలో పోలీసుల సహాయం తీసుకోండి.



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

## ధర్మబద్ధ జీవనమే ప్రాధాన్యత !

ఆధునిక జీవనశైలిలో మనం ఒత్తిడులు, సమస్యలు ఎదుర్కొంటున్నప్పుడు రాఘవేంద్ర స్వామి చూపిన మార్గం మనకు శాంతి, స్థిరత్వాన్ని అందిస్తుంది. రాఘవేంద్ర స్వామి చిన్ననాటి నుంచే అసాధారణ మేధస్సు, ఆధ్యాత్మిక ఆసక్తి కలిగి ఉండేవారు. ఆయన అసలు పేరు వెంకటనాథ. వేదాలు, శాస్త్రలు తత్వశాస్త్రంలో ఆయనకు ఉన్న పాండిత్యం అనన్య సామాన్యం. తరువాత ఆయన సన్యాసాన్ని స్వీకరించి, మధ్వాచార్యుల ద్వైత సిద్ధాంతాన్ని ప్రజల్లో విస్తరించారు. ఆయన జీవితం సేవా భావంతో నిండినది. భక్తుల కష్టాలను తొలగించడం, వారికి ధైర్యం ఇవ్వడం ఆయన ధర్మంగా భావించేవారు. ఆయన చేసిన అనేక అద్భుతాలు భక్తులలో విశ్వాసాన్ని మరింత బలపరిచాయి. కానీ ఆయన ఎప్పుడూ అద్భుతాలకంటే భక్తి, నీతి, సత్యం మీదే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. రాఘవేంద్ర స్వామి భారత దేశంలో భక్తి, జ్ఞానం, ధర్మానికి ప్రతీకగా నిలిచిన మహానుభావుల్లో ఒకరు. ఆయన జీవితం భక్తులకు మార్గదర్శకం, కష్టాల్లో ఉన్నవారికి ఆశాకిరణం. "నమ్మిన వారిని నేను ఎప్పటికీ విడిచిపెట్టను" అనే ఆయన సందేశం భక్తుల హృదయాల్లో నిలిచిపోయింది. కర్ణాటకలోని మంత్రాలయం ఆయన బ్రిందావనం ఉన్న పవిత్ర స్థలం, అక్కడికి ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు దర్శనార్థం చేరుకుంటారు.

**రాఘవేంద్ర స్వామి ఉప దేశాలు :**

భక్తి మాత్రమే కాదు, ధర్మబద్ధమైన జీవనం కూడా అవసరం. కష్టాలు వచ్చిన దేవునిపై విశ్వాసం కోల్పోవద్దు. ఇతరులకు సహాయం చేయడం ద్వారా నిజమైన ఆనందం పొందవచ్చు రాఘవేంద్ర స్వామి జీవితం మనకు ఒక స్ఫూర్తి. భక్తి, సేవ, సత్యం అనే మూడు సూత్రాలను పాటిస్తే, మన జీవితం కూడా సార్థకం అవుతుంది. □

**చిట్కా:** • 40 సంవత్సరములవారికి జుట్టు నెరవడం సహజం. 14 నుంచి 40 మధ్యలో నెరిసే జుట్టుకు విటమిన్‌లు, ప్రొటీన్‌లు లోపం కూడా కావచ్చు. ఇన్‌ఫెక్షన్‌వల్ల కూడా జరుగుతుంది.
• తెల్ల వెంట్రుకతీసి వేయదలచినపుడు 4 నుండి 5మి.మీ. మొదల్లో వదిలి మిగతాభాగం తుంచివేయాలి. ఎక్కువభాగం తెల్లవెంట్రుకలైతే వెజ్‌హెర్బల్‌హెయిర్ డై చేయడం తప్పనసరిసరి. □



## సెలవులే నైపుణ్యాలకు నెలవు

**వేసవి సెలవుల్లో పిల్లలంతా అల్లరే అల్లరి. ఆట, పాటలతో ఇల్లంతా సందడిగా చేస్తారు. ఆ వినోదానికి విజ్ఞానాన్నీ జోడించాలంటు న్నారు నిపుణులు.** ఈ సెలవుల్లో వారికి కొన్ని పాఠాలు నేర్పడం.. చిత్రలేఖనం వేయిడం, ఈ రోజుల్లో స్వీయ రక్షణ చాలా ముఖ్యం. ఆడపిల్లలకైతే మరీనూ, ఎప్పుడు, ఎక్కడ ఎలాంటి ఘటనలు ఎదురవు తాయో తెలీక స్కూళ్లకు, కాలేజీలకు వెళ్లిన పిల్లలు ఇంటికి వచ్చేదాకా గుమ్మం బయట కాపలా ఉండాల్సి వస్తోంది. తమని తాము రక్షించుకునే విధంగా పిల్లల్ని ఇప్పటి నుంచే తీర్చిదిద్దాలి. మంచి, చెడులకు వ్యత్యాసాన్ని చెబుతూ శారీరకంగా, మానసికంగా వాళ్లని శక్తిమంతంగా చేసే మార్షల్ ఆర్ట్స్ క్లాసుల్లో చేర్చాలి. పోటీ ప్రపంచంలో తమని తాము నిరూపించుకుని అవకాశాలను అందిపుచ్చుకోవాల్సి వస్తోంది. అందుకే మీ పిల్లలకు మక్కువ ఉన్న రంగాల్లో రాణించే విధంగా అవసరమైన నైపుణ్యాలను అందించేలా ప్రయత్నించండి. సెలవుల్లో కూడా తరగతులు, చదువు అంటే పిల్లలకు బోర్ కొట్టేస్తుంది. ఆటా కాకుండా మీరేం నేర్పించాలనుకున్నా ఒక టాస్క్‌లా ఇచ్చి అది పూర్తిచేసిన వారికి బహుమతులు ఇవ్వండి. వారిలో నేర్చుకోవాలనే తపన పెరుగుతుంది. సమ్మర్ క్యాంపులకు పంపే ఏర్పాట్లు చేయండి. దీనివల్ల కొత్తవారిని కలవడం, మాట్లాడటం, మంచిగా మసలుకోవడం వంటివి నేర్చుకుంటారు తెలియని వాళ్లతో పిల్లల్ని ఎలా పంపుతాం. అని భయపడితే అమ్మమ్మ, నాన్నమ్మల దగ్గరకు పంపండి. □

## చిలగడదుంప క్యాప్సికం కూర



**కావాలసిన పదార్థాలు:**

కావలసిన పదార్థాలు: చిలగడదుంపలు: పావు కిలోక్యాప్సికం: మూడు (మీడియం సైజువి)
నూనె: టేబుల్ స్పూన్, పోపు దినుసులు: స్పూను
ఎండు మిరపకాయలు: రెండు
పసుపు: చిటికెడు, చింతపండు: ఉసిరికాయంత
పరిమాణంబెల్లం: చిన్న ముక్క (ఇష్టాన్ని బట్టి)
కారం: ఒక స్పూను, ఉప్పు: తగినంత

**తయారీ విధానం:** ముందుగా చిగలడదుంపల్ని శుభ్రంగా కడిగి, గుండ్రంగా అరంగుళం ముక్కల చొప్పున తరిగి పక్కకు పెట్టుకోవాలి. క్యాప్సికంను కూడా మరీ చిన్నా పెద్దా కాకుండా మోస్తరు ముక్కలుగా చేసి ఉంచుకోవాలి. చింతపండును చిన్న గిన్నెలోకి తీసుకుని కాసిన్ని వేన్నీళ్లు పోసి నాననివ్వాలి. ఈ లోపు పొయ్యి మీద బాణలి పెట్టి అందులో నూనె వేసి పోపు పెట్టాలి. చివర్లో ఎండు మిరపకాయల్ని తుంచేసి అవి కూడా చిటపటలాడాక ముందుగా చిలగడదుంప ముక్కల్ని వేసుకోవాలి. వాటి మీద కొద్దిగా నీళ్లు చల్లి మూత పెట్టి కాసేపు మగ్గనివ్వాలి. తర్వాత క్యాప్సికం ముక్కల్ని కూడా జోడించాలి. ఇందులో పసుపు, ఉప్పు, చింత పండు రసం, పులుపూ తీపీ కలగలిసిన కూరలు ఇష్టపడే వాళ్లయితే చిన్న బెల్లం ముక్క కూడా వేసి బాగా కలియబెట్టాలి. చివర్లో రుచికి సరిపడేంత కారం కూడా జోడించి రెండు నిమిషాలుంచి స్టవ్ ఆపేయాలి. రొట్టెలతో కలిపి తినేందుకు తియ్యతియ్యగా పుల్లపుల్లగా ఉండే ఈ కూర భలే రుచిగా ఉంటుంది. □

# తెర



## 'సతీ లీలావతి' ఎంటర్టైనింగ్‌గా ఉంది: లావణ్య త్రిపాఠి కొణిదెల

ప్రముఖ నిర్మాణ సంస్థ ఆనంది ఆర్ట్స్ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ నిర్మాణంలో లావణ్య త్రిపాఠి కొణిదెల, దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో రానున్న చిత్రం "సతీ లీలావతి. భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్(శివ మనసులో శృతి) ఫేమ్ తాతినేని సత్య ఈ మూవీకి దర్శకత్వం హీరోయిన్ లావణ్య త్రిపాఠి మీడియాతో ముచ్చటించారు. ఆమె చెప్పిన సంగతులివే.. 'సతీ లీలావతి 'మూవీని ఆల్రెడీ చూశాను. చాలా బాగుంది. నాకు ఎంతో నమ్మకం ఉంది. ఇక ఆడియెన్స్ ఎలాంటి రిజల్ట్ ఇస్తారో చూడాలి. ఈ మూవీ షూటింగ్ టైంలోనే నేను ప్రెగ్నెంట్ అని తెలిసింది. కానీ టీం ఇచ్చిన సపోర్ట్‌తో షూటింగ్ సాఫీగా చేశాను. ప్రతీ రోజూ షూటింగ్ అయిన తరువాత హాస్పిటల్‌కి వెళ్లి చెకప్ చేసు కుంటూ ఉండేదాన్ని. చిత్రీకరణలో చిన్న చిన్న గాయాలు అవ్వడం అనేది కామన్ కదా. అయితే ఈ కథ విన్నప్పుడు వరుణ్‌కి చెప్పాను. అప్పుడు నాకు ప్రెగ్నెంట్ అని తెలీదు, ఎలాంటి సింప్టమ్స్ కూడా లేవు. షూటింగ్ కూడా అంత ఈజీ కాదని అర్థమైంది. ఈ మూవీ కోసం వెయిట్ కూడా తగ్గాను. కానీ నాకు ఈ శక్తి ఎక్కడి నుంచి వచ్చిందో తెలీదు. ఇకపై ప్రెగ్నెంట్ అని తెలిస్తే మాత్రం షూటింగ్‌లకు బ్రేక్ ఇస్తాను. నేను ఈ చిత్రంలో డైరెక్టర్ పాత్రలో కనిపిస్తాను. ఇందులో ఎంటర్టైన్మెంట్ అద్భుతంగా ఉంటుంది. కామెడీని అందరూ ఎంజాయ్ చేస్తారు. నేను, నా మేనేజర్ సినిమా చూస్తూ ఫుల్లుగా నవ్వుకున్నాం. కొన్ని చోట్ల ఎమోషనల్‌గా ఉంటుంది. మంచి మెసెజ్ ఉన్నా కూడా ఏదో బోధిస్తున్నట్టుగా, క్లాస్ పీకుతున్నట్టుగా అనిపించదు. సతీ లీలావతి'లో చూపించినట్టుగా రిలేషన్స్ బయటి ప్రపంచంలో ఉండవు.

## బ్యూటీ విత్ బ్రెయిన్స్' అనిపించుకోవడమే నా లక్ష్యం: జో శర్మ



ఇండియన్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారిన మూవీ 'ఎం4ఎం' (మోటివ్ ఫర్ మర్డర్)". అమెరికన్ నటి జో శర్మ ప్రధాన పాత్రలో, దర్శకుడు మోహన్ వడ్లపట్ల తెరకెక్కించిన సస్పెన్స్ థ్రిల్లర్ ఎం4ఎం చిత్రం మే 8న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.

**మీ అప్‌కమింగ్ మూవీ గురించి చెప్పండి**

నా పేరు జోశర్మ. నేనుశాన్ ఫ్రాన్సిస్కో (అమెరికా) నుంచి వచ్చాను. బాలీవుడ్ తరహాలో వస్తున్న నా డెబ్యూ మూవీ 'ఎం4ఎం' (మోటివ్ ఫర్ మర్డర్)". ఈ సినిమా తెలుగు, హిందీ, కన్నడ, మలయాళం, తమిళ భాషల్లో విడుదల వుతోంది. మోహన్ వడ్లపట్లగ ఈ సినిమాకి దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో నా పాత్ర పేరు 'రాధ', నేను ఒక క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్‌గా కనిపిస్తాను.

**అమెరికా నుంచి వచ్చి ఇక్కడ సినిమా చేయడానికి మీకు ఉన్న అనుభవం ఏంటి?**

జో శర్మ: నేను అమెరికాలో థియేటర్ ఆర్టిస్ట్‌ని, నాకంటూ ఒక థియేటర్ ప్రొడక్షన్ కంపెనీ కూడా ఉంది. మోహన్ గారి దగ్గర మూడేళ్ల శిక్షణ తీసుకున్నాను. ఈ సినిమాకి మోహన్ గారు, రాహుల్ అడవల గారితో కలిసి నేను కో రైటర్‌గా కూడా పనిచేశాను.

**రిలీజ్‌కు ముందే ఈ సినిమాకి చాలా అవార్డులు వచ్చినట్లున్నాయి, ఆ విశేషాలు?**

జో శర్మ: అవును, సినిమా ఇంకా రిలీజ్ కాకముందే మాకు 15 ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డులు వచ్చాయి. లాస్ ఏంజెల్స్ ఫిలిం ఫెస్టివల్ నుంచి బెస్ట్ ఫిలిం, లండన్ ఫిలిం ఫెస్టివల్ నుంచి బెస్ట్ డైరెక్టర్, న్యూయార్క్ ఫిలిం ఫెస్టివల్ నుంచి బెస్ట్ యాక్ట్రెస్, హాలీవుడ్, శాంటా మోనికా తదితర ఫిలిం ఫెస్టివల్స్‌లో ఉత్తమనటిగా నాకు, ఉత్తమ దర్శకుడిగా మోహన్‌కి అవార్డులు వచ్చాయి.

**ఈ సినిమా కథలో ఉన్న ప్రధానమైన సస్పెన్స్ లేదా కొత్తదనం ఏమిటి?**

జో శర్మ: ఇది ఒక మర్డర్ మిస్టరీ థ్రిల్లర్. ఇందులో ఒక సీరియల్ కిల్లర్ ఉంటాడు. అతను హత్యలు చేసిన తర్వాత, ఆ మృతదేహా లను రాజా రవివర్మ, పికాసో లాంటి గొప్ప పెయింటర్ల పెయింటింగ్స్ (కళాఖండాల) తరహాలో డెకరేట్ చేస్తాడు.

**ఈ చిత్ర నిర్మాణం గురించి?**

జో శర్మ: ఈ చిత్రాన్ని మోహన్ మీడియా క్రియేషన్స్ మెక్ క్వీన్ గ్రూప్ అమెరికా వారు సంయుక్తంగా నిర్మించారు. ఒక లక్ష డాలర్ల బడ్జెట్ స్థాయికి చేరుకుని, ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించాం.

**మీ నేపథ్యం ఏంటి? మీకు తెలుగు ఎలా వస్తుంది?**

జో శర్మ: నేను పుట్టింది హైదరాబాద్‌లోనే. కానీ పెరిగింది నాగ్‌పూర్, ముంబైలో. అందుకే నాకు తెలుగుతో పాటు మరాఠీ, హిందీ బాగా వస్తాయి. మా అమ్మానాన్నలది విజయవాడ, గుంటూరు ప్రాంతాలు.

**ప్రశ్న: మీ టైటిల్ కి అర్థం ఏమిటి? ప్రేక్షకులకి ఏం చెప్పాలనుకుంటున్నారు?**


జో శర్మ: లీ4లీ అంటే "మోటివ్ ఫర్ మర్డర్" ఈ హత్యల వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటి అనేది అసలు పాయింట్. ఈ టైటిల్‌కే అందరూ కనెక్ట్ అవుతున్నారు.



## నితిన్ కొత్త సినిమా పూజా కార్యక్రమం

ప్రముఖ కథానాయకుడు నితిన్ తదుపరి ఆసక్తికరమైన చిత్రం సాంప్రదాయ పూజా నాణ్యమైన, విజయవంతమైన చిత్రాలను అందించడంలో పేరుగాంచిన ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి, ప్రతిభావంతులైన దర్శకులు నారి సిరిసవాడ మరియు సోమశేఖర్ టి దర్శకత్వం వహిస్తున్నారు. బలమైన సృజనాత్మక బృందం ఏకమవ్వడంతో, ప్రకటనతోనే ఈ ప్రాజెక్ట్‌పై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఈ చిత్రంలో నితిన్ కథానాయకుడిగా నటిస్తుండగా, రితికా నాయక్ కథా నాయికగా నటిస్తున్నారు. సురేష్ బొబ్బిలి సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి ఛాయా గ్రాహకుడిగా అనిత్ మదాడి, కళా దర్శకుడిగా జానీ షేక్ వ్యవహరిస్తు న్నారు. ప్రతిభావంతులైన సాంకేతిక బృందం తమ నైపుణ్యంతో దృశ్యపరంగా ఆకట్టుకునేలా ఈ చిత్రాన్ని రూపొందించనున్నారు. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. ఈ నిర్మాణ సంస్థల కలయికలో ఇప్పటికే పలు విజయవంతమైన చిత్రాలు రావడంతో, ఈ సినిమాపై అందరిలో ఆసక్తి నెలకొంది. ఈ సినిమా చిత్రీకరణ మే రెండో వారం నుండి ప్రారంభం కానుంది. చిత్ర యూనిట్ ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి, షూటింగ్ మొదలుపెట్టడానికి సన్నద్ధమవుతోంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.

## 'పెద్ది' కథ నేచురల్‌గా ఉంది: అవినాష్ కొల్లా



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ రూరల్ యాక్షన్ డ్రామా 'పెద్ది'. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు.

**డైరెక్టర్ బుచ్చిబాబు గారు ఈ కథ చెప్పినప్పుడు ఎలా అనిపించింది?**

నా పదేళ్ల కెరీర్‌లో ఒక కథకి ఇంతలా ఎక్సైట్ అవ్వడం ఇదే ఫస్ట్ టైం. డైరెక్టర్ గారు కథ చెప్పిన తర్వాత ఒక 20 నిమిషాల పాటు నేను మనిషిని కాలేకపోయాను. అంతలా కదిలించింది. కథలోనే ఇంత బలం ఉంది కాబట్టి ప్రొడక్షన్ డిజైన్ పరంగా అన్ని విషయాల్లో చాలా కేర్ తీసుకోవాలని అప్పుడే డిసైడ్ అయ్యాను.

**ఇది పీరియడ్ డ్రామా కదా.. సెట్స్ విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?**

ఒక సినిమాకి సెట్ వేసినప్పుడు అది ఆడియన్స్‌కి సెట్ అని తెలియకపోవాలి. అప్పుడే ఒక ఆర్ట్ డైరెక్టర్ సక్సెస్ అయినట్టు. నా వరకు ఈ సినిమాకి వేసిన సెట్స్‌ను ఆడియన్స్ అవి సెట్ అని గ్రహించలేరు.

**డీవోపీ రత్నవేలు గురించి?**

డీవోపీకి, ఆర్ట్ డైరెక్టర్‌కి ఒక సింక్‌లో ఉంటే సినిమా ఖచ్చితంగా పర్ఫెక్ట్‌గా వస్తుంది. ఇందులో అలాంటి మంచి సింక్ కుదిరింది. రత్నవేలు గారితో పని చేయడం చాలా ఆనందంగా అనిపించింది. మంచి కోఆర్డినేషన్‌తో వర్క్ చేశాం.

**ఇందులో క్రికెట్ ఉంది కదా.. లగాన్ లాగా ఉంటుందా?**

లేదండి. లగాన్ బ్రిటిష్ కాలంలో జరిగిన కథ. ఇది 7080 మధ్యలో విజయనగరం బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుంది. మీరు క్రికెట్ చూస్తున్నప్పుడు మన ఊర్లో పొలాల గట్ల మీద కూర్చుని క్రికెట్ చూస్తే ఎలాంటి ఫీలింగ్ ఉంటుందో అంత నేచురల్ ఫీలింగ్ క్యారీ అవుతుంది.

**పెద్ది కోసం ఎన్ని సెట్లు వేశారు?**

స్క్రాచ్ నుంచి వేసిన సెట్స్ 24 ఉంటాయి. అలా కాకుండా సెటప్స్ అయితే దాదాపు 60 70 పైగానే ఉంటాయి. చిన్న సినిమా అయితే మనం ఎక్కడికైనా వెళ్లి షూట్ చేసుకోవచ్చు. ఇంత పెద్ద స్టార్ కాస్ట్‌తో వెళ్లి షూట్ చేయడం మామూలు విషయం కాదు.

**చరణ్ తో మీ బాండింగ్ ?**

నేను వేసిన ప్రతి సెట్‌ని చరణ్ అప్రిషియేట్ చేశారు. ట్రైన్ సెటప్, స్పెషల్ సాంగ్ సెట్, కుస్తీ... ఇలా ప్రతి సెట్ ఆయనకి చాలా నచ్చాయి.

## త్వరలో నారా రోహిత్ 'ఆర్ఎన్ 23' చిత్రం



చినిమిల్లి మణికుమార్, భరత్ చౌదరి, కరణ్ సి ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పి ప్రొడక్షన్ 5, ఆర్ఎన్ 23 అనౌన్స్‌మెంట్‌కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలకు ప్రాధాన్యం ఇచ్చే రోహిత్ నారా, కరణ్ సి ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌తో తన తదుపరి ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ బ్యానర్ లో ప్రతిష్టాత్మకమైన 5వ ప్రొడక్షన్‌గా రూపొందుతున్న ఆర్ఎన్ 23 కంప్లీట్ రొమాంటిక్ కామెడీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఈ ప్రాజెక్ట్‌ను భరత్ చౌదరి నిర్మిస్తుండగా, చినిమిల్లి మణికుమార్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఆయనే కథ, స్క్రీన్‌ప్లే కూడా అందిస్తున్నారు. యూనివర్సల్ ఎమోషన్స్‌తో కూడిన కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే ఆసక్తి నెలకొంది.'షాటింగ్ సూన్' అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్‌తో ఉన్న అనౌన్స్‌మెంట్ పోస్టర్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునేలా హాస్యం, ప్రేమ, భావోద్వేగాలు, కుటుంబ అనుబంధాలను కలగలిపిన వినోదాత్మక కథతో ఈ సినిమా రాబోతోంది. త్వరలోనే ముహూర్తం వేడుకతో చిత్ర నిర్మాతలు ఈ చిత్రాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు.

## 'వీరభద్రుడు' మే14న గ్రాండ్ రిలీజ్



సూర్య తన మాగ్నమోపస్ మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ 'వీరభద్రుడు' కోసం దర్శకుడు ఆర్జే బాలాజీతో చేతులు కలిపారు. ఈ మోస్ట్ ఎవైటెడ్ మూవీని అనేక విజయవంతమైన చిత్రాలను నిర్మించడం ద్వారా పేరును తెచ్చుకున్న నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తోంది. తాజాగా ఈ చిత్రం సెన్సార్ పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డ్ సినిమాకి యూ/ఏ సర్టిఫికేట్ ఇచ్చింది. తమిళం, తెలుగు, హిందీ పరిశ్రమలలో పాపులర్ కంటెంట్‌ను అందించిన డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని స్కేల్, కంటెంట్ రెండింటినీ దృష్టిలో ఉంచుకుని ప్రతిష్టాత్మకగా తెరకెక్కిస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్, సాంగ్స్ భారీ అంచనాలని సృష్టించాయి. ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా నటిస్తోంది. ఇంద్రన్స్, నట్టి, స్వసిక, అనఘ మాయ రవి కీలక పాత్రలు పోషిస్తున్నారు. సాయి అభ్యంకర్ మ్యూజిక్ అందిస్తున్న ఈ చిత్రానికి జికె విష్ణు సినిమాటోగ్రఫీ. 2026 మే 14న ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్‌గ్రాండ్‌గారిలీజ్ కానుంది.

ఆట

## టేబుల్ టెన్నిస్ వరల్డ్ ఛాంప్స్‌లో
# భారత్ పురుషులు, మహిళల టీమ్స్ ఓటమి

**న్యూఢిల్లీ:** ఐటీటీఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్-2026, రౌండ్ ఆఫ్ 32లో పురుష, మహిళ జట్లు ఓడిపోవడంతో ఈ టోర్నీలో భారత ప్రయాణం నిరాశతో ముగిసింది. భారత పురుషుల జట్టు తమ కంటే చాలా తక్కువ ర్యాంకులో ఉన్న ఆస్ట్రియా చేతిలో 0-3 తేడాతో ఓటమి చవిచూడగా, మహిళల జట్టు పాన్‌అమెరికన్ రజత పతక విజేత అయిన అమెరికా చేతిలో 1-3 తేడాతో పరాజయం పాలైంది. వ్యక్తిగత ర్యాంకింగ్‌ల ఆధారంగా భారత పురుషుల జట్టు ఫేవరెట్‌గా బరిలోకి దిగినప్పటికీ, మాజీ ప్రపంచ 18వ ర్యాంకర్, అనుభవజ్ఞుడైన రాబర్ట్ గార్డోస్ ఆస్ట్రియాకు సానుకూల ఆరంభాన్ని అందించాడు. 47 ఏళ్ల అతను 5గేమ్‌ల పోరులో వెనుకబడి ఉన్నప్పటికీ, అదనపు పాయింట్లలో 6-11, 11-7, 11-3, 8-11, 13-11 స్కోరుతో మనుష్ షాను ఓడించి టైలోని మొదటి మ్యాచ్‌ను గెలుచుకున్నాడు. దీని నుండి భారత్ కోలుకోలేకపోయింది. ఇక



మానవ్ థక్కర్, సత్యన్ జ్ఞానశేఖరన్ పోరాడలేకపోవడంతో తర్వాతి రెండు మ్యాచ్‌లను వరుస గేమ్‌లలో కోల్పోయింది. 18 ఏళ్ల సాలీ మోయ్‌లాండ్, యశస్విని ఘోర్పడేపై వరుస గేమ్‌లలో విజయం సాధించడంతో భారత మహిళల జట్టుకు కూడా నిరాశాజనకమైన ఆరంభం లభించింది. ఆ తర్వాత, రెండో సింగిల్స్‌లో జెస్సికా లాయ్‌పై 4 గేమ్‌ల తేడాతో విజయం సాధించి, భారత నంబర్ 1 క్రీడాకారిణి మణికా బాత్రా స్కోరును సమం చేసి, భారత ఆశలను సజీవంగా ఉంచింది. అయితే ఆ తర్వాత, అనుభవజ్ఞురాలైన లిల్లీ జాంగ్-టీనేజర్ సాలీ వరుసగా దియా చితాలే-మణికా బాత్రాలపై తదుపరి రెండు మ్యాచ్‌లను గెలిచి యుఎస్ఎ కు 3-1 విజయాన్ని అందించారు. దీంతో లండన్‌లో భారత్ ప్రయాణం ముగిసింది. గత రెండు ఎడిషన్లలో చేసినట్లుగా ఈ ఏడాది ఈ టోర్నమెంట్‌లో ఈ రెండు జట్లలో ఏదీ ప్రీక్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకోలేదు.

## మహిళల టీమ్ ర్యాంకింగ్స్‌లో..
# అగ్రస్థానంలో ఆస్ట్రేలియా
### మూడో స్థానంలో భారత్



**న్యూఢిల్లీ:** ఐసీసీ మహిళల టీ20ఐ టీమ్ ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో నిలిచింది. తద్వారా 2026 ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌కు ముందు ఓడించలేని జట్టుగా తనస్థానాన్ని మరోసారి ధృవీకరించుకుంది. ర్యాంకింగ్‌ల ప్రకారం, ఆస్ట్రేలియా 287 రేటింగ్ పాయింట్లతో నం.1స్థానంలో కొనసాగుతోంది. రెండో స్థానంలో ఉన్న ఇంగ్లాండ్ మహిళల క్రికెట్ జట్టుపై వారు ఇప్పుడు 12 పాయింట్ల ఆధిక్యాన్ని కలిగి ఉండగా, భారత్ 264 పాయింట్లతో మూడో స్థానంలో పటిష్టంగా నిలిచింది. ప్రస్తుత టీ20 ప్రపంచ కప్ ఛాంపియన్ న్యూజిలాండ్ 253 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉండగా, దక్షిణాఫ్రికా 243 పాయింట్లతో టాప్ ఐదు స్థానాలను పూర్తి చేసింది. ఇక మధ్య పట్టికలో పోటీ తీవ్రంగా కొనసాగుతోంది, వెస్ట్ ఇండీస్ (238), శ్రీలంక (237) కేవలం ఒక్క పాయింట్ తేడాతో వరుసగా 6, 7 స్థానాల్లో నిలిచాయి. పాకిస్తాన్ 216 పాయింట్లతో 8వ స్థానంలో కొనసాగుతుండగా, ఐర్లాండ్ (200), బంగ్లాదేశ్ (199) మరోసారి అతి స్వల్ప తేడాతో టాప్ 10లో నిలిచాయి. అంతర్జాతీయ క్రికెట్‌లో తన స్థిరమైన పురోగతిని కొనసాగిస్తూ, అమెరికా 98 రేటింగ్ సాధించి రెండు స్థానాలు ఎగబాకి 20వ స్థానానికి చేరడంతో, చెప్పుకోదగ్గ మార్పులు చోటుచేసుకున్న జట్లలో ఒకటిగా నిలిచింది. జర్మనీ కూడా 10 రేటింగ్ పాయింట్లు సాధించి, ఆరు స్థానాలు పైకి ఎగబాకి 29వ స్థానంలో టాప్ 30లోకి ప్రవేశించి గణనీయమైన పురోగతిని సాధించింది.



## ప్లే ఆఫ్స్ రేసు
# రసవత్తరం

### ప్రత్యర్థులకు చెన్నై గట్టి సవాల్.. ఢిల్లీ ఆశలు గల్లంతేనా?

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 సీజన్ క్లైమాక్స్ దిశగా సాగుతుండటంతో ప్లేఆఫ్స్ రేసు రసవత్తరంగా మారింది. ఒకప్పుడు వన్ సైడ్ గా సాగుతుందనుకున్న టాప్4 పోరు ఇప్పుడు అనూహ్య మలుపులు తిరుగుతోంది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన కీలక పోరులో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) ఘనవిజయం సాధించడంతో పాయింట్ల పట్టికలో సమీకరణాలు మారిపోయాయి. మొదట్లో వరుస ఓటములతో సతమతమైన చెన్నై, ఇప్పుడు వరుస విజయాలతో ప్రత్యర్థులకు గట్టి సవాల్ విసురుతోంది. న్యూఢిల్లీలో జరిగిన ఈ మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ అన్ని విభాగాల్లోనూ అదరగొట్టింది. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో రన్ చేజ్ చేసి గెలవడం చెన్నై ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది. ఈ విజయంతో చెన్నై సూపర్ కింగ్స్ ఖాతాలో 2 కీలక పాయింట్లు చేరాయి. ఇప్పటివరకు 10 మ్యాచ్‌లు ఆడిన రుతురాజ్ టీమ్, 5 విజయాలు, 5 ఓటములతో మొత్తం 10 పాయింట్లు సాధించింది. అయితే, పాయింట్లు పెరిగినప్పటికీ పట్టికలో చెన్నై స్థానంలో మార్పు రాలేదు. ప్రస్తుతం సీఎస్కే 6వ స్థానంలోనే కొనసాగుతోంది. కానీ ఈ గెలుపు వల్ల నెట్ రన్ రేట్ (+0.151) గణనీయంగా మెరుగుపడింది. 12 పాయింట్లతో ఉన్న గుజరాత్ టైటాన్స్ ప్రస్తుతం చెన్నై కంటే ముందు వరుసలో ఉంది. ఇక ఈ మ్యాచ్‌లో గెలిచి ఉంటే ఢిల్లీ 10 పాయింట్లతో చెన్నైని వెనక్కి నెట్టి ఆరో స్థానానికి వెళ్లేది. కానీ ఓటమి వల్ల ఢిల్లీ 10 మ్యాచ్‌ల్లో 8 పాయింట్లతో 7వ స్థానంలోనే ఉండిపోయింది. ఢిల్లీ ప్లేఆఫ్స్ చేరాలంటే తమ మిగిలిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ తప్పక గెలవాల్సి ఉంటుంది. అలా గెలిస్తే 16 పాయింట్లతో రేసులో నిలిచే అవకాశం ఉంటుంది. కానీ ప్రస్తుత ఫామ్ చూస్తుంటే ఢిల్లీకి అది అంత సులభం కాదు. ప్రస్తుత ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టికలో పంజాబ్ కింగ్స్ 13 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. రాజస్థాన్ రాయల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు, సన్ రైజర్స్ హైదరాబాద్ కూడా టాప్4 లో కొనసాగుతున్నాయి. ఇక పట్టికలో అందరికంటే అట్టడుగున లక్నో సూపర్ జెయింట్స్ ఉంది. కేవలం 4 పాయింట్లతో ఉన్న లక్నోకు ప్లేఆఫ్స్ ఆశలు దాదాపు మూసుకుపోయినట్లే. చెన్నై తన తదుపరి మ్యాచ్‌ల్లోనూ ఇదే జోరు కొనసాగిస్తే టాప్4 లోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది.

## మహిళల ఆసియా కప్‌లో
# భారత్ ఓటమి
### 0-3 తేడాతో జపాన్ గెలుపు

**న్యూఢిల్లీ:** ఏఎఫ్‌సి అండర్17 మహిళల ఆసియా కప్ 2026 గ్రూప్ బి రెండవ మ్యాచ్‌లో జపాన్ చేతిలో 0-3 తేడాతో భారత్ ఓటమి చవిచూసింది. దీంతో భారత్ మహిళల జట్టు క్వార్టర్ ఫైనల్ ఆశలు లెబనాన్‌తో జరిగే చివరి గ్రూప్ మ్యాచ్‌పై ఆధారపడి ఉంది. సుజౌలో జరిగిన ఈ మ్యాచ్‌లో జపాన్ బంతిపై ఆధిపత్యం చెలాయించినప్పటికీ, యంగ్ టైగ్రెసెస్ తొలి అర్ధభాగంలో క్రమశిక్షణతో కూడిన ప్రదర్శనను కనబరిచి, పటిష్టమైన రక్షణ వ్యూహాన్ని కొనసాగించింది. భారత్ స్పష్టమైన గోల్ అవకాశాలను కట్టడి చేసి, విరామ సమయానికి స్కోరు సమం అయింది.. తొలి మ్యాచ్‌లో 13 గోల్స్ చేసిన జట్టుపై ఇది ఒక చెప్పుకోదగ్గ ప్రదర్శన. అయితే ద్వితీయార్ధపు ఒత్తిడి నిర్ణయాత్మకంగా నిలిచింది. 59వ నిమిషంలో యూమి హయాషి ద్వారా జపాన్ తొలి గోల్ సాధించింది. ఆమె బంతిని గోల్‌లోకి పంపడంతో భారత్ ప్రతిఘటనకు



తెరపడింది. ఈ గోల్‌తో ఆట గమనం పూర్తిగా జపాన్ వైపు మళ్లింది. వారు తమ దాడి తీవ్రతను పెంచి, భారత రక్షణ శ్రేణిలోని ఖాళీలను సద్వినియోగం చేసుకోవడం ప్రారంభించారు. ఆట ముగింపు దశలో యుజుహా ఇకెడా 76వ, 81వ నిమిషాల్లో మరో రెండు గోల్స్ చేసి జట్టుకు సంపూర్ణ విజయాన్ని అందించింది. ఈ ఎదురుదెబ్బతో భారత్ తమ ప్రయత్నాన్ని కొనసాగించినా కోలుకోలేకపోయింది. ఇక గ్రూప్ దశలో ఒక మ్యాచ్ మిగిలి ఉండగా, నాకౌట్ దశకు చేరుకునే అవకాశాలను సజీవంగా ఉంచుకోవాలంటే భారత్ ఇప్పుడు లెబనాన్‌పై తప్పక గెలవాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటోంది.

## ఆర్చరీ వరల్డ్ కప్‌లో పురుషులు, మహిళల జట్లు విఫలం

**న్యూఢిల్లీ:** ఆర్చరీ ప్రపంచ కప్ 2వ దశ పోటీల్లో పతకం గెలవడంలో భారత్ పురుషుల, మహిళల కాంపౌండ్ జట్లు విఫలమయ్యాయి. అయితే వ్యక్తిగత విభాగంలో ఒకింత ఊరట లభించింది. భారత కాంపౌండ్ ఆర్చర్లందరూ 32 మందితో కూడిన రౌండ్‌కు అర్హత సాధించారు. భారత కాంపౌండ్ పురుషుల, మహిళల జట్లు బుధవారం షాంఘైలో జరిగిన ఈ పోటీల్లో నిరాశాజనకమైన ప్రదర్శనను ఎదుర్కొన్నాయి. కీలక పరిస్థితులలో తడబడి పోడియం స్థానాన్ని దక్కించుకోవడంలో విఫలమయ్యాయి. జ్యోతి సురేఖ వెన్నం, ప్రగతి, అదితి స్వామిల త్రయం క్వార్టర్ ఫైనల్స్‌లో టర్కీ చేతిలో 227-233 తేడాతో ఓడిపోయి నిష్క్రమించింది. రెండో ఎండ్ నుంచి పట్టు సాధించి, చివరి వరకు వదలకుండా 6 పాయింట్ల తేడాతో సునాయాస విజయాన్ని ఖాయం చేసుకున్న హాజల్ బురున్, డెఫ్నే కాక్మాక్, ఎమినే రబియా ఓగుజ్‌ల నిలకడను భారత త్రయం అందుకోలేకపోయింది. అలాగే ఓజస్ డియోటాలే, సాహిల్ జాదవ్, కుశాల్ దలాల్‌లతో కూడిన పురుషుల జట్టు సెమీఫైనల్స్‌కు చేరి ఆశలు రేకెత్తించినప్పటికీ, అత్యంత కీలకమైన



సమయంలో ఒత్తిడికిగురై వరుసగా రెండు ఓటములతో ఒట్టిచేతులతో వెనుదిరిగింది. కాంస్య పతకం కోసం జరిగిన మ్యాచ్‌లో, స్కోర్లు 234-234తో సమం అయిన తర్వాత జరిగిన ఉత్కంఠభరితమైన షూట్ ఆఫ్‌లో భారత్ చైనాచేతిలో ఓడిపోయింది. షూట్‌ఆఫ్ కూడా ఇరు జట్లూ చెరో మూడు పాయింట్లతో సమంగా ముగిసినప్పటికీ, భారత్ కన్నా చైనా గురి కేంద్రానికి మరింత దగ్గరగా ఉండటంతో ఈ పోటీని కైవసం చేసుకున్నారు.

వాణిజ్యం



# విదేశీ ఇన్వెస్టర్లకంటే దేశీయ ఇన్వెస్టర్లే పెట్టుబడుల్లో టాప్!

**న్యూఢిల్లీ,మే 6:** విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లకంటే దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లే స్టాక్ మార్కెట్లకు ఊతం ఇస్తున్నారు. ఎన్ఎస్ఇ 500 కంపెనీల్లో దేశీ ఇన్వెస్టర్ల వాటా 20.9శాతంగా ఉంది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల వాటా 17.1శాతానికి క్షీణించింది. గ్లోబల్‌స్థాయిలో పెరిగిన అనిశ్చితితో విదేశీ ఇన్వెస్టర్లు తొలిత్రైమాసికంలో 15.8 బిలియ్ డాలర్లు విత్‌డ్రాచేసారు. ఒక్క మార్చిలోనే 14.2 బిలియన్ డాలర్లను విక్రయించారు. ఇక దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు 27.2 బిలియన్ డాలర్లు కుమ్మరించారు. ఎక్కువగా సిప్ నిధులే అగ్రభాగంలో ఉన్నట్లు మోతీలాల్ ఓస్వాల్ నివేదికలో వివరించింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న భారత స్టాక్ మార్కెట్‌లో మొట్టమొదటిసారిగా కీలక నిర్మాణాత్మక పరివర్తనం దిశగా వెళుతోంది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు ఏళ్లతరబడి మార్కెట్లను శాసించారు. దిశానిర్దేశంచేసారు. మార్పులు,సవరణలు, విలువలను కూడా ప్రభావితంచేసారు. ఇపుడు ఆ ఎఫ్ఐఐల ప్రాభవం క్షీణిస్తోంది. మోతీలాల్ ఓస్వాల్ తాజా డేటాను చూస్తే దేశీయ సంస్థాగత ఇవ్వెస్టర్లు మూచువల్‌ఫండ్స్, బీమా కంపెనీలు, రిటైల్ నిధులు వంటివి భారత ఈక్విటీ మార్కెట్లకు కొత్త దిశానిర్దేశంచేస్తున్నాయనే చెప్పాలి. మరీ ఫిబ్రవరినుంచి చూస్తే ఎఫ్ఐఐలు ఇరాన్‌యుద్ధంతో వెనుకంజవేసారు. ఎఫ్ఐఐలు భౌగోళిక ఉద్రిక్తతలను కూడా పరిగణనలోనికి తీసుకుని పెట్టుబడులు పెడుతుంటారు. ఇదే తీరున పరిశీలిస్తే దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు వాటా 170 బేసిస్ పాయింట్లు పెరిగితే విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల యాజమాన్యం 180 బేసిస్ పాయింట్లు దిగజారింది. మొత్తం 24 రంగాల్లో దేశీయ ఇన్వెస్టర్లు పెట్టుబడులు కుమ్మరిస్తున్నారు. ప్రైవేటు బ్యాంకులు, టెక్నాలజీ, టెలికామ్, రియల్‌ఎస్టేట్, హెల్త్‌కేర్, ఇన్‌ఫ్రారంగాల్లో పెట్టుబడులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎఫ్ఐఐలు కేవలం 17 రంగాలకే ప్రాధాన్యం ఇచ్చారు. టెక్నాలజీ రంగంలో 7.3శాతం మాత్రమే ఉంది. బిఎఫ్ఎస్ఐ 32.1శాతం, ఆటోమొబైల్స్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాల్లోకూడా తగ్గింది. రక్షణాత్మకమైన లార్జ్‌క్యాప్ సంస్థలవైపు మలుతున్నారు. అయినా కూడా ఎఫ్ఐఐలు ఆమ వాటాలు మూడు కేటగిరీల్లోను తగ్గించారు. అదే డిఐఐలు తమ పెట్టుబడుల వాటా పెంచుకుంటున్నారు.




# క్షీణించిన పేటిఎం లాభాలు!

**ముంబయి, మే 6:** డిజిటల్‌చెల్లింపుల సంస్థ పేటిఎమ్ మాతృసంస్థ వన్ 97 కమ్యూనికేషన్ నికరలాభం నాలుగో త్రైమాసికంలో 18.2శాతం క్షీణించింది. కంపెనీ నికరంగా రూ.184 కోట్ల నికరలాభం మాత్రమే ఆర్జించగలిగింది. అంతకుముందుత్రైమాసికంలో రూ.225 కోట్లు ఆర్జిస్తే ఈసారి గణనీయంగా తగ్గింది. రాబడులు మాత్రం 3.2శాతంపెరిగి 2264కోట్లుగా ఉన్నాయి. అదే మూడో త్రైమాసికంలో రూ.2194 కోట్లు మాత్రమే రాబట్టుకోగలిగింది. పన్నులచెల్లింపులు, వడ్డీ, తరుగుదల వంటివివాటికి ముందు లాభాలు 5.4శాతం దిగజారి రూ.132 కోట్లుగా ఉన్నాయి. అంతకుముందు త్రైమాసికంలో రూ.156 కోట్లనుంచి గణనీయంగా క్షీణించింది. ఇక మార్జిన్‌కూడా 7.1శాతంనుంచి త్రైమాసికం వారీగా 5.8శాతానికి దిగిపోయింది.

# రూ.166.3 కోట్లకు తగ్గిన మీషో నష్టాలు!

**ముంబయి, మే 6:** ప్రైవేటు డిజిటల్‌మార్కెటింగ్ సంస్థ మీషో నాలుగోత్రైమాసికంలో 166.3 కోట్లనష్టం చవిచూసింది. అయితే గత ఏడాది ఇదేకాలంలో ఎదురయిన రూ.1391 కోట్లతోపోలిస్తే గణనీయంగా తగ్గించుకోలిగింది. రాబడులు మాత్రం 47శాతంపెరిగి రూ.3531 కోట్లుగా ఉన్నాయి. అదే గత ఏడాది నాలుగోత్రైమాసికంలో రూ.2400 కోట్లుమాత్రమే ఆర్జించగలిగింది. ఎబిడిటా చూస్తే రూ.255 కోట్లుగా ఉంది. ఈకామర్స్ కంపెనీ నికర వాణిజ్య విలువలు రూ.11,371 కోట్లుగా ఉంది.సాలీనా 43శాతం పెరిగినట్లు చెపుతోంది. 717 మిలియన్‌ల ఆర్డర్లు వచ్చాయని, కొత్త కస్టమర్లు కూడా భారీ




స్థాయిలోపెరుగుతున్నట్లు పెరిగింది. సాలీనా కస్టమర్లు 33శాతంపెరిగి 264 మిలియన్లకు చేరినట్లు తేలింది. ఆర్డర్లు కూడా 45శాతంపెరిగి 2.67 బిలియన్‌లకు చేరాయి. ఇక నికర వాణిజ్య విలువలు వార్షికపద్ధతిలోచూస్తే రూ.41,560 కోట్లుగా ఉంది. ఏటికేడాది 39శాతంపెరిగినట్లు తేలింది. ప్రతి కస్టమరు సాలీనా 10.1 లావాదేవీలునిర్వహిస్తున్నట్లు మీషో వెల్లడించింది. చైనా, ఆగ్నేయాసియా, లాటిన్ అమెరికా మార్కెట్లనుంచి కూడా 80శాతం మార్కెట్ వాటాపెరిగిందని, స్మార్ట్‌ఫోన్ యూజర్లు ఆన్‌లైన్‌లోనే షాపింగ్‌చేస్తున్నట్లు సిఇఒ వ్యవస్థాపకులు విదిత్ ఆత్రే తెలిపారు. భారత్ వాటా 30శాతంగా ఉందని, ఎక్కువ ఆన్‌లైన్ షాపింగ్ ఇష్టపడకపోవడమే కారణమని అన్నారు. మీషో స్టాక్స్ 3.6శాతం దిగువన రూ.196.28 చొప్పున ట్రేడ్ అయ్యాయి.




## ఇరాన్ వార్ సడలింపులతో
# లాభాల్లో సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, మే 6:** ఈక్విటీ మార్కెట్లు బుధవారం లాభాల్లో ముగిసాయి. ప్రారంభంలోనే లాభాలతో సూచీలు ప్రారంభం కావడం విశేషం. ప్రాజెక్టు ఫ్రీని నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ప్రకటించడంతో ఒక్కసారిగా ముడిచమురుధరలు దిగివచ్చాయి. అలాగే అంతర్జాతీయ ధోరణులు కూడా సానుకూలం కావడంతో మార్కెట్లకు జోష్ లభించింది. బిఎస్ఇ సెన్సెక్స్ 940.73 పాయింట్లుపెరిగి 77,958.52 పాయింట్లవద్ద ముగిస్తే నిఫ్టీ 50 సూచీ కూడా 298.15 పాయింట్లుపెరిగి 24,330.95 పాయింట్లవద్ద స్థిరపడింది. ఎస్‌బిఐ 3.38శాతం, హెచ్‌బిఎఫ్‌సి 3.11శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 2.24శాతం సూచీలకుబూస్ట్ ఇచ్చాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ 1.67శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 1.77శాతం లాభపడ్డాయి. బిఎస్ఇలో 2862కంపెనీలు లాభాల్లో కొనసాగితే 1365 షేర్లు వెనుకంజవేసాయి. 172 షేర్లుమాత్రం స్థిరంగా కొనసాగాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత్‌రూపాయి రూ.94.57వద్ద కదలాడింది. అంతకుముందు 95.18 వద్దముగిసిన సంగతి తెలిసిందే. పదేళ్ల బెంచ్‌మార్కు బాండ్ 1.71శాతం క్షీణించి కూపన్‌రేటు 6.896శాతంగా ఉంది. ఎంసిఎక్స్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ జూన్5 సెటిల్‌మెంట్లు 2.05శాతం క్షీణించి రూ.1,52,763కి చేరాయి. అలాగే అమెరికా పదేళ్ల బాండ్ల రాబడులు 1.67శాతం క్షీణించి 4.344శాతంగా కొనసాగాయి. కమోడిటీమార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు జులై సెటిల్‌మెంట్లు 9.27డాలర్లు క్షీణించి 100.60డాలర్లుగా కొనసాగింది. గ్లోబల్‌మార్కెట్లలో అమెరికా డౌజోన్స్ ఫ్యూచర్స్ 539 పాయింట్లుపెరిగింది. యూరోపియన్‌సూచీలుకూడా లాభాల్లోనే ముగిసాయి. ఆసియా సూచీలు కూడా పైపైకి కొనసాగాయి. వాల్‌స్ట్రీట్‌మార్కెట్‌ధోరణులను అంచనావేస్తూ ఆసియా మార్కెట్లు కొనసాగాయి. ఇక ఎస్అండ్‌పి 500 0.81శాతంపెరిగింది. నాస్‌డాక్ కాంపోజిట్‌కూడా 1.03శాతం పెరిగి ఆల్‌టైమ్‌గరిష్టానికి చేరింది. డౌజోన్స్ పారిశ్రామిక సగటు కూడా 356.35 పాయింట్లు పెరిగింది. ఇక దేశీయంగాచూస్తే స్పైస్‌జెట్ 4.96శాతం, కాఫోర్జ్ 9.62శాతం, అజంతా ఫార్మా 6.63శాతం, ఆయే ఫైనాన్స్ 9.34శాతం, వొడాఫోన్ ఐడియా 4.63శాతం, రేమండ్ రియాల్టీ 20శాతంచొప్పున పెరిగాయి. కెపిఐ రగీన్ ఎనర్జీ 5.73శాతంపెరిగితే ఎల్అండ్‌టి 1.18శాతం క్షీణించింది. నికరలాభాలు క్షీణించడమేఇందుకు కీలకం. హీరోమోటోకార్ప్ 1.11శాతం, ఎస్ఆర్ఎఫ్ 7.59శాతంర్యాలీతీస్తే యునైటెడ్‌బ్రూవరీస్ 2.31శాతం క్షీణించింది.

## ఎన్ఎస్ఇలో ఇద్దరు ఇడిల నియామకానికి
# సెబీ గ్రీన్‌సిగ్నల్!

**ముంబయి, మే 6:** నేషనల్ స్టాక్‌ఎక్స్ఛేంజి ఎన్ఎస్ఇలో ఇద్దరు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల నియామకాలను సాక్ నియంత్రణ సంస్థ సెబీ ఆమోదించింది. వర్టికల్ వన్ కార్యకలాపాలకోసం వైరల్‌మోడీ నియామకాన్ని ఆమోదిస్తే వర్టికల్ 2 కేటగిరిలో సంజయ్‌షోరే నియామకాన్ని సెబీ ఆమోదించింది. ఇన్వెస్టర్ల ఫిర్యాదులు, రిస్క్ మేనేజ్‌మెంట్, ప్రభుత్వ నిబంధనల అమలు, నివేదికల పర్యవేక్షణ వంటివివీరు చూస్తారు. ఈ నియామకాలు జూన్‌లోపు చేయాల్సి ఉండటంతోస ఎబీ వీరి నియామకాలకు ఆమోదం తెలిపింది. వీరిలో వైరల్‌మోడీ ఎన్ఎస్ఇలో రెండు దశాబ్దాలపాటు సేవలందిస్తూనే ఉన్నారు. చీఫ్ టెక్నాలజీ అధికారిగా పని చేసారు. షోరే కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో డైరెక్టర్ జనరల్‌గా కొనసాగారు. వీరి పదవీకాలం ఐదేళ్లపాటు ఉంటుంది. వీరు



నేరుగా ఎన్ఎస్ఇ ఎండికి రిపోర్టుచేస్తారు. వీరిని తొలగించాలని భావిస్తే ఎండికి వర్తించే నిబంధనలన్నీ వర్తిస్తాయని సెబీ వెల్లడించింది. వీరినియామకం వల్ల మార్కెట్‌మౌలికవనరుల సంస్థలను మరింత పటిష్టంచేస్తుంది. అలాగే ఎన్ఎస్ఇ బోర్డులో పిఆర్‌రమేష్‌ను పబ్లిక్ ఇంటరెస్ట్ డైరెక్టర్‌గా నియామకంచేసింది. రమేష్ డెల్లాయిట్ ఇండియాకు మాజీ ఛైర్మన్‌గా ఉన్నారు. ఆయన నియామకం మూడేళ్లపాటు కొనసాగుతుంది. గడచిన రెండునెలల్లో ఎన్ఎస్ఇ తన బోర్డును మరింత పటిష్టంచేసుకుంది. రాజీవ్ వాసుదేవను పబ్లిక్ ఇంట్రెస్ట్‌డైరెక్టర్‌గాను, దినేశ్‌పంత్ ఎస్ఐసి నామినీ డైరెక్టర్‌గాను నియమించింది. అంతకుముందు బిఎస్ఇ కూడా రెండు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల పదవులకోసంఎంపికచేసిన జాబితానుసెబీ ఆమోదం కోసం సిఫారసుచేసింది.



# 12.99 మి. ట.లకు ఉక్కు ఉత్పత్తి!

**ముంబయి, మే 6:** భారత్‌లోని ఉక్కుతయారీ రంగం గతనెలలో వృద్ధినమోదుచేసింది. ఉక్కు వినియోగం కూడా వార్షికపద్ధతిలో 8.1శాతం పెరిగి 12.99 మిలియన్ టన్నులకు చేరింది. దేశీయంగా ధరలు కొంతమేర రికవరీ అయ్యాయి. ఉక్కు మంత్రిత్వశాఖ జారీచేసిన వివరాలప్రకారం నిర్మాణరంగం, మౌలికవనరులు, తయారీ రంగం కార్యకలాపాలుపెరగడంతో ఉక్కు డిమాండ్ పెరిగింది. వీటికితోడు ముడి ఇనుము ఉత్పత్తి 14.09మిలియన్ టన్నులకు పెరిగింది. పూర్తి శుద్ధిచేసిన ఉక్కు ఉత్పత్తి కూడా 13.05మిలియన్ టన్నులుగా ఉంది. గత ఏడాదితోపోలిస్తే 3.4శాతం పెరిగింది. ఇక హాట్‌మెటల్ ఉత్పత్తి 5.4శాతంగా ఉంది. పిగ్ ఐరన్ ఉత్పత్తి మాత్రం 6శాతం క్షీణించి 69 లక్షల టన్నులకు మాత్రమే ఉంది. ఇక వాణిజ్యపరంగాచూస్తే భారత్ ఏప్రిల్‌లో ఉక్కు దిగుమతులపైనే ఆధారపడింది 30.8శాతంపెరిగి 0.68 మిలియన్‌టన్నులకు చేరింది. ఎగుమతులు 24.9శాతంపెరిగి 0.47మిలియన్‌టన్నులయితే దిగుమతులు వాటిని అధిగమించాయి. ఇక ఉక్కుధరలు కూడా కొంతమేర పెరిగాయి. పొడవాటి ఉక్కు ఉత్పత్తులు టిఎంటి రిబార్ ధరలు 2.6శాతంపెరిగాయి. వార్షికపద్ధతిలోచూస్తే 3శాతం పెరిగినట్లు తేలింది. ఇక హాట్‌రోల్ కాయిల్ ఉత్పత్తులధరలు కూడా 6.3శాతం, జిపిషీట్ ఉత్పత్తులధరలు 7.3శాతం పెరిగాయి. ముడి ఉక్కు ధోరణులు మాత్రం మిశ్రమంగా ఉన్నాయి. దేశీయంగా ముడి ఇనుము ధరలు 10-11శాతంపెరిగాయి. అంతర్జాతీయ కోకింగ్‌కోల్ ధరలు కూడా పెరిగాయి. ఉత్పత్తి వ్యయాలు ఒత్తిడి పెడుతున్నా ధరలు కొంతమేర ఊరటనిచ్చినట్లు తెలుస్తోంది. భారత్ ఉక్కు ఉత్పత్తి సామర్థ్యం సాలీనా 220 మిలియన్‌టన్నులక చేరింది. 2030 నాటికి 300 మిలియన్ టన్నులకు చేరుతుందని అంచనావేస్తున్నారు. టాటా స్టీల్, సెయిల్, జెఎస్‌డబ్ల్యుస్టీల్, జెఎస్‌పిఎల్; ఎఎంఎన్ఎస్ విస్తరణ బాటలో ఉండటం, టాటాస్టీల్ రూ.3200 కోట్ల తుక్కు ఆధారిత ఉక్కు ప్లాంట్‌ను ఏర్పాటుచేస్తుండటం ఉత్పత్తి పెరగడానికి దోహదంచేస్తోంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.